అంతరాత్మ

చిత్రకాంగం
గంగాధర్

● నవల

SHOUT
SHARE
IT

మృతనగరంలో

నవల

చిత్రకొండ గంగాధర్

పల్లవి పబ్లికేషన్స్

విజయవాడ

మృతనగరంలో

- చిత్రకొండ గంగాధర్

టైటిల్ బుక్ డిజైన్ : పి.ఎస్.చారి

మొదటి ముద్రణ : 2020

ప్రతులకు :

పల్లవి పబ్లికేషన్స్

విజయవాడ

ఫోన్ : 9866115655 8985608936

వెల : 110/-

దిశ

ఓటమి లోయలో నవ్వులు వికసిస్తున్నాయి
కుర్రవాని ఆత్మ స్థైర్యం ముందూ వెనకా చుట్టూ
యీ ప్రపంచమంతా గుండెనిబ్బరం వైపే వాలివుంది
అక్కడే తుఫాను హెూరు మొదలౌతుంది

ఒక అసాంఘికుడి ఆత్మకథ

దాదాపు రెండు సంవత్సరాలక్రితం నా ప్రియమిత్రుడు, సంచారజీవి, కవి చిత్రకొండ గంగాధర్ చనిపోయాడని ఈ లోకానికి తెలిసింది. అలా మనకు తెలియడానికి ముందే, చాలాకాలం క్రితమే తన ఊరిలో తనకు తానుగా అతను చెరువులోకి నడుచుకుంటూ వెళ్ళి తన శరీరాన్ని విడిచిపెట్టాడు. అతను అలా నిజంగా ఆత్మహత్య చేసుకోడానికిముందే అనేక సంవత్సరాల క్రితమే మరణించాడు. అంతకుముందెప్పుడో ఆదిమకాలంలోనే ఈ లోకం మరణించింది. తన పుట్టుకతోనే మరణాన్ని కలగన్న రోజే మనిషి జీవించడానికి కావలసిందేదో ఏనాడో ఈ భూమ్మీద నశించింది.

ఎప్పుడో 2011 ఆగస్టు నెలలో చివరిసారి నాకు కనిపించిన గంగాధర్ ఆ తరువాత ఇంకెప్పుడూ కనిపించలేదు. అతడికోసం వెతుకుతూ తను రాసిన కవితని పూడూరి రాజిరెడ్డికి చెప్పి ఫొటోతో సహా సాక్షి దినపత్రిక సాహిత్యపేజీలో వేయించాను. దాన్ని చూసి అయినా నాకు ఫోన్ చేస్తాడని ఎక్కడో ఆశ. జేబులో కలమూ, కాగితమూ ఉండని గంగాధర్ తనకెప్పుడూ నోటికి గుర్తుండే నా నెంబరుకు ఫోను చేస్తాడని ఏ అన్నోన్ నెంబర్ నన్ను పలకరించినా ఆతృతగా ఫోను ఎత్తేవాడిని. చివరికి సంవత్సరాలు గడిచి అతడి ఊరిని గూగుల్‌లో వెతికి ఆ ఊళ్ళో ఎవరిదో ఫోన్ నెంబరు సంపాదించి అక్కడ అతడికి అయినవారిని అడిగి చివరికి ఈ చిత్రవిచిత్రమైన చిత్రకొండ గంగాధర్ ఎప్పుడో అప్పటికి (2017) ఏడేళ్ళ క్రితమే ఈ భూమిని విడిచి వెళ్ళిపోయాడని తెలుసుకుని హతాశుడినయ్యాను. ఎక్కడో దూరంగా శ్రీకాకుళంజిల్లా అక్కడికి ఇంకా అవతల కాశీబుగ్గ అవతల మారుమూల బొడ్డపాడులో 1974 జనవరి 25న కళ్ళు తెరిచిన గంగాధర్ అనేక నగరాలు తిరిగి అనేక మరణాల తరవాత చివరికి 2011 సెప్టెంబరు 25న తిరిగి ఆ ఊరే చేరుకుని అదే నేలమీద చెప్పులు విడిచి చెరువులోకి నడుచుకుంటూ వెళ్ళి తుదిశ్వాస విడిచాడు.

సుకుమారుడూ, సున్నిత మనస్కుడూ, మౌనీ, యోగీ, విరాగీ అయిన గంగాధర్ లోకంలో అన్నీ చూసి జీవితంలో దేనినీ చేతులతో తాకకుండానే ఆ రకంగా ఈ లోకం నుంచి నిష్క్రమించాడు. నడిచినంతమేరా ఉలిదెబ్బలు తిని రాటుదేలిన ఈ మనిషి అశేషమయిన మానవుల జీవన కార్యకలాపాల్లోనే ఏదో పాపం ఉందని, అందులో పాలుపంచుకోవడమే మహాపాపమని భావించి జీవితరంగం నుంచి ఒట్టిచేతులతో విరమించుకున్నాడని ఒక్కోసారి నాకనిపిస్తూ ఉంటుంది.

ఈ లోకం చేత తిరస్కరించబడినవారు కొందరుంటారు. కూలీలు, హమాలీలు, డబ్బు సంపాదించలేనివారు, తెలివితక్కువ వారు, మందబుద్దులు, ముష్టివాళ్ళు, కుష్ఠు వాళ్ళు, వేశ్యలు, అనాథలు, అందవికారులు, మందభాగ్యులు. వీరంతా తిరస్కృతులు. బహిష్కృతులు. వీళ్ళంతా బాధలు పడేవాళ్ళు, వీళ్ళంతా భయంతో బతికేవాళ్ళు. అభద్రజీవులు. దీనులు, హీనులు.

వీళ్ళలోనే వీళ్ళలాకాక ఈ లోకాన్నీ, జీవితాన్నీ తిరస్కరించినవారు కొంద రుంటారు. కొందరు లోపలికి ముడుచుకునేవాళ్ళు, కొందరు అన్నిటినీ విడిచిపెట్టేవాళ్ళు, అసహ్యించుకునేవాళ్ళు, లోకవృత్తం అర్థమయి నవ్వుకునేవాళ్ళు, నిరంతరం దేనికోసమో వెతుక్కుంటూపోయే సంచారులు, ఏదీ వెతకక, దేనితోనూ పనిలేక అలా కూర్చుండి పోయే విరాగులు, బైరాగులు. వీళ్ళంతా లోకంపోకడకి పారిపోయే పిరికివాళ్ళు కారు. గంగాధర్ ఈకోవకి చెందినవాడు. ఇల్లూ వాకిలి, ఊరూవాడా విడిచిపెట్టి తనకి మాత్రమే గోచరించే వెలుగునేదో వెతుక్కుంటూ అనుదినం వెంటాడే వెలితి బరువుని భుజానేసుకుని అతడు ఈ లోకయాత్రకి బయలుదేరాడు. ఇలా ఉండబోతుంది అనుకున్న సుఖమయ జీవితాన్ని అతడు ముందే ఊహించి దాన్ని సంపూర్ణంగా తిరస్కరించాడు. అతడు ఆశావాది కాడు. అలా అని నిరాశావాది అసలే కాడు. అతడిలో దిగులూ, దైన్యమూ ఏ కోశానా లేదు. అతడంతే. పైకి సిగ్గరి, బిడియస్తుడిలా కనిపించే గంగాధర్ లోకమూ, జీవితమూ నలిపి పడేసిన అలగాజనం తరపున వకాల్తా పుచ్చుకున్న మనిషిలా కనిపిస్తాడు. ఐచ్ఛికంగా కఠినమైన శ్రమనే తన దైనందిన జీవితంగా గడిపిన శ్రమజీవి.

సుమారు పాతికేళ్ళక్రితం నాకు పరిచయమైన గంగాధర్ మొదటిసారి కవి ఎం.ఎస్.నాయుడితో కలిసి నా గదికి వచ్చాడు. అప్పటినుండి ఎప్పుడన్నా నా దగ్గరకి వచ్చే గంగాధర్ ఎప్పుడూ ఒకచోట ఉండేవాడు కాదు. వెళ్ళినవాడు రెండుమూడు రోజుల దాకా తిరిగి వచ్చేవాడు కాదు. ఎప్పుడన్నా వచ్చినప్పుడు ఆ రాత్రి పడుకుని మరునాడు ఉదయమే స్నానం చేసి ఒంటిమీదున్న బట్టలు ఉతుక్కుని తిరిగి ఆ తడిసినబట్టలే వేసుకునేవాడు. అసలు వెళ్ళినవాడు ఎప్పుడు వస్తాడో తెలియదు. దానికో సమయమంటూ ఉండేది కాదు. నిజానికి అతడికి ఈ సంచార జీవనం, కూలిపని చేసుకోవాల్సిన పనిలేదు. ఊళ్ళో అతడికి ఇల్లూ, పొలమూ ఉన్నాయి. అతడికోసం ఎదురుచూసే ముసలితల్లి ఉంది. అతడు తన తండ్రి సింహాచలం గురించి చెబుతుండే వాడు గాని తన ఊరు గురించి, కుటుంబ సభ్యుల గురించి చెప్పేవాడు కాదు. అతడికి చనిపోయిన తన తండ్రిమీద బెంగ ఉండేది. తండ్రి పనిచేసిన చిత్రకొండ

అనే ఊరుమీద బెంగ ఉండేది. అ ఊరిపేరునే తన ఇంటిపేరుగా తగిలించుకున్నాడు. ఎక్కడో శ్రీకాకుళం నుంచి బయలుదేరిన మనిషి కాకినాడ పోర్టులో బరువులు మోసే కూలీగా బతికాడు. హైదరాబాద్ వచ్చినప్పుడు తోటమాలి, సెక్యూరిటీ గార్డు, బేల్దారు పని, సెంట్రింగ్ పని ఇలా ఏది దొరికితే అదే జీవన వృత్తి. అదే జీవిక.

గంగాధర్ మంచి చదువరి. గ్రీకు మైథాలజీ గురించి ఎప్పుడూ మాట్లాడుతుండే వాడు. గ్రీకు మైథాలజీలోని పాత్రలన్నీ దాదాపు అతడికి తెలుసు. ఫ్రెంచ్, రష్యన్ సాహిత్యాలను బాగా చదువుకున్నాడు. మపాసా, బాల్జాక్, టాల్‌స్టాయ్, గోర్కీ, చెహోవ్ రచనలంటే ఇష్టం. ఇటాలియన్ సినిమా దర్శకులు ఫెదరికో ఫెల్లిని, పాలో పసోలిని సినిమాలు గంగాధర్ వల్లనే చూడగలిగాను. స్వభావరీత్యా కవి అయిన గంగాధర్ తన సంచారజీవితంలో ఇంగ్లీషు, తెలుగు భాషల్లో అనేక కవితలు, ఈ నవల రాసాడు. తీరిక దొరికినప్పుడల్లా పబ్లిక్ లైబ్రరీకి వెళ్ళి చదువుకోవడం, లేకుంటే గదిలో కూర్చుని రాసుకోవడం. అలా తను రాసిన కవిత్వాన్ని పుస్తకంగా వేద్దామనుకున్నాడు. చూడకుండానే వెళ్ళిపోయాడు.అలా నాదగ్గర వదిలేసిన కవిత్వాన్ని 'ఆత్మహత్యా సదృశ్య దేశదిమ్మరి ఆఖరికోరిక' పేరుతో ప్రేమలేఖ ప్రచురించింది. అతడు ఇంగ్లీషులో రాసిన కవిత్వం ఇంకు వెలిసిపోయి కట్టలు కట్టలుగా ఇంకా స్నేహితుల దగ్గర పడి ఉంది.

అతడి కవిత్వ రాతప్రతితో పాటు గంగాధర్ రాసిన ఈ నవల కొన్ని సంవత్సరాలపాటు నా దగ్గర అలా ఉండిపోయింది. 2000 సంవత్సరానికి పూర్వం ఎప్పుడో చిత్తుప్రతి రాసిన ఈ నవలని అతడు 2002లో ఫెయిర్ కాపీ రాసుకున్నాడు. ఆ తరవాత బతికున్నరోజుల్లో అతడు అసలు ఇదొకటి ఉందన్న విషయమే మరిచిపోయాడు. 2011 తరువాత, అనేక ఒడిదుడుకుల అనంతరం ఇన్ని సంవత్సరాలూ ఈ నవలని ప్రచురించాలని అనుకుంటూనే కుదరక వాయిదా వేస్తూ వచ్చాను. అది ఇన్నాళ్ళకు కుదిరింది. ఇందుకు సహకరించిన పల్లవి వెంకట నారాయణగారికి, అయనను ఒప్పించిన నా బాల్యస్నేహితుడు డా.కాకుమాని శ్రీనివాసరావు, మొదటిసారి ప్రూఫులు చూసిన మెహర్, భగవంతం, మొదటినుంచి నాకు అండగా ఉన్న కవులు సిద్ధార్థ, అమర్‌నాథ్, ఈ నవల ఎలాగైనా బయటికి రావాలని ఆసక్తి కనబరిచిన పుస్తకాభిమాని అనిల్ బత్తుల, వీళ్ళందరికీ గంగాధర్ తరపున కృతజ్ఞతలు.

ఇక ఈ నవల చదువుతున్నంతసేపు గంగాధర్ నాతో మాట్లాడుతున్నట్లే ఉంది. అతడు 2000 సంవత్సరానికి పూర్వం రాసిన ఈ నవల ఒకరకంగా అతడి

ఆత్మకథలా నాకనిపించింది. ఈ నవల ప్రారంభంలో నీలంరంగు మంచినీటి సరస్సులో స్నానం చేసి బయలుదేరిన ఇకారస్ తమ ఊరి చెరువులో జీవితాన్ని ముగించిన గంగాధర్ ఒకరే అని నాకనిపిస్తూ ఉంటుంది.

ఈ ప్రపంచమంతా గంగాధర్‌కి కొత్త. ప్రపంచానికి గంగాధర్ ఒక వింత. ఈ మనుషులు, ఈ ఇళ్ళు, పిల్లలు, స్త్రీలు ఈ ప్రపంచ ప్రవాహమంతా గంగాధర్‌కి ఒక విడదీయలేని చిక్కుముడి, ఒక లేబరింత్ లాగా అనిపించింది. ఈ లేబరింత్ కొందరికి ఒక విశ్వరహస్యంగానో, కొందరికి అంతుపట్టని సౌందర్యంగానో కనిపిస్తే మరికొందరికి అంతంలేని దు:ఖంలా అనిపిస్తుంది.

గ్రీకు మైథాలజీలో ఇకారస్ తొడుక్కున్న లక్కతో చేసిన రెక్కలు సూర్యుడి వేడిమికి కరిగిపోయి సముద్రంలో పడిపోతాడు. చిత్రంగా చెరువులోకి నడుచుకుంటూ వెళ్ళిపోయిన గంగాధర్‌లానే ఇకారస్‌కి తన తండ్రి డేడలస్‌తో అనుబంధం ఎక్కువ.

మరి గంగాధర్ ధరించిన రెక్కలు ఎవరివి? అవి ఎక్కడ తెగిపోయాయి?

నవల ముగింపులో ఇకారస్ మరణించాక మళ్ళీ వస్తాడని గంగాధర్ చెబుతాడు. వచ్చి మళ్ళీ ముప్పై ఐదేళ్ళు బతుకుతాడనీ, మళ్ళీ ముప్పై వింత పట్టణాలు తిరుగుతాడనీ ఉంటుంది.

మరి ఇకారస్ లాగానే చిత్రకొండ గంగాధర్ మళ్ళీ తిరిగి వస్తాడా?

– బి.అజయ్ ప్రసాద్

3 మార్చ్ 2020.

1

ఆపూ, ఉధృతీ లేకుండా ఒక సమవేగంతో వీస్తోంది గాలి.

వేసవిలో రెల్లుగడ్డి మైదానం మీద దొర్లే అడవి గాలి.

సగం వరకు బొత్తాలు పెట్టుకోకుండా వదిలేసిన చొక్కా లోపలికి దూరి చల్లగా తగులుతోంది. నీలం రంగు మంచినీటి సరస్సులో స్నానం చేసి ఇప్పుడే వస్తున్నాడు తను. వాతావరణమంతా భిన్నంగా వుందీవాళ. సముద్రం కింది పట్టణంలోలా అంతా నిశ్శబ్దం. కొత్త హవాయ్ చెప్పులేసుకుని వీధిలోంచి వెళ్ళిపోతున్నాడు. ఈ బాట కూడా మామూలు బాట కాదు. ఇటుకల్లాంటి ఇనుప ముక్కల్ని అమర్చివేసిన రోడ్డు. వందేళ్ళ క్రితం వేసిన రోడ్డు కాబట్టి ఇనుపముక్కలు బాగా అరిగిపోయి, సున్నితంగా, నునుపుగా తయారయ్యాయి. ఇలాంటి రోడ్డు మీద నడవడమంటే చాలా ఇష్టం తనకి.

తనకే సొంత వూరు వుంటే వూరు మొత్తం ఇలాంటి రోడ్లే వేసేవాణ్ణని అనుకుంటున్నాడు తనలో. అర్ధరాత్రో, తెల్లవారుజామునో ఒక గుర్రపు బండి ఈ రోడ్డు మీద నుండి వెళ్ళడం తన కిష్టమైన సన్నివేశం లేదా తనకే పెద్ద పడవుంటే ప్రాచీనమైనది, ఆ పడవలో ఇలాంటి అడుగుభాగమే వేసేవాణ్ణని, అనుకుంటాడు. పడవ వాలులలో, ఆ ఇనుప వాలులో ఒక మద్యపు పీపా దొర్లుకురావడమూ దొర్లుకొచ్చి ఒకదానికి గుద్దుకుని, పీపా మూత చెక్కలు విడిపోయి కొన్ని పుస్తకాలు పాతకాలపు బౌండు చేసిన సముద్ర సాహసాల పుస్తకాలు బయటపడడమూ గుర్తుకొస్తాయి. యింకా ఒకరి నడుము మీద ఒకరు చేతులేసి ఒక ఇంగ్లీషు జంట బాగా పొద్దుపోయాక ఆ వీధిలోంచి వెళ్ళి పోతుండడమూ కనిపిస్తుంది.

చల్లగా సున్నితంగా తగిలే ఇనుప రోడ్డు మీద తన పాదాలలో నడవడం కూడా చాలా బావుంటుంది. అనుకుందే తడవు హవాయ్ చెప్పులొదిలేసి నడవడం ప్రారంభించాడు. ఇళ్ళన్నింటికీ తెల్లగా వెల్లవేశారు. వీధంతా తెల్లగా మెరుస్తోంది. ఇళ్ళ నీడలు రోడ్డు మీద పడి మానవ నాగరికతని జ్ఞప్తికి తెస్తున్నాయి. ఇళ్ళనీడల ఖాళీ వీధులు చాలాదూరం అలా వెళ్ళిపోయిం తర్వాత తనకి అనుమానం వేసింది.

ఇళ్ళల్లో గానీ వీధిలో గానీ మనుషుల జాడలే లేవు. చిన్న శబ్దం కూడా. కనీసం టెలివిజన్ చప్పుడైనా వినిపించాలి. తనకంతా వింతగా వుంది. ఎవరూ లేకపోవడమేమిటి? ఏదో జరిగిందా యిక్కడ ? దూరంగా, చాలా ఎత్తులో ఆకాశంలో వలయాలై తిరిగే రాబందులు, పిట్టగోడలపై వేచిచూస్తోన్న రాబందులు. ఇవేమీ కాదు కానీ తనిక్కడికి ఎలా వచ్చాడు? తను చెరువులో స్నానం చేసి వస్తున్నాడా లేక రావడమే సరాసరి చెరువు లోంచి వచ్చాడా? పలుప్రశ్నలు తనకు తాను వేసుకుంటున్నాడు.

ఖచ్చితమైన సమాధానం ఏదీ లేదు.

టైం చూసుకున్నాడు. పది కావస్తోంది. ఆఫీసులకీ, స్కూళ్ళకీ, కాలేజీలకి, ఫ్యాక్టరీలకీ వెళ్ళే టైం కదా ! కనీసం సందడైనా లేదు వీధిలో. ఇళ్ళలోంచి ఏ స్త్రీ మాటలైనా విన్పించాలి. పిల్లల్ని పిలుస్తూనో కోప్పడ్తూనో, కనీసం కాళ్ళపట్టీల, గాజుల చప్పుడైనా, పిల్లల అల్లరి అరుపులైనా విన్పించాలి కదా? తలపైకెత్తి భవంతుల్నీ పై అంతస్థుల్ని చూసాడు. ఎవరైనా వుంటున్న జాడలైనా లేవు. భవంతిలోంచి ఆరేసిన దుస్తులైనా, చీరలైనా గాలికి కదులుతూ లేవు.

దాదాపు ఎక్కువశాతం ఇళ్ళల్లో తలుపులు తెరిచే వున్నాయి.

పదిగంటలకే ఎండ తీవ్రంగా వుండటం అంతా నిర్మానుష్యంగా వుండటం ఏదో అనుమానం, కీడు తలెత్తుతుంది. ఏదో పెను సంఘటనే జరిగింది. ఎక్కడికి వెళ్ళి పోయుంటారు అందరూ..?

నిద్ర లోపలి పట్టణం కాదు కదా యిది.

తరచూ వచ్చి వెళ్ళిపోయే విమానాల రొదైనా లేదు, విమానాశ్రయం దగ్గరే యిక్కడికి. అంతా డొల్లగా వెలితిగా వుంది. లేదా కలలో వున్నాడా తను? కలైతే యింత సుదీర్ఘంగా గంటల తరబడి వుంటుందా ? మనుషులు లేకపోవడమేమిటి? నిర్మానుష్యమై చాలా సంవత్సరాలు గడిచిపోయినట్టుగా అన్పిస్తోంది. వీధుల అరుగుల్లో

దుమ్ము పేరుకుపోయి వుంది. మోటారు సైకిళ్లు గోడలకి ఆన్చి వున్నాయి. అక్కడక్కడా రోడ్డు మీదా, ఇళ్ళ గోడల వోరనా ఆకులు; కాయితాలూ కుప్పలుగా పోగుబడి ధూళిలేస్తోంది.

ఎప్పట్నుంచి ఇది... పది సంవత్సరాల నుంచీనా ? లేక ఇవాళేనా ?

ఎవర్నైనా పిలిస్తే బావుణ్ణు.

యిక్కడెవరూ నాకు తెలీదు.

ఎవర్ని పిలవాలి ?

సంకోచిస్తూనే 'హలో...'హలో ఎవరైనా వున్నారా యిక్కడ ?'

బిగ్గరగా తనకే భిన్నంగా వినిపిస్తోన్న తన గొంతుతో అరుస్తూ మలుపు తిరిగి వేరే వీధిలోకి ప్రవేశించాడు.

శివారున ఎత్తులో వీధి మధ్య నల్లటి విగ్రహమేదో వుంది.

సమీపంలోకి వచ్చేసరికి అదొక దారు శిల్పం.

అదొక స్త్రీ నగ్న రూపం. ఇరవై ఫీట్ల పొడవుంటుంది. మెడ లేదు. మోచేతులూ, పాదాలు కూడా లేవు. బలిష్టమైన రొమ్ములూ, తొడలూ, నడుమూ, ఇరవై ఇరవై ఐదేళ్ళ మధ్య వయస్సులో వుండే స్త్రీదై వుంటుంది. చక్కగా కళాత్మకంగా పాలీష్ చెయ్యడం వలన దంతంతో తయారుచేసిన దానిలా మెరుస్తోంది.

యీ నిర్మానుష్య వీధిలో ఎందుకీ శిల్పం ? మనసు చెదిరే సౌష్ఠవంతో ఎవరీ స్త్రీ? బంగారపు గొడ్డలా? ఫ్యాక్టరీ హుక్కా? నిగూఢమైన శక్తులున్న దేవతా? ఇలా తనకు తానే ప్రశ్నించుకుంటుండగా –

తన మనస్సులోకి సముద్రాలపై సాగుతోన్న పురాతన ఓడలూ, ఓడల రైలింగుల దగ్గర పిల్లల్ని ఎత్తుకుని నిలబడ్డ మనుషులూ, ఆ మనుషుల శిరోజాల్ని అనునయంగా కదిలిస్తోన్న గాలీ కనిపించాయి.

యిక్కడ ఈ నగరపు రోడ్ల మీద చీమల్లా నిండుకుని కదుల్తోన్న మనుషులూ,

వాహనాలూ

సమస్త నిర్మాణాలూ

దయా, కరుణా

నల్లగా కాలిపోయిన నరకపు కనుగుడ్లూ

ప్రేమ లేక ఎండిపోయి తెగిపడ్డ హస్తాలూ, హస్తాల్లోంచి బయటకొచ్చిన యిసుకా అనేకానేక దృశ్యాలు మనసులోకి వస్తున్నాయి. వెంట వెంటనే. అయితే ఆ సౌష్ఠవమంటే ఏమిటి ?

అగంతుకత్వంలో అమాయకత్వంతో, ఎవరికీ తెలియక సగానికి నరికిన చెట్టులా వచ్చి వెళ్ళిపోయే ప్రాణపు జాడలంటే ఏమిటి ? అనాదిగా పారే నదులపై మహా వంతెనల్ని, ఎవరు నిర్మించారు ? వంతెనలంటే,

రొమ్ముపై బంగారపు గొడ్డలంటే,

చీకటి గొలుసులంటే,

ఉన్నట్టుండి రావి చెట్టొకటి పక్క నుంచి గలగలా చప్పుడు చేసేసరికి తన ఆలోచన్లోంచి బయటకొచ్చి, మనసులో ఏదో బలంగా ఆజ్ఞాపిస్తున్నట్టుగా మరబొమ్మకి కీ యిచ్చి వదిలేసినట్టుగా నడిచి ఆ దారుశిల్పం పైకి ఎక్కనారంభించేడు. కొన్ని సెకన్లలోనే మెడభాగం ఖాళీలోకి భద్రంగా సుళువుగా దిగాడు. దారు శిల్పం లోపలికి దిగగానే లేతపచ్చని కుర్చీ ఒకటి కనిపించింది. వెనక్కీ ముందుకీ విశ్రాంతిగా కదులుతూ.

కుర్చీలో కూర్చుని పక్కనున్న స్విచ్ వేసి పైన ఒక మూలగా వున్న చిన్న పంకాని ఆన్ చేశాడు. తన ముదురు నీలంరంగు చొక్కా తీసి కుర్చీ వెనుక వీపు ఆనుకునే భాగాన ఆరేసి కూర్చున్నాడు, రిలాక్సుడుగా.

తను కూర్చున్న కుర్చీ శిల్పం మధ్యలో వుందని గ్రహించాడు. కుర్చీ తర్వాత కిందనేముందో తెలియరావడం లేదు.

చుట్టూరా పైన ఒకసారి చూసాడు. ఒక మూలన పగిలిపోయి రెండుగా విడిపోయిన ఖాళీ గుడ్డూ, దాని పక్కనే మరొక పగలని గుడ్డూ వున్నాయి.

శిల్పపు లోగోడలకి కాళ్ళు ఆన్చి విశ్రాంతిగా కళ్ళు మూసుకున్నాడు.

ధారాళంగా పంకా గాలి వీస్తోంది.

బయట్నుంచి అప్పుడప్పుడూ రావిచెట్టు చేస్తోన్న చప్పుడు విన్పిస్తోంది. ఖాళీ మెడలోంచి మంద్రంగా.

ఏకాంతపు సంగీతం !

ఎవరెవరో గుర్తుకొస్తున్నారు ? బంధువులూ, మిత్రులూ చనిపోయిన వాళ్ళూ.

స్కూలు స్నేహితులూ, స్కూలు స్నేహితులు ! ఎప్పటి మనుషులు వాళ్ళు...

అంతా పెద్దవాళ్ళైపోయారు. తాము వెళ్ళాల్సిన ప్రయాణంలో చాలా దూరమే వెళ్ళిపోయారు.

మిగతా ప్రయాణం సునాయాసంగా జరిగిపోతుంది.

చిన్నప్పుడు ఆడుకున్న ఉప్పాట తెలుసా... జ్ఞాపకం వుందా? నాలుగు గడీలు గీస్తారు ఇసుకలో. ఒక్కో గడీ లైనులో ఒకరు కాపలా ఎవరూ అవతలి గడీలోకి వెళ్ళిపోకుండా. ఎవర్నీ అంత సులువుగా తన నుంచి తప్పించుకుని అవతలి గడీలోకి పోనియ్యడు. నాల్గు గడీల కవతల ఉప్పు ఉంటుంది. ఇసకే ఉప్పన్నమాట !

ఆ ఉప్పుని మళ్ళీ వచ్చిన దారినే గడీల్లోంచే వెనక్కి తీసుకురావాలి. ఈ ఆటలంటే ఎప్పుడూ అతడికి భయమేసేది. ఉప్పు తేగలడో లేదో అని. మిత్రులంతా ఆడుతుంటే ఆట చూస్తూ వుండిపోయేవాడు. ఏవైనా సులువుగా, బలంగా తెలివిగా నాల్గు గడీలు దాటి పిడికిట్లో ఉప్పు తెచ్చిన వాణ్ణి చూస్తే వాడు గొప్పవాడు, తెలివైనవాడు అనుకునేవాడు.

దాదాపు తోటి వాళ్ళంతా తెలివైన వాళ్ళుగానే కనిపించారు.

ఎప్పుడైనా బలవంతం చేసి ఆటలోకి తీసుకెళ్తే మొదటిగడిలోనే వుండిపోయి యిష్టం లేక తిరిగొచ్చేవాడు.

ఇప్పుడు వాళ్ళందరూ స్థిరపడ్డారు. పెళ్ళిళ్ళయిపోయి పిల్లలు,

జీవితానికొక అర్థం.

జీవితం పైన ఒక అధికారం.

కొందరు తాగుబోతులయ్యారు. తాగుడిచ్చే జీవితపు గర్వంతో కూడిన ఆనందాలు, ఆనంద క్షణాలు.

లీలగా, పక్కనుంచి ఎడ్లబండి వెళ్తోన్న చప్పుడు. మోయలేని బరువుతో ఇరుసు చప్పుడు చేస్తోంది.

అవును.

అది ఎడ్లబండే, అనుకుంటూ చాలా ఆత్రుతతో, గొప్ప బలంతో కుర్చీలోంచి లేచి ఖాళీ మెడలోంచి తలపైకెత్తి చూశాడు. పక్కన కాదు కనీసం వీధి చివర కూడా ఎడ్లబండి వెళ్తూ లేదు.

ఇదంతా భ్రమేనా !

లేక చెవులకేమైనా అయ్యిందా ? చెవి అని అటూ ఇటూ కదిలించాడు.

బిల్డింగ్ పక్కనుంచి రోడ్డుమీదికి తొంగిచూస్తోన్న వేపచెట్టులో తప్ప ఎక్కడా చలనం లేదు. తన అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో దారుశిల్పం నుండి దిగి వీధి ఉత్తరం వైపు నడవడం ప్రారంభించేడు. వీధిలోకి చొచ్చుకుని వచ్చి ప్రముఖంగా గంభీరంగా కనబడుతున్న మేడ స్థంభానికి చెయ్యి ఆన్చి సాలోచనలో పడ్డాడు.

'ఒక వేళ ఎడ్లబండి ఇటుకేసిపోయినా ఎడ్లబండిలో వున్నవాళ్ళు ఎవరై వుంటారు? దూరపు ప్రయాణంలో వున్న రైతూ, అతని చిన్నకూతురూ. స్వర్ణపు అంచుల పచ్చని గౌనూ, లేతగులాబీ రంగు జాకెట్టూ వేసుకున్న చిన్నకూతురు ప్రయాణపు మత్తులో ముడుకులు మీద చేతులు ఆన్చి ఒంటరి ఆలోచనల్లో మునిగి... వాళ్ళు వెళ్ళాల్సింది చాలా దూరమే వుంటుంది. ఒక లాంతరూ. రెండు వారాలకు సరిపడా తిండి. మధ్యలో ఎవరైనా బందిపోట్లు ఎదురై ఎడ్లబండిని ఆపితే ? తమను తాము రక్షించుకోగల బలవంతులా వాళ్ళు ? నిజానికి, ఎడ్లబండి శబ్దం నిజమైనదే అంటావా?

నమ్మశక్యంగా లేదు.

గతజన్మపు జ్ఞాపకమా ?

ఆత్మల సంచారమా ?

ఏమో ఎవరు చెప్తారు సమాధానాలు ?

ఎక్కడెక్కడినించో వస్తోన్న పెనుగాలి వేపచెట్టులోంచి పెద్ద శబ్దంతో దూసుకుపోయి వీధి సందులోకి వెళ్ళిపోయింది. ఇలాంటి గాలులు తరచూ ఆ ఖాళీ వీధిలో తిరుగుతూ వెళ్ళిపోతుంటాయి.

'ఆత్మలు వుంటాయేమో. చనిపోయినా తీరని బరువైన కోర్కెలతో, ఆశలతో యిక్కడే వుండిపోతాయట. ఇనుపగుళ్ళంత బరువైన కోర్కెలు. కోర్కెలంటే గుర్తుకొచ్చింది. ఈ భూమ్మీద కొచ్చిన ప్రతి జీవీ తన చేతిలో ఖాళీ బంగారపు గ్లాసుల్ని పట్టుకుని ఎదురుచూస్తుంటాయట ప్రాణధార కోసం. వాన కోసం ఎదురుచూసే ఎడారిలాంటి దేహాలు వాళ్ళవి. అప్పుడు వాళ్ళ దేహమంతా సగం నిలువునా యిసుకతో రాళ్ళతో నిండి కుట్టినట్టనిపిస్తుందట. నాలిక బొగ్గైపోతుంది ప్రాణం లేనట్టుగా, ఇనుములాగా మారిపోయిందన్నట్టుగా వుంటుంది. ఇలాగ చాలా సంవత్సరాలు తిరుగాడుతూ వుంటారు. పుట్టిన ప్రతి జీవీ ఆ ప్రాణాధారని తాగాల్సిందే. ఆ ప్రాణధారే తన మెత్తని చేతుల్తో ఆ కుట్లని విప్పి, రాళ్ళనీ, ఇసుకనీ తీసేస్తుంది.

పాపం కొందరు ఆ బంగారపు గ్లాసుల్ని కొనుక్కోలేకపోతారు. లేదా అందుకోలేక పోతారు. అలాంటి వాళ్ళని చాలామందిని ఎరుగుదును అతడు. వాళ్ళు అలిసి పోవడమూ తెలుసు అతడికి. కొంతమంది చేతుల్లోంచి గ్లాసులు పడిపోతాయి. రాళ్ళ మీద పడి ముక్కలు ముక్కలవుతాయి. ప్రాణధార పడకముందే ప్రాణానికి విసుగు పుడుతుంది. దుఃఖపు కెరటం తీవ్రంగా బ్లేడులాగా వచ్చినపుడు వాళ్ళు చచ్చిపోతారు. చనిపోయిన ప్రతీదీ మళ్ళీ యిక్కడ ఈ వీధుల్లో తిరగలేదు కదా, హాయిగా స్నానం చెయ్యలేదు కదా, హుషారుగా ఆనందంగా కొత్తబట్టలేసుకుని చేతినిండా డబ్బులతో షికారుకెళ్ళలేదు కదా.

అందుకే, చనిపోయే ముందు వాళ్ళు ఎవర్నో ఒకర్ని గుర్తుపెట్టుకుంటారు. తమ కిష్టమైన వాళ్ళని, సంవత్సరాలుగా ఈ భూమి మీద తిరిగిన దుఃఖపడిన కాలంలో తమకి పదే పదే గుర్తుకొచ్చిన వాళ్ళని మనసులోకి తెచ్చుకుంటారు.

చనిపోయిన తర్వాత స్వర్గ నరకాలు అందర్నీ రానిస్తాయా? రెండే రెండు ద్వారాలక్కడ. తెలుపుదీ నలుపుదీ. మంచికో చెడుకో జీవితాన్ని అనుభవించిన వాళ్ళకే ఆ రెండూ.

తెగిన చెట్టులాగా బతికినవాళ్ళని ఏ లోకం రానిస్తుంది ? అందుకే భూమే ఎంతో ఓర్పుతో వాళ్ళని మళ్ళీ రానిస్తూంటుంది. అప్పుడప్పుడూ, చీకట్లో కదిలే గుబురు చెట్టులాగో, చీకటి రోడ్డు మలుపు లాగో, అమాంతం ఆనందంతో దొర్లిపోయే గాలిలాగో ఏమో ఎవరికి తెలుసు అవెలా ఇక్కడ తిరుగుతుంటాయో. అవున్నా లేకపోయినా అవంటే అతడికి భయం లేదు. కాగా అవంటే అతడికి చాలా ఇష్టం అవి కనబడితే అరుగు మీద పక్కనే కూర్చోబెట్టుకుని మాట్లాడతాడు. లయబద్ధంగా ముందుకీ వెనక్కీ వూపుతోన్న కాళ్ళ పట్టీల చప్పుడుతో.

2

ఎటైనా వెళ్ళి రావాలి. ఇక్కడుంటే ఏం లాభం లేదు. దూరంగా పోవాలి. అక్కడెవరైనా వుండొచ్చు. తిరిగి వెనక్కి దారుశిల్పంలోకి వెళ్ళి షర్టు వేసుకుని వచ్చాడు. ఎడ్లబండి నిజంగా వెళ్ళిందా లేదా అనేది అతనికొక ప్రశ్నగానే మిగిలిపోయింది. ఈ వీధిని మళ్ళీ గుర్తు పెట్టుకోగలనో లేదో అని ఈ చివర్నుంచి ఆ చివరకు ఒక్కసారి క్షుణ్ణంగా చూసాడు. ఏదైనా బండ గుర్తుకోసం. అన్నింటికన్నా ఎత్తైన బిల్డింగ్ కోసం చూశాడు. అదైతే దూరానికి కనిపిస్తుంది. అతననుకున్నట్టే ఎత్తైన బిల్డింగ్ చివరి

అంతస్థులో పోర్టికోలో ఒక వూయల. ఏదో చెట్టు బెరడుతో చేసింది. నెమ్మదిగా తన చుట్టూ తాను తిరుగుతూ కనిపించింది. పోర్టికోని ఢీకొనే పెనుగాలికి ఊయల అటూ ఇటూ ఊగుతోంది. 'అది సరియైన బండగుర్తు, సులువుగా గుర్తుపట్టొచ్చు' అనుకుని వీధిలోకి వెళ్ళాడు.

చీకటి పడేలోగా వచ్చెయ్యాలి అనుకున్నాడు.

నివాస ప్రాంతం మధ్య నుండి కిందికి దిగుతోన్న రోడ్డుమొంచి వచ్చి మెయిన్ రోడ్డులోకి అడుగుపెట్టాడు.

అక్కడ కూడా ఎవరూ లేరు.

అదొక చిన్నకూడలి. షాపులన్నీ తెరిచే వున్నాయి. టీ దుకాణం ముందు నిల్చుని తలెత్తి లోపలికి చూశాడు, శ్రద్ధగా విన్నాడు, కుర్చీల వంక వెదికాడు. అంతా ఖాళీగా వుంది.

అరటి పళ్ళ బళ్ళు, కమలాపళ్ళ బండ్లు, టిఫిన్ సెంటర్. టిఫిన్ సెంటర్‌లో అందంగా కన్పిస్తోన్న ధరల పట్టీ. యిక సంకోచించకుండా పళ్ళ బళ్ళ దగ్గరికి పోయి ఐదారు అరటిపళ్లూ, కమలాపళ్లూ టీ షాపు టేబిల్ మీద వుంచాడు. టేబిల్ మీదనున్న దుమ్మంతా పేపర్‌తో కొడుతుంటే అప్పుడు చూసాడు న్యూస్‌పేపర్ ఎప్పటిదా అని ?

'డిసెంబర్ 29' మాత్రం స్పష్టంగా కనబడుతోంది. మిగతా చిరిగిపోయి వుంది.

'అంటే, ఇవాల్టికి రెండు రోజులైందన్నమాట. ఇదే చివరి దినపత్రిక అయివుంటుంది. ఏదైనా జరిగుంటే రెండ్రోజుల క్రితమే జరిగుండాలి. అరటిపళ్లు కూడా బాగా మగ్గిపోలేదు. కొంత తాజాగానే వున్నాయి.

ఎదురుగా వున్న టిఫిన్ సెంటర్‌ను చూసి చిర్నవ్వు నవ్వాడు.

అనుకున్నదే తడవు టిఫిన్ సెంటర్లోకి వెళ్ళి పూరీలూ, బంగాళాదుంపల కూరచేస్కుని టీషాపులో కూర్చుని తినడం ప్రారంభించేడు. అప్పటికే సాయంత్రం ఆరయ్యింది. తినేసిన తర్వాత ప్లేటుని శుభ్రంగా కడిగేసి టిఫిన్ సెంటర్లో పెట్టి బయటకొచ్చాడు.

ఆటోలు ఎక్కడివక్కడే వున్నాయి.

సైకిళ్లూ, స్కూటర్లూ, బైక్‌లూ, కార్లూ ఎలా వున్నాయో అలానే వున్నాయి. ఏదో వెలితి. పెద్ద బియ్యం షాపులో బియ్యం కుప్పల మీద ధూళీ, చెత్తా చెదారమూ చేరాయి. త్రాసు కదలకా మెదలకా అలానే ఒకవైపు వాలి వుంది. పక్కనే ఎలక్ట్రికల్ సామాన్లమ్మే షాపు. దాని పక్కనే వుడ్‌వర్క్స్. తలుపుల్నీ, కిటికీల్నీ, కుర్చీల్నీ, సోఫాల్నీ అందంగా తీర్చిదిద్దే షాపు. దానికి ఆనుకుని మోటారు మెకానిక్ దుకాణం. అంతా నల్లగా, చక్రాల్లేని మోటారు సైకిల్లూ, రంగువేస్తోన్న అద్దాల్లేని కారూ. అన్నీ అంతా అలా పడి వున్నాయి.

'యింకెవరూ ఎప్పటికీ రారేమో యిక్కడికి ?

యివన్నీ ఎవరి కోసం ?

ఏమౌతాయి యివి ?

ఎప్పటివరకు వుంటాయి ?

ఎవరు అనుభవిస్తారు వీట్ని ?

ఎవరు సంరక్షిస్తారు. పగళ్ళై, రాత్రుళ్ళై, అనేకానేక సంవత్సరాలై, నిగూఢ నిశ్శబ్దమై, రహస్యమై వుండే విశ్వాంతర శక్తా, వీటిని సంరక్షించేది ? చూసేదీ ?

3

'ఈ రాత్రికి ఎక్కడైనా మంచి ఇంట్లో పడుకోవాలి.

ఎలాగూ ఎవరూ వుండరు కదా ?

విలాసవంతమైన ఇల్లుని వెదుకుతూ రోడ్డు మీద నడుస్తున్నాడు. గేటు తెరిచే వున్న ఇంటి వరండాలోంచి బెంజ్‌కారు కనిపించింది. ఇంటిముందు చక్కని లాన్; మధ్యలో నునుపైన రాళ్ళు పేర్చిన బాటలు. ఇంటి గోడల పైగా పూలూ, లతలూ అల్లుకుని వున్నాయి.

గేటు దాటుకుని లోపలికి వచ్చాడు.

ఇదేదో ధనవంతుడి యిల్లే. అందమైన మార్బుల్ టైల్స్. నడవడానికి ముచ్చటేస్తోంది. కొద్దిగా తెరిచి వున్న దారు తలుపుని తోసుకుని లోపలికెళ్ళాడు. స్విచ్ వేయగానే గులాబీరంగు రూఫ్ నుంచి వేలాడుతోన్న షాండ్లియర్స్ వెలిగాయి. ఆ తర్వాత అన్ని స్విచ్‌లూ వేశాడు.

విశాలమైన గది.

ముదురు నీలంరంగు అందమైన సోఫాలు.

సోఫాల క్లాత్‌ల మీద పూలూ, లతలూ చిత్రించి వున్నాయి.

పెద్ద టీవీ, పుస్తకాల అల్మరా చెక్కతో చేసింది. ఖరీదైన పుస్తకాలు.

మెట్లెక్కి పైనున్న గదులవైపు వెళ్ళాడు.

ఆర్చ్ ఆకారంలో వున్న వుడెన్ తలుపు తీయగానే విశాలమైన బాత్‌రూమ్ తెరుచుకుంది. పచ్చని జేడ్‌రంగు టైల్స్‌తో అధునాతనంగా వుంది. రిలాక్స్‌గా స్నానం చెయ్యటానికి టబ్, హేండ్‌షోవర్, తెల్లని ఖరీదైన టవళ్ళు హేంగర్స్‌కి వేలాడుతూ, మ్యూజిక్ సిస్టం కూడా వుంది.

స్నానం చెయ్యాలన్పించి మ్యూజిక్ సిస్టం ఆన్ చేశాడు.

పాట ఎక్కడ్నుంచో అవతల్నుంచి వస్తున్నట్టుగా నెమ్మ నెమ్మదిగా మొదలయ్యింది. పరిచితమైన స్త్రీ గొంతే. గొంతులో ఏదో స్వేచ్ఛాప్రియత్వం. మళ్ళీ మళ్ళీ వినాలన్పించే గొంతు.

'హేపీ హేపీ వరల్డ్ / యునెవర్ రిటర్న్

మోర్ అండ్ మోర్ డ్రింక్ వైల్ యూ లివ్ /

టేక్ దిస్ రోజ్‌గ్లాస్ ఫ్రం మి

ఆమె ముఖమూ పెదాలూ గుర్తుకొస్తున్నాయి.

చాలాసేపు అర్ధగంటకి పైగా స్నానం చేసి గులాబీరంగు బాత్‌రోబ్‌ని కట్టుకుని డైనింగ్‌రూంలో కూర్చున్నాడు, మటన్ ఫుడ్స్ నోట్లోకి తీసుకుంటూ

'ఇవాల్టికి యిక్కడే వుండిపోతే బావుంటుంది. చీకట్లో ఎక్కడికెళ్తాం? ఎక్కడేముందో ఎవరికి తెలుసు, దోపిడీ మూక ఏదైనా ఎదురుపడొచ్చు. అశ్వాలపై పహారా కాసే సైనికులైనా ఆపుచెయ్యొచ్చు. యివాల్టికి యిక్కడే వుండిపోయి మర్నాడు వెళ్తే మంచిది.'

భోజనం చేసి టెర్రాస్ పైనున్న మెత్తని తలదిండ్లు. పరుపు మీద గాఢనిద్రలోకి జారి పోయాడు.

నక్షత్రాల్లో చాలా దగ్గరికి వచ్చినట్టు, చెయ్యెత్తితే అందే ఎత్తులో, ఆకాశం స్పష్టంగా కనబడుతోంది.

చిరువెన్నెల్లో లీలామాత్రంగా కనబడుతున్నాయి చుట్టుపక్కల భవనాలూ, కిటికీలూ. కరెంటు సరఫరా వున్న వీధిలైట్లు వెయ్యకపోవడం వలన అంతా చీకటిగా వుంది.

దూరంగా అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో లైట్లు వరసగా వెలుగుతున్నాయి. అక్కడైనా ఎవరూ వుండే అవకాశం లేదు. మొత్తానికి ఏదో విపత్తు జరిగిందనేది తేలిపోయింది.

ఈ ఒక్క నగరంలోనే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా మనుషుల్లేరన్న అనుమానం బలపడడానికి అనేక కారణాలు కన్పిస్తున్నాయి. ఎందుకంటే తను టెలిఫోన్ బూత్‌లోంచి తనకు తెల్సిన నెంబర్లకు, మొదటి ఫోన్ చేశాడు. ఆ తర్వాత డైరక్టరీ ఆధారంగా వివిధ ఎంక్వైరీలకీ, కంపెనీలకీ, అధికారుల ఇళ్ళకీ ముఖ్యమంత్రి కార్యాలయానికీ ఫోన్ చేసి చూశాడు.

నిష్ఫలితం.

తను వూహించిందే.

పోనీ ఢిల్లీ, జెహానాబాద్, ఇండోర్, కోడంబాకం, ధనుష్కోడి, త్రిపుర, పోర్ట్‌బ్లెయిర్, విజయనగరం, మార్మగోవా, అంధేరి, సత్తుపల్లి, వాల్తేర్, ఎర్నాకులం, ఊటీ, అహ్మదాబాద్. యింకా అనేక ప్రాంతాలకీ మారుమూల పల్లెలకీ ఫోన్ డయల్ చేసి చూశాడు. యింకొక విషయమేమిటంటే సెల్‌ఫోన్ కూడా ప్రయత్నించాడు. రింగ్‌టోన్ విన్పిస్తోందే తప్ప అవతల్నుంచి ఒక్క గొంతు కూడా విన్పించడం లేదు. అంతటా నిశ్శబ్దం.

ఇంకే సమాధానమూ మానవస్వరమూ విన్పించడం లేదు.

మనుషుల గొంతు విని రెండ్రోజులు కావస్తోంది.

యిక మాటలు వినబడవనే నిర్ణయానికి వచ్చేశాడు.

మాటలు వినబడనపుడు ఎందుకీ ఆరాటాలు, ఆందోళనలు, భయాలు అనే ఖచ్చితత్వానికి వచ్చేస్తున్నాడు.

టెర్రాస్ మీద సుఖమైన గాలి గాఢంగా నిద్రపోతున్న అతన్ని తాకుతూ వెళ్తోంది. అతనలా నిద్రపోయి ఎన్ని సంవత్సరాలైందో. ఇప్పుడు ఖచ్చితమైన నిద్రనీ, కలతలు లేని నిద్రనీ దుఃఖపు లెక్కలు ఏమీలేని నిద్రనీ అనుభవిస్తున్నాడు.

ఈ అదృష్టం కావాలనుకున్న వాళ్ళందరికీ వస్తుందా ?

ఒక చెట్టులాగా ఒక భవంతిలాగా, ఒక తలుపులాగా, ఒక కుర్చీలాగా, ఒక వాహనంలాగా, ఒక నిద్రలాగా నగరంలో తనొక్కడే ఇప్పుడు. అవెట్లా నిద్రపోతాయో

ఎట్లా పూస్తాయో, ఎట్లా అలా నిలబడి లోలోపల కునుకుపాట్లు పడుతుంటాయో,ఆకలితో నశించవో తను కూడా అంతే.

ఆహారపు సమస్య లేనే లేదు.

ఎక్కడైనా దొరుకుతుంది.

ఏ ఇంట్లోకి వెళ్ళినా వుంటుంది.

వండుకోవచ్చు.

ఎక్కడైనా స్నానం చెయ్యొచ్చు.

బట్టలకి కొదవలేదు.

అయినా బట్టలవసరం లేనేలేదు. ఇప్పుడిక్కడ తననెవరు చూస్తారని? ఈ నిర్జన ఆకాశంలాగా, నక్షత్రాల్లాగా, కరెంటు స్థంబం లాగా, భవంతిలాగా, చెట్లలా నిశ్చింతగా వుండొచ్చు. అద్దెల భయం లేదు. ఆశాభంగము లేదు. అవమానమూ లేదు. చావు కూడా లేదు.

గురకపెట్టి బాగానే నిద్రపోతున్నాడు.

నిశ్శబ్దము, గాలీ వెన్నెలా అప్పుడప్పుడూ విన్పించే చెట్ల శబ్దమూ తప్ప ఏమీ జరగట్లేదు అక్కడ. అక్కడెక్కడో వీధిలో లైట్లు ఆరిపోయి మళ్ళీ వెలిగాయి వరుసగా.

4

సుమారు మూడున్నర దాటిన తర్వాత అతనికో కల వచ్చింది. చాలా రోజులకి ఒక మామూలు కల రావడం యిదే ప్రథమం. కానీ చిత్రంగా వుంది. అక్కడేదో శుభ కార్యం జరుగుతోన్న యింటి ముందు తను వున్నాడు. శుభకార్యమంటే పెళ్ళే జరుగుతోంది లేక పెళ్ళి జరిగిన రెండోరోజో అది. అందరూ రిలాక్స్‌డుగా సంతోషంగా వున్నారు ఆరాంగా. పెళ్ళి జరిగిన తర్వాత రెండు మూడు రోజుల వరకూ పెళ్ళిసందడి, సామూహిక వంటలూ వుంటాయి కదా. అట్లాంటివే అది. తను షర్టులేకుండా లుంగీతో కూర్చుని వున్నాడు బెంచీ మీద. ఈలోగా ఎవరో నవ్వుకుంటూ వచ్చి తన తల మీద పెద్ద మొత్తంలో పంచదార గుమ్మరించి పక్కకి వెళ్ళిపోయారు అందకుండా వెళ్ళి పోతున్నట్లుగా. పంచదార తలమీంచి ధారగా పడుతుండగా ఈ హఠాత్ పరిణామానికి బెంచీ మీంచి లేచి శరీరానికి అంటిన పంచదారని తుడుచుకోవడం ప్రారంభించేడు.

ఒంటి మీద అదప్పటికే నీటిగా మారిపోయింది. కరిగిపోయి నీరైపోయిన పంచదార, బొజ్జమీంచీ మోచేతుల మీంచీ వేళ్ళతో గట్టిగా వూడ్చి ఇంటివైపు చూశాడు.

ఇంటిముందు పచ్చి కొబ్బరాకులతో వేసిన పెళ్ళిపందిరి నీడలో పొడవాటి బెంచీ మీద పిల్లలు కూర్చుని వున్నారు. పిల్లల వయసులో వున్న స్త్రీలూ నిల్చుని వున్నారు. బెంచీ మీద కూర్చున్న చిన్న ఆడపిల్లలందరూ ముసిముసిగా నవ్వుతున్నారు అతన్ని చూసి. కొందరు నోళ్ళపై చేతులు అడ్డంపెట్టి నిర్మలంగా నవ్వుతున్నారు. అప్పుడు గుర్తుపట్టాడు వాళ్ళని, కూర్చున్న వాళ్ళలో వరసకి అక్కయ్యలు అయ్యే వాళ్ళు వున్నారని. కానీ అక్కయ్యలెందుకు చిన్నపిల్లలైపోయారో అక్కడ? ఒక పిల్ల మాత్రం మెరిసే కాళ్ళపట్టీలతో కాళ్ళూపుకుంటూ నవ్వుతూ చూస్తోంది. వాళ్ళ పక్కనే ఒక పెద్దామె ముప్పయ్ ఐదేళ్ళుంటాయి. అమ్మ అప్పుడప్పుడూ కట్టుకునే చీర కట్టుకుని వుంది. ఆమె ముఖం మాత్రం కనబడలేదు.

ఈలోగా ఎవరివో రెండు పెద్ద అరచేతులు ఏదో చెప్పబోతున్నట్టుగా చెవి దగ్గరకు సమీపిస్తుండడంతో మెలకువ వచ్చి నిద్రలేచాడు.

అప్పటికే తెల్లారింది.

మనసంతా బరువైపోయింది.

కాసేపు అలానే కూర్చుని కదుల్తోన్న ఆకులవైపు ముఖం పెట్టి గుండె ఎముకల మీద వేలుతో నొక్కాడు. ఏదో తెలియని దిగులుతో గుండె నొక్కుకుపోతోంది లోపలికి. స్టీలు గుండె. కొత్తది మెరుస్తోంది. గట్టిగా ఒక్కసారి ఊపిరి తీసుకుని వదిలాడు.

'ఏదో అవుతోంది. ఎక్కడైనా హఠాత్తుగా ఆగిపోను కదా ?'

కిందికి దిగి, స్నానం చేసి కొత్తబట్టలేసుకుని బయలుదేరాడు.

రోడ్డ మీద అదే దృశ్యం.

దూమ్మూ, ధూళీ, కాగితాలూ, ప్లాస్టిక్ కవర్లూ గాలికి ఆ చివర్నుంచి ఈ చివరకు కదులుతూ.

అవే కార్లు, అవే మోటారు సైకిల్లు, బస్‌స్టాపుల్లో ఎక్కడివక్కడే బస్సులు.

ఇది మూడోరోజు,

ఎందుకో తెలియని ఏమైందో తెలియని ఈ నగరంలో వుండి.

ఈ రోజు ఎక్కడికైనా వెళ్ళాలి. ఎటని వెళ్ళాలి ?

స్టేడియం వైపా ?

పోలీస్ ఠాణాకా ?

పత్రికా కార్యాలయానికా ?

అక్కడేమైనా ఆసవాళ్ళు దొరుకుతాయా ?

అక్కడైనా రెండురోజుల క్రితపు సమాచారమే వుంటుంది. ఈ విపత్తు గురించిన సమాచారమేదీ దినపత్రికల్లో లేదు కదా !

ఉదయం ఏడుగంటలు కావస్తోంది.

చుట్టుపక్కల పరిసరాల్ని చూసుకుంటూ నడుస్తున్నాడు.

రోడ్డు అంచునే నల్లని టార్పాలిన్ మీద చేపలు వరసగా ఒకదానిమీదొకటి పేర్చి వున్నాయి. వాటి వెనకాలే ఒక చిన్న స్టూలు. ఇలాంటివి వరసగా ఇంకా వున్నాయి ముందుముందుకి. బహుశా అదివారం నాడు అమ్మకానికి పెట్టుంటారు. చచ్చిన వాసన కమ్ముకు వస్తోంది.

పెద్ద చేపలే. లావుపాటి చేపలు.

ఈగలు తోలడానికి ఉపయోగించే కర్ర తీసుకుని నోరు తెరిచి తనవైపే చూస్తోన్న ఒక పెద్ద కొరమీను వీపులోకి గుచ్చాడు. బురదలోకి వెళ్తున్నట్టుగా సింపుల్‌గానే లోపలికి వెళ్ళిపోయింది కర్ర. అందులోంచి టానిక్‌లా చిక్కనైన నీలి రంగు బయటకి పొంగింది.

దాన్నలాగే పైకి లేపి స్టూలు మీద పెట్టి అక్కడ్నుంచి బయలుదేరాడు.

సిగ్నల్స్ దగ్గర వాహనాలన్నీ ఒకవైపు ఆగిపోయి వున్నాయి.

ఒకదాని పక్కన ఒకటిగా సుమారు కనుచూపు మేరా వున్నాయి.

ఎర్ర సిగ్నల్ యింకా వెలుగుతూనే వుంది.

ఎర్ర సిగ్నల్‌కి ఇటువైపు అంతా ఖాళీ రోడ్డు. వాహనాల్ని సమీపించి పరికించాడు. అన్నీ ఖాళీగా వున్నాయి. దాదాపుగా కార్ల డోర్లన్నీ తెరిచే వున్నాయి.

బెంజ్ కార్లోకి వెళ్ళి కూర్చున్నాడు.

వెనక సీట్లో ఏదో బాటిల్ వుండడాన్ని చూసి దాని అందుకుని అటూ ఇటూ తిప్పాడు.

'ఎలీసియం'

'వరల్డ్స్ ఫ్యూరెస్ట్ వైన్'

'మేడిన్ వెనిస్'

పేర్లు తళుక్కుమని మెరిసాయి. వెనిస్ పేరుని చూడగానే వెనిస్ నగరం ఒక్కసారి తన మనోఫలకంలోకి వచ్చింది. ఆ నీటి వీధులూ ఆ మధ్యాహ్నాలు అప్పుడు గుర్తు కొచ్చింది దారుశిల్పం.

'ఎలీసియం'ని తీసుకుని దారుశిల్పం వున్న ఇనుపవీధిలోకి అడుగుపెట్టాడు. దారుశిల్పం అలానే వుందక్కడ. బలిష్టమై నల్లని గోధుమరంగు దారురొమ్ములతో.

5

రెండు రోజులు గడిచిపోయాయి.

ఈ నగరానికేమయ్యిందో తెలియరావడం లేదు.

బహుశా ఎప్పటికీ తెలియదేమో ?

బెంగ కూడా మొదలయ్యింది. ఇక్కడే ఇలానే వుంటూ శేషజీవితం గడిచి పోతుందేమో? దారుణమైన వృద్ధాప్యం, ఒంటరి రాత్రులు ! రోజురోజుకీ భవిష్యత్తు పట్ల నిరాసక్తతా, వర్తమానం పట్ల భయం పెరుగుతున్నాయి.

తనొక్కడే ఏం చెయ్యాలీ నగరంలో ?

మిస్టరీ వీడదు ! ఎపోకలిప్స్ అంటే ఇదేనేమో ?

మృత్యువే లేక దైవమే అందర్నీ ఎక్కడికో తీసుకుపోయిందా ? ఎవరు ఎవరికి ఆగ్రహం తెప్పించ్చుంటారు ?

పగలని ఇనుపముక్కల్లాంటి ఈ ప్రశ్నలు అతన్ని చుట్టుముడుతున్నా అతని రోజువారీ జీవితం బాగానే సాగుతుంది. వైన్ తాగడం అతని సరికొత్త అలవాటు. ఉదయం లేవగానే వైన్ షాపులోకో, బార్‌లోకో వెళ్ళి బాటిల్ తెచ్చుకుంటాడు. 'ఎలీసియం' అంటే అతనికి చాలా యిష్టం. దాని రుచికీ, అదిచ్చే మత్తుకీ, అది తీసుకెళ్ళే ఊహాలోకాలకీ దాదాపుగా లోలుడైపోయాడు. ఎక్కడైనా ఎలీసియం లేకపోతే మరికొంతదూరం మరో దుకాణంలో వెదుక్కునేవాడు.

ఉదయం పదిగంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ దారు శిల్పంలోనే గడుపుతాడు. వైన్ తాగుతూ కాసేపు పచ్చని కుర్చీలో సేదదీరుతూ, బయట

తిరగడం కన్నా దారుశిల్పంలో వుండడమే ఎంతో హాయిగా వుంది తనకి. బయట తిరిగితే శరీరం మంట పుట్టడం, చీకాకుగా ఉండడమూ, మనసంతా గందరగోళంగా వుండడమూ గమనించాడు. సాయంత్రం ఐదారు గంటలప్పుడు మాత్రమే సూర్యకాంతి చల్లగవ్వగానే దారుశిల్పంలోంచి బయటకొస్తాడు.

బయట వాతావరణంలో, సూర్యకాంతి తగ్గినా మార్పు స్పష్టంగా తెలుస్తూనే వుంది.

ఉక్కపోత.

ఏదో కాగుతున్నట్టుగా ఒకటే ఆవిరి.

మిట్టమధ్యాహ్నం రోడ్డు మధ్యలో నిల్చుని చూస్తే ఎడారిలో వున్నట్టే వుంటుంది.

ఈ రోజు కూడా అలాగే వీధుల్లోకి అడుగుపెట్టాడు. రైల్వేస్టేషన్ వైపు వెళ్ళాలనే ఆలోచనతో సైకిల్ తొక్కుతూ ప్రధాన కూడలి నుండి పక్కరోడ్డులోకి మళ్ళాడో లేదో–

రోడ్డు మధ్యగా కొంతదూరంలో –

ఓ పొడవాటి వ్యక్తి వెళ్ళిపోతూ కనిపించాడు.

ఆశ్చర్యం, ఆనందం అంతర్లీనంగా భయం... అతన్ని ఉక్కిరి బిక్కిరి చెయ్యక ముందే "హలో ! హలో !!' అంటూ అరుస్తూ సైకిల్ వేగం పెంచాడు.

ఆ పొడవాటి వ్యక్తి తెల్లని నిలువుచారల నల్లని షర్టూ, నల్లని ప్యాంటు వేసుకుని వున్నాడు. ప్యాంటుకి కూడా తెల్లని నిలువు చారలున్నాయి.

చేతిలో రేడియో.

సైకిల్ దగ్గరకి చేరగానే ఆ చప్పుడికి ఒక్కసారి వెనుదిరిగి చూసాడతను.

ఏదో పరిచయమున్న వ్యక్తిని మళ్ళీ చాలారోజులకి చూసినట్టుగా అతని ముఖం గౌరవంగా నవ్వుతూ వికసించింది.

అతనే ముందు పలకరించాడు.

"మీ పేరు ఇకారస్, మీ పేరు ఇకారస్ కదా ?"

"అవును మీరు ?"

"ఎడ్వర్డు ! గుర్తున్నాడా ఎడ్వర్డ్? వుండడులే. యిక్కడేం చేస్తున్నావు? ట్రాన్స్‌ఫరా?"

ఏదో తెలిసినోడిలాగా, అనుమానంతో మాట్లాడేసరికి ఇకారస్ ఆశ్చర్యం నుంచి తేరుకుని- ట్రాన్స్‌ఫరేంటి ?" అన్నాడు.

'లేకపోతే యిక్కడేం చేస్తున్నావ్ ?'

"నేనేమీ చెయ్యట్లేదు, నాకే ఉద్యోగం లేదు".

"మరి యిక్కడెందుకున్నావ్ ?" ఎడ్వర్డ్ గొంతులో అంతర్లీనంగా కఠినత్వం.

'ఏమో యిక్కడెందుకున్నానో, ఇక్కడకెందుకొచ్చానో నాకే తెలీదు'

'పిచ్చనాకొడకా'

'యిష్టం వచ్చినట్లు మాట్లాడకా! నేను తెలుసా నీకు ?' ఇకారస్ ఆవేశంతో వూగిపోతూ అడిగాడు.

దాంతో ఎడ్వర్డ్ గొంతు తగ్గించి మాట్లాడ్డం ప్రారంభించేడు.

"ఆc తెలిసినట్టే వుంది"

"ఎక్కడ తెలుసు నీకు?" ఇకారస్.

"ఓడరేవులో ఒకరోజు రాత్రి". ఎడ్వర్డు.

"ఓడరేవులోనా ?"

"అవును ఓడరేవులోనే గుర్తుందా? ఒకరోజు రాత్రి తూర్పు తీరంలో నువ్వు నా దగ్గరికి వచ్చావు జ్వరంతో ... చిల్లర డబ్బుల కోసం."

"ఆc ఆc" గుర్తుకుతెచ్చుకుంటూ ఇకారస్.

"మరొక రోజు పడవలో సరంగు పక్కన కూర్చుని నువ్వు కునికిపాట్లు పడుతుండగా వెనకాల వచ్చి నుంచున్నాను. గుర్తుకొస్తోందా ? బియ్యం బ్యాగుల మీద పడవలో కూర్చుని వున్నావు"

"ఆc ఆc గుర్తుకొస్తోంది" మైల్డుగా జవాబిచ్చేడు ఇకారస్.

ఎడ్వర్డ్ ఉన్నట్టుండి కోపం తెచ్చుకున్నాడు.

"గుర్తుకొస్తాది నీకు. ఎందుకు గుర్తుకురాదూ. నీకు జ్వరమొచ్చి పడుకొనుంటే ఎవడ్రా నిన్ను ఆసుపత్రికి తీసుకెళ్ళింది"

"అవును" ఇకారస్.

"నీకు ఆకలేసి పడుంటే ఎవడ్రా నీకు మెస్‌టికెట్లు, సినిమా టికెట్లూ ఇచ్చింది"

"అవును, గుర్తుకొస్తోంది. కానీ నీవెవరో యిప్పటికీ గుర్తుకు రావట్లేదు"

"గుర్తుకు రాదు నీకు. నువ్వొక ఎధవ్వి. ఇప్పుడెక్కడికి వెళ్తున్నావు ?" కోపం తగ్గి నెమ్మదిగా అడిగాడు ఎడ్వర్డ్.

"ఏమో తెలీదు. ఎక్కడికి వెళ్ళాలో'

"వస్తావా ఇంటికి ?"

దగ్గరి బంధువు లాగా అడిగాడు ఎడ్వర్డు.

"ఎవరింటికి ?"

"ఎవరింటికేంటి ? పిచ్చినా కొడకా ! నా యింటికే"

"వస్తాను"

"పా మరి"

"తినలేదు" ఇకారస్.

"రా వెళ్దాం. ఇక్కడ దగ్గర సెల్లార్లో మంచి రెస్టారెంట్ వుంది. అక్కడ తిని వెళ్దాం. నీకో విషయం తెలుసా ఈ హోటల్సులో, రోడ్లలో, మెడికల్ షాపుల్లో బట్టల షాపుల్లో, బస్టాండ్లలో ఎవరూ లేరు. ఏ ఒక్క మనిషీ కనిపించలేదు. నువ్వు తప్ప".

ఇద్దరూ రెస్టారెంట్‌వైపు మళ్ళారు. యాభై, అరవై మెట్లు దిగిన తర్వాత అప్పుడు కనిపించింది. రెస్టారెంటు గాజుతలుపు ఇంకా లోపలికీ బయటకీ కదులుతూ వుంది.

ఎడ్వర్డ్ చివరి మెట్టు దగ్గర ఒకసారి ఆగి "ఇంతకు ముందెవరో యిక్కడికి వచ్చుంటారు. జాగ్రత్త దొంగలు కావొచ్చు లేదా విదేశీయులైనా కావొచ్చు" అన్నాడు.

ఎడ్వర్డ్ వెనకాలే దిగుతోన్న ఇకారస్‌లో కొంత కొంత భయం జనించినా నిమ్మళించుకుని, కదులుతోన్న అద్దపు తలుపు వంక చూశాడు. అద్దం మీద రంగురంగుల పూలూ లతలూ చిత్రించి వున్నాయి. ఎడ్వర్డ్ అప్పుడు చెప్పాడు ఇకారస్‌తో "అది అంతే. అలానే కదులుతూ వుంటుంది. నువ్వేమీ భయపడక.ఈ నగరంలో నువ్వు తప్ప వేరెవరూ వుండరని గుర్తుంచుకో".

చొరవ తీసుకుని ఇకారస్ లోపలికెళ్ళాడు. లోపలంతా చల్లగా వుంది. టేబిళ్ళ మీద సగం తిని వదిలేసిన ప్లేట్లు అలాగే వున్నాయి. మరికొన్నింటి మీద మద్యపు సీసాలూ గ్లాసులూ.

కొన్ని గ్లాసులో మద్యం యింకా వుంది, నిండుగా, సగం సగంగా.

ఎడ్వర్డ్ వెనకాల టేబిల్ మీద చెయ్యి ఆన్చబోయి కోడి తొడ వున్న సూప్ ప్లేట్ మీద పెట్టాడు. జ్యూస్ చెయ్యి మీద పడి కోడితొడ కిందపడింది

ఇకారస్ దాన్ని తీసి టేబిల్ మీద పెట్టాడు.

ఎడ్వర్డ్ దాన్నందుకుని వాసన చూసి

"పాడయిపోయింది. ఇలాంటివేమీ తినకూడదు మనం. లోపలేమన్నా వుంటే కొత్తగా వండుకోవాలి. ముందు కడుక్కుందాం పద"

ఇద్దరూ వాషింగ్‌రూంలోకి వెళ్ళారు.

ఎడ్వర్డ్ వాష్ బేషిన్‌లో మొహం కడుక్కుంటూ మొహాన్ని అద్దంలో చూస్తూ కళ్ళల్లోంచి పుసుల్ని తీసుకుంటున్నాడు. ఇకారస్ ఎడ్వర్డ్ ముఖాన్ని చూసి విస్తుపోయాడు.

ఎడ్వర్డ్ ముఖం చాలా భిన్నంగా ఎప్పుడూ చూడనట్టుగా వుంది కానీ పరిచితమైన ఆనవాళ్ళే వున్నాయి.

నీగ్రో మనిషికుండే లావుపాటి పెదాలు. కానీ నీగ్రోకైతే పెదాలు బలిష్టంగా వుంటాయి. ఎడ్వర్డ్‌కి మాత్రం పలచగా, నారింజతొనల్లా, గుచ్చితే పగిలిపోయేలాగా ఎనీమియా వచ్చినట్టు పాలిపోయి పొరలుకట్టి వున్నాయి. కళ్ళు మాత్రం తనలాంటి కళ్ళే. దవడలు కూడా తనకన్నా బలిష్టంగా వున్నాయి. గడ్డం పెరిగింది.

ఎడ్వర్డ్ మాత్రం తనని పరిశీలిస్తోన్న ఇకారస్‌ని ఏమీ పట్టించుకోకుండా జుత్తులో తెల్ల వెంట్రుకలేమైనా వున్నాయా అని వెదుకుతున్నాడు. ఒకదాన్ని పీకే ప్రయత్నంలో నిమ్మగమై వున్నాడు. ఇకారస్ అంతరంగాన్ని గమనించాడో ఏమో "ఏంటీ నా వయసెంత వుంటుందని అనుకుంటున్నావా"

"లేదు. లేదు. మీరు తెల్లవెంట్రుకల్ని వెదుక్కోవడాన్ని చూస్తున్నాను"

"తెల్ల వెంట్రుకల్ని తీసుకోవడంలో భిన్నతేముంది ?"

"భిన్నమైందేమీ లేదు కాని. యింతవరకు మీరెన్ని వెంట్రుకలు తీసారో లెక్కపెట్టాను." నవ్వుతూ జవాబిచ్చేడు ఇకారస్.

'ఆహా ! ఎన్ని ?'

'ముప్ఫయ్ రెండు'

"అంకెల్ని చాలా జాగ్రత్తగా లెక్కపెడతున్నావే. చిన్నప్పుడు స్కూల్‌లో లెక్కల మాస్టారంటే భయమా ?" ఎడ్వర్డ్.

"లెక్కల మాష్టార్ కాదు. లెక్కలంటేనే భయం. స్కూల్లో లెక్కలెప్పుడూ ఇంటికి భోజనానికి వెళ్ళొచ్చిన తర్వాత మధ్యాహ్నం పూట చెప్పేవారు. ఒకసారి వచ్చింతర్వాత మళ్ళీ స్కూలుకి వెళ్ళాలంటే భయం వేసేది కానీ భయం కొద్దీ వెళ్ళక తప్పేది కాదు" ఇకారస్.

"వెళ్ళి ఏం చేసేవాడవు ?" లోలోపల నవ్వుకుంటూ అడిగేడు ఎడ్వర్డు.

"వెళ్ళి వెనకబెంచీలో నాకన్నా పొడవైన వాడి వెనకాల ముఖం దాచుకుని కూర్చునేవాడ్ని. ఆ పొడవైన వాడ్ని ఎప్పుడూ గౌరవించేవాడ్ని".

ఇకారస్ మౌనంగా, దిగులుగా ముఖం పెట్టేడు.

అది గమనించి "నేనూ అలాగే చేసేవాన్ని. కాని ఇప్పుడు అంకెలు రోజూ గుర్తుకొస్తున్నాయి.లెక్కల మాష్టారెవరో యిప్పుడు స్పష్టంగా తెలుస్తోంది" అన్నాడు ఎడ్వర్డు.

"తెలియడమంటే ?" ఇకారస్.

"తెలియడమంటే ఏం కాదు. ఇప్పుడు నేనెన్నో అంకెముందు - ఆ అంకెని చెప్పలేక, ఆ అంకె అంటే యిష్టం లేక ఆ వేడిమిలో సొమ్మసిల్లి పడి పోతానో తెలీదు. అంకెలు లక్షల దాటి లెక్కపెట్టగల్గినా ఇప్పుడు ఒక్కొక్క అంకె కూడబలుక్కోడానికి ఒక సంవత్సరం పడుతోంది".

"ఒక అంకెని పూర్తి చెయ్యడానికి ఒక సంవత్సరం పడుతోందా ?" కను బొమలు ఆశ్చర్యంలో పైకెత్తి ఇకారస్.

"ఇవన్నీ నీకు తెలియవులే. ముందు మొహం, కాళ్ళూ కడుక్కో. స్నానం చెయ్యాలన్పిస్తే చేసేయ్. యిక్కడే. నిన్ను చూడ్డానికి ఇక్కడెవరూ లేరు-రారు. ఈలోగా నేను ఆహారం ఏర్పాట్లు చేస్తాను" అంటూ ఎడ్వర్డ్ బాత్‌రూంలోంచి వెజిటబుల్ స్టోర్ రూంలోకి వెళ్ళాడు.

రాక్స్‌లో దాదాపు అన్నిరకాల కాయగూరలున్నాయి. గుమ్మడికాయలు, సొరకాయలు, పొట్లకాయలు, పొడవాటి వంకాయలు ఇంకా నిగనిగలాడుతున్నాయి. టమాటోలు కూడా. ఎడ్వర్డ్‌కి టమాటోలంటే యిష్టం. టమాటోలున్న ట్రే మీద చెయ్యి వేసి తడిమాడు. చల్లగా గట్టిగా తగిలాయి టమాటోలు. కాయకూరలే వుండే ఈ స్టోర్ మొత్తం ఏసీ వుండడం వలన అవింకా తాజాగా వున్నాయి. పక్క రోలోకి వెళ్ళాడు. నల్లని వంకాయరంగు సోయాబీన్ గింజలు దృఢంగా పెద్దవిగా వున్నాయి. దానిపక్కనే ఎర్రని

కేరట్లు తాజాగా. తను మొదట్నుంచీ వీటి కోసమే చూస్తున్నాడు. ఒక ట్రేలోంచి వంకాయల్ని ఖాళీ చేసి అందులో కొన్ని కేరట్లు తీసుకున్నాడు. పక్కన గుడ్లు కనిపించాయి. ఎడ్వర్డ్‌కి గుడ్లంటే ఒక నోస్టాల్జియా. పక్కపక్కన నిలబెట్టినట్టున్న ఏ రెండు కోడిగుడ్లని చూసినా నగ్నంగా కూర్చుని వున్న పిల్లలు, స్త్రీలే గుర్తుకు వస్తారు. వెనక్కి జుత్తు ఆరబోసుకుని వుంటూనో, సాలోచనగా ముఖం పైకెత్తి కనెప్పలు మూసుకుని వుంటూనో కనిపిస్తారు. గుడ్లంటే యిష్టమూ, అయిష్టతా రెండూ వున్నాయి. ఇంతకుముందు బాగానే తినేవాడు. యిప్పుడెందుకో తగ్గించేశాడు.

కిచెన్‌లోకి వెళ్ళి కొత్త చాకు తీసుకున్నాడు ఎడ్వర్డు.

గుడ్లనీ కారెట్లనీ వండాలని నిశ్చయించుకుని మార్బుల్స్‌తో చేసిన కౌంటర్ లోకెళ్ళి రివాల్వింగ్ చైర్‌లో కూర్చున్నాడు. మార్బుల్ కౌంటర్ మీద కాయగూరలు పెట్టి సొరుగు వెనక్కి లాగాడు. ఐదొందల రూపాయల నోట్లు వెయ్యిరూపాయిల నోట్లు వందరూపాయల నోట్లు లెక్కపెట్టకుండా అలాగే వున్నాయి.

ఎడ్వర్డ్ కొన్ని నోట్లతో చాకుని శుభ్రం చేస్తూ మనసులో అనుకుంటున్నాడు. 'ఇప్పుడేం చేసుకోవాలి వీట్ని. అదృష్టం కూడా వుండాలి అనుభవించాలంటే' చాకుని శుభ్రం చేసిన తర్వాత ఆ నోట్లని కష్టమర్లు కూర్చునే టేబిళ్ళ వైపు విసిరేశాడు. మరికొన్ని తీసుకుని కౌంటర్ పైన శుభ్రంగా తుడిచాడు. కాయగూరలు కోసేటప్పుడు వాటి దుమ్ము అంటుకోకుండా.

మురికీ దుమ్మూ అంతా నోట్లకి అంటుకుని నల్లగా అయిపోయాయి.

6

ఇకారస్ ఒళ్ళు తుడుచుకుని బట్టలేసుకుంటూ ఎడ్వర్ట్ గురించి ఆలోచిస్తున్నాడు. కొంత అనుమానం కూడా మొదలయ్యింది.

'ఓడరేవులో పనిచేసిన మాట నిజమే. ఆ రాత్రుల్లో జెట్టీల దగ్గర గానీ, వార్ఫ్ మీద గానీ చూడలేదు అతన్ని. అతనేమన్నా ఆత్మ తాలూకు రూపం కాదు కదా ? మృత్యువే అతని రూపంలో వచ్చి తనని హతమార్చేందుకు సరైన సమయం కోసం ఎదురుచూడ్డం లేదు కదా ?

'అన్నంలో విషం గానీ కలపగలడు ? నగరంలోని ప్రజలందర్నీ అదృశ్యం చేసిన దుష్టశక్తి కాదు కదా తను? ఏమైనా అప్రమత్తంగా వుండాలి. అవసరమైతే

చావుకి సిద్ధంగా వుండాలి. ప్రమాదమొచ్చినపుడు బాదేయడానికి కూడా'. తెల్లని టర్కీటవల్‌తో తల రుద్దుకుంటూ బయటకొచ్చాడు ఇకారస్. ముఖమంతా ప్రశాంతంగా హాయిగా వుంది. సహజసిద్ధమైన సౌష్ఠవంతో చాలా ఆరోగ్యంగా కనిపిస్తాడు ఇకారస్. అలాగని కండలు తిరిగిన మనిషి కాదు.

ఇకారస్ కౌంటర్‌లోకి వెళ్ళి ఎడ్వర్డ్ వెనకాల నిల్చున్నాడు, షర్ట్ గుండీలు పెట్టుకుంటూ. ఎడ్వర్డ్ రెండు మూడు ఐదొందల నోట్లతో ప్లేటు తుడిచి అందులో కోసిన కేరట్ ముక్కలు వేస్తున్నాడు. పక్కన కొన్ని నోట్లుపరిచి వాటి మీద ఉల్లిపాయ తొక్కలూ, పచ్చి మిరపకాడలూ వెల్లుల్లి తోకలూ, కొత్తిమీర, పుదీనా వేళ్ళూ ఇలా వేస్తంతా వేస్తున్నాడు.

ఎడ్వర్డ్ అలా డబ్బుని ఏవో చిత్తుకాగితాల్లాగా వుపయోగించడాన్ని చూసి చూచాయగా ఎడ్వర్డ్ తనకెక్కడో పరిచయమున్నట్టుగా... లీలగా అప్పుడు కలుసుకున్న సందర్భం, ఆ స్థలం మదిలో కనిపిస్తున్నాయి కానీ ఖచ్చితంగా ఫలానా అని ఒక అంచనాకు రాలేక పోతున్నాడు ఇకారస్.

'ఏమిటీ ఆశ్చర్యపోతున్నావా ... నిన్నటి నుంచీ నేనిలాగే వాడుతున్నాను వీటిని' ఇకారస్‌ని గమనించి అన్నాడు ఎడ్వర్డ్.

'కోపమా' ఇకారస్.

'అవే కదా ఈ లోకాన్ని రెండుగా విడదీసింది' అంటూ ఒక ఐదొందల నోటుని రెండుగా చీల్చి అవతలకి విసిరేసాడు ఎడ్వర్డ్. కాగితపు రాకెట్టుని గాల్లోకి విసిరినట్టు.

'ఇంకా నీచపు పనులకి వాడతాను వీట్ని. వీటితో ముందు శుభ్రం చేసుకుని నీళ్ళతో కడుక్కుంటాను' అన్నాడు ఎడ్వర్డ్ నవ్వుతూ.

'ఈ మృతనగరంలో నా ఆవేశమంతా వృధా. కానీ ఇవెందరికో కష్టాల్నిస్తాయి... మరెందరికో సుఖాల్నిస్తాయి. అతినీచపు పద్ధతుల్లో తోటి మనుషులపై అజమాయిషీ చెలాయించడమెలాగో నేర్పుతాయి. గింజలు పడేసి పనులు చేయించుకోవడం నేర్పుతాయి. ఒకరి భుజాల మీద నిల్చుని, కిందనున్నవాన్ని బుద్ధిహీనున్ని చేసి ఆనందించే తెలివి తేటల్నిస్తాయి.

"అవును" ఇకారస్.

నిద్రించే ఈ నగరంలో, ఈ ఖాళీ వీధుల్లో, గాలి మాత్రమే, దుమ్మూ, ధూళీ మాత్రమే కదలాడే ఈ వీధుల్లో ఎంత డబ్బు అలా పడి వుందో తెలుసా ? నేను

చూశాను అదంతా. ఈ చౌరస్తాలో పోగుచేస్తే పెద్ద అపార్ట్‌మెంటంత గుట్టవుతుంది. చిక్కని నల్లని పెట్రోలు పోసి తగలబెట్టాలి. ఆ పని ఎప్పటికైనా చెయ్యాలి'

సొరుగుని లోపలికి తోస్తూ ఆవేశంతో ఎడ్వర్డ్.

"అది సాధ్యమా. ఒకే దగ్గర గుట్టవేసి కాల్చడం?" ఇకారస్.

"ఎందుకు సాధ్యం కాదు. ఏ సెక్యూరిటీ గార్డూ, ఏ పోలీసోడూ, ఏ ఇంటి యజమానీ అడ్డం రాడు కదా. కానీ ఆ డబ్బంతట్నీ ఒక చోటకి చేర్చడం మనవల్ల కాదు. ఒక జీవిత కాలం సరిపోదు. ఈలోగా ఇక్కడ ఏదైనా జరగొచ్చు. మనం ఊహించనిది.

"ఊహించనిదేదైనా జరగొచ్చంటావా ?'

కౌంటర్ మీద కూర్చొంటూ అడిగాడు ఇకారస్.

"'జరగొచ్చు. ఏముంది ఒక పెనుగాలి రావొచ్చు లేదా పెద్ద సుడిగాలి, అమెరికాలో వస్తుంటాయి చూసావా, అట్లాంటివి. ఒక్కసారిగా ఇరవై ముప్ఫయ్ ట్విస్టర్లు వచ్చాయంటే ఏమౌతుంది ? ఏమీ మిగలదు కదా ?" ఎడ్వర్డు.

"అదే జరిగితే అంతా శూన్యమే. ప్రాణం అనేది వుండదు. అంతా జరిగిపోయాక మళ్ళీ ఎవరుంటారు ఆ ప్రదేశంలో? మళ్ళీ కొత్తగా ఇల్లు కట్టుకోవడాలూ, పెళ్ళిళ్లూ, ప్రేమలూ"

"లేదు. అలా జరిగే వీల్లేదు. ఒకసారి పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిన తర్వాత మళ్ళీ ఆవిర్భవించడానికి అవకాశం లేదు. బహుశా ఇప్పుడు జరిగిందంతా సమూల నాశనంలో తొలి అధ్యాయంలా కన్పిస్తోంది. ఎందుకంటే యిది ప్రపంచవ్యాప్తంగా జరిగిన విపత్తు".

"ప్రపంచం మొత్తం మీద జరిగిన విపత్తని మీరెలా వూహిస్తున్నారు?" ఇకారస్.

"ఆ విషయం నాకు ఖచ్చితంగా తెలుసు. ఏమైనప్పటికీ ఈ సమయంలో దేన్నీ పూర్తిగా వాస్తవంగా అంచనా వేయలేం అనుకో".

కాసేపాగి,

"అయితే, ఎందుకు దృఢంగా నమ్ముతున్నానంటే నిన్న మధ్యాహ్నం టీవీ స్టేషనుకి వెళ్ళాను. అక్కడా ఎవరూ లేరనుకో. స్టేషను మొత్తం బార్లా తెరిచే వుంది.. శాటిలైట్ కమ్యూనికేషన్స్‌ని నియంత్రించే గదిలోకి వెళ్ళాను. టీవీ మానిటర్‌ల మీద గానీ, ఇతర

సిస్టమ్‌ల నుంచి గానీ ఎటువంటి సిగ్నల్స్ తెలియరావడం లేదు. ఈ రేడియోలో కూడా ప్రయత్నించాను. స్టేషన్‌లోదే యిది. ఇంటర్నేషనల్ ప్రసారాలన్నీ యిది కేచ్ చేయగలదు. కానీ ఒక్క మానవ స్వరం కాదు; కానీసం సంగీతమైనా విన్పించడం లేదు. ఎప్పుడూ ఆన్ చేసి నావెంటే వుంచుకుంటాను."

ఎడ్వర్డ్ వీల్ చెయిర్‌లో వెనక్కివాలి ఇకారస్ కళ్ళలోకి చూస్తూ "కానీ మనం జాగ్రత్తగా వుండాలి. మనుషులు కాకుండా ఇతర గ్రహజీవులేమైనా తిరుగుతూ వుండొచ్చు. శరీరమంతా చెవులై తిరగాలి. ఎక్కడ వున్నా అది మాత్రం గుర్తుంచుకో".

"అది నిజమంటారా?" గ్రహజీవులనగానే లోలోపల నవ్వుకుంటూ అడిగాడు ఇకారస్.

"నిజమని ఖచ్చితంగా చెప్పలేను. మన ప్రాణ భద్రతతో మనం వుండాలి కదా ! నీ ఆలోచనల్లో నువ్వే మునిగి ఎక్కడో కూర్చుని వున్నప్పుడు వాళ్లు నిన్ను గమనిస్తూ వుండొచ్చు. నీ చుట్టుపక్కల ఏ రూపంలోనైనా వుండగలరు వాళ్ళు. అంత కమాండ్ వుంటుంది వాళ్ళకి. ఎందుకంటే మరికొంతకాలమైనా. ఈ భూమి మీద తిరగాల్సిన వాళ్ళం కదా".

"భయపడుతున్నారా ! ఎవరూ లేని ఈ నిర్జన నగరంలో భయమెందుకు' ఎడ్వర్డ్‌కేసి చూస్తూ అన్నాడు ఇకారస్.

"భయమా! భయమెందుకు? ఏకాంతమంటే మరీ యిష్టం నాకు. కానీ ఏ దురదృష్టకర పరిస్థితుల్లోనో వాళ్ళు నిన్ను పట్టుకున్నారనుకో వాళ్ళకి భయపడి నా గురించి చెప్పేస్తావు నువ్వు. అప్పుడు మనిద్దర్నీ మిగతా ప్రజలందర్నీ ఖతం చేసినట్టు చేస్తారు. "అంగారక గ్రహజీవుల దాడి" అన్న పేరుతో వచ్చిన నవలల్ని చదవలేదా నువ్వు? ఆ కల్పనలన్నీ నిజం కాకపోయినా మనమున్న పరిస్థితుల్లో అవి వాస్తవమనే అనుకుందాం".

"లేనిపోని భయాలు కల్గిస్తున్నావు. నేనొక్కడ్నే వున్నప్పుడు నాకే భయం లేదు. ఒక్క దీపమైనా వెలగని వీధుల్లో ఒక్కడ్నీ పడుకున్నాను. అదీ వెన్నెల రాత్రుల్లో రోడ్డు మీద కూర్చుని. కన్నెత్తి చూస్తే అంతా శూన్యం. ఖాళీ, వెన్నెల ఖాళీ. ఇప్పుడు నువ్వు కన్పించావు. నాకు భయం వేస్తోంది. ఒక్కడ్నే వుండాలంటే". కౌంటర్ నించి కిందికి దిగుతూ అన్నాడు ఇకారస్.

"భయమెందుకు. ఇద్దరం కలిసే వుందాంలే" ఎడ్వర్డ్ లేచి ఉడికిన గుడ్లను తెచ్చి చల్లటి నీళ్ళలో వేసాడు. "గుడ్లను వొలవడం వచ్చా నీకు? శుభ్రంగా-చక్కగా"

ఇకారస్ జవాబు. "వచ్చు. వచ్చంటే ఎప్పుడూ వొలవలేదు. కానీ ప్రయత్నిస్తాను."

'వద్దులే నువ్వూ నాలోంటోడివే. భలే దొరికాంలే ఒకరికొకరం. నీ కన్నా నేను చక్కగా వొలవగలనని నా విశ్వాసం'.

ఎడ్వర్డ్ వలిచిన గుడ్లని ఒక్కోచేతిలో ఒక్కోటి పట్టుకుని హుషారుగా ఇకారస్ వద్దకు వచ్చాడు. ఇకారస్ అప్పటికే భోజనం ఏర్పాటు చేసాడు.

వొలిచిన గుడ్డు కొన మీద చూపుడువేలు ఆన్చి కొత్త చాకుతో దాన్ని నిలువునా కోసాడు.

7

రాత్రి తొమ్మిదిగంటలవుతోంది.

ఇకారస్ ఎడ్వర్డులు రోడ్డు మీద మాట్లాడుతూ నడుస్తున్నారు.

"మీకిక్కడ స్వంత యిల్లు కూడా వుందా?' తనేమైనా అనుకుంటాడా అని భయపడ్డాడు కానీ వుండబట్టలేక అడిగేసాడు ఇకారస్. ఎందుకంటే ఎడ్వర్డ్‌ని చూస్తే చాలా పెద్దవాడిలా కనిపిస్తాడు. ముప్ఫయ్ రెండేళ్ళో, ముప్ఫయ్ మూడో వుంటాయి తనకి. యీపాటికి పెళ్ళయిపోయి పిల్లలు స్కూలుకెళ్తుండేవాళ్ళు. అలా కనిపిస్తాడు, తను.

"అవును. వుంది స్వంతయిల్లు" తెగేసి చెప్పాడు ఎడ్వర్డు.

"ఈ ఇళ్ళన్నీ ఏం చేసుకుంటారు. అవన్నీ యిప్పుడు ఎవరివీ కావు కదా" అంటూ చుట్టుపక్కల అపార్టుమెంట్లనీ, ఆఫీసుల్నీ, దుకాణాల్నీ చూపిస్తూ అన్నాడు ఇకారస్.

"ఏం చేసుకుంటాం ? అవలా పడి వుంటాయంతే. అవసరమైతే మనము సరదాకి ఏ ఇంట్లోనైనా కాసేపు గడిపి వస్తుంటాం అంతే"

"ఈ యిళ్ళన్నింటికన్నా మీ యిల్లు బావుంటుందా ?"

"బావుంటుంది. ఇప్పుడు చూస్తావుగా ఇకారస్" అంటూ ఎడ్వర్డ్ పక్కనున్న వైన్ షాపుల వైపు వున్నట్టుండి మళ్ళాడు. వైన్ షాపు చాలా పెద్దదే. దానిముందున్న వాహనాల్ని చూస్తే రద్దీ వుండే ప్రముఖ షాపే అయివుంటుంది. అక్కడంతా చీకటిగా వుంది. ఎడ్వర్డ్ కౌంటర్ అవతలకి ఒక్క గెంతులో దూకి లోపలికెళ్ళాడు. తనకిష్టమైన మద్యం ఎక్కడుందో తనకి తెలుసు.

లోపలికెళ్ళగానే లైట్లేసాడు.

లోపలి లైట్లతోపాటూ బయట లైట్లు కూడా వెలిగాయి.

"వీనస్ స్టోర్" అని పెద్ద పెద్ద అక్షరాల్తో షాపు పేరు స్పష్టంగా కన్పించింది.

ఎడ్వర్డ్ తన బాటిల్ తీసుకుని బయటకొస్తూ లైట్లన్నీ ఆర్పేసి వచ్చాడు.

"ఏం తెచ్చావు?" ఇకారస్

'రమ్' ఎడ్వర్డ్ బాటిల్‌ని బయటికి తీసి చూపించాడు.

"లెతె" ఇకారస్ బాటిల్ పేరుని చదువుతూ బయటికే ఉచ్చరించాడు. లేబిల్ చుట్టూ వున్న బంగారపు అంచు మెరుస్తోంది.

'మీ కిష్టమైన బ్రాండా యిది ? ఎప్పుడూ వినలేదు కొత్తగా వచ్చిందా ?'

"అవును వారం రోజుల క్రితమే మార్కెట్లోకి వచ్చిన గుర్తు".

"బావుంటుందా" ఇకారస్.

"బావుంటుంది. తాగిన తర్వాత గమ్మత్తుగా అంతా మర్చిపోయినట్టు మనమెవళ్ళమో మనకే తెలియనట్లు అనిపిస్తుంది".

మళ్ళీ ఎడ్వర్డే "ఇంకో విషయమేమిటంటే, ఇది తాగితే తెల్లని బూడిద వర్ణపు చెట్లు, అలా ఆకుల్ని కదుపుతూ చాలా హాయిగా కనిపిస్తాయి. ఆకులు పడిన చప్పుడు కూడా కొందరికి విన్పిస్తోందని విన్నాను".

"రాలుతున్న ఆకుల చప్పుడు కూడా విన్పిస్తుందా" ఆశ్చర్యంతో ఇకారస్.

"లెతె అంటే ఏమనుకున్నావు ! కొన్నిసార్లు ఎక్కువయ్యిందంటే నీ దేహమే. నిన్ను మర్చి పోతుంది. మర్చిపోవడమంటే మామూలుగా మర్చిపోవడం కాదు. నిజంగానే మర్చిపోయినట్టనిపిస్తుంది".

"మరి తినడానికేమైనా తెచ్చుకోవాలి గదా"

"ఇంట్లో వున్నాయిలే"

"వెళ్దాం ఇంటికి" ఎడ్వర్డ్ యిల్లుని చూడాలనే తాపత్రయంతో ఉన్నాడు ఇకారస్.

"స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నాయేంటి ? ఎవరైనా వేసారంటారా"

"లేదు. లేదు ఉదయం ఆన్ చేసి వుంచాను' మా యింటి నుండి చూస్తే ఈ రోడ్డు మొత్తం కనబడుతుంది. ఇంటి నుండి చూస్తుంటాను ఎవరైనా కనిపిస్తారేమోనని"

"ఈ ఇళ్ళల్లో, ఈ కార్లలో ఎవరైనా వుండే అవకాశం లేదా?"

ఇకారస్‌కింకా అనుమానం వెంటాడుతుంది.

"ఎవరూ ఉండరు"

'చూడండి కవర్ తెగిపోయేటట్టు వుంది' అంటూ ఇకారస్ ఎడ్వర్డ్ పట్టుకున్న 'లెతె' కవరు వంక చూపించాడు.

"ఏం కాదులే. అయినా యింటి దగ్గర కొచ్చేసాం" –

"బరువు వుంటుందా? లెతె?"

"అవును. కావల్సివస్తే పట్టుకుని చూడు" నవ్వుతూ ఇకారస్‌కి లెతెని అందించాడు.

"హమ్మో మూడునాలుగు కిలోలుంటుంది. అంత బరువైనది తాగితే చచ్చిపోరూ" ఇకారస్

"అదే లెతె ప్రత్యేకత. తాగకముందే భయపెడుతుంది ఎవర్నైనా. దీన్ని చేతుల్లోకి తీసుకున్న మనిషి గుండె కూడా బరువెక్కుతుంది. లెతె'ని చూసి చాలామంది అయితే పక్కకి తప్పుకుంటారు. ఈ భయాలన్నీ తాగకమునుపే. ఒక్క పెగ్గు తీసుకుంటే తర్వాతంతా హాయిగా వుంటుంది" అంటూ దాన్ని ముద్దెట్టుకున్నాడు తనివితీరా. చప్పుడు చేస్తూ. గుండె దగ్గర దాన్ని ఆనించి ఎత్తి పట్టుకున్నాడు.

"ఇలా యిటువైపు' అంటూ ఇకారస్‌కి చెప్తూ రోడ్డు నుండి వీధిలోకి మళ్ళాడు. వాళ్ళు కొంతదూరం నడిచి వెళ్ళారో లేదో రెండు నిముషాలకి మళ్ళీ ఇనుపరోడ్డు మొదలయ్యింది.

ఇకారస్ మనస్సులో తటాల్మని మెరుపులా దారుశిల్పం గుర్తుకొచ్చి ఇనుపరోడ్డు మీద ఎడ్వర్డు కన్నా గబగబా ముందుకు నడిచి చూసాడు.

కొంతదూరంలో రెండు పెద్ద పిరుదులు, కాళ్ళూ కనిపించాయి.

తర్వాత పైకి చూశాడు.

నడుమూ, వీపూ, అరచేతుల్లోని చేతులూ

ఇది కూడా దారుశిల్పమే.

వంకాయరంగులో నిగనిగలాడుతోంది.

ఇకారస్ వుంటోన్న దారుశిల్పం కన్నా ఆరింతలు పెద్దది. అందుకే మొదట చూడగానే పిరుదులు కనిపించాయి.

ఇకారస్ ఆశ్చర్యంతో ఏదో అనబోతుండగా

"యిదే నా యిల్లు" అన్నాడు ఎడ్వర్డ్.

"యిదా? ప్రస్తుతం నేనుంటున్నది కూడా యిలానే వుంటుంది". పిరుదుల వైపు తలెత్తి చూస్తూ ఆశ్చర్యంతో చెప్పాడు ఇకారస్.

"దానికెందుకు ఇంతలా ఎక్సైట్ అవుతావు. ఇల్లు ఒకేలా వుండొచ్చు".

8

ఎడ్వర్డ్ దారుశిల్పం కాళ్ల దగ్గరికి అవతలివైపు వెళ్ళి ఏదో తాడుని తప్పించి దాన్ని ఎడంగా పట్టుకొచ్చి ఇవతల వైపుకి వేశాడు.

సైనికులు ఆపద సమయంలో హెలీకాప్టర్ నుంచి దిగేందుకు వుపయోగించే తాడు నిచ్చెన అది.

ఇకారస్ కింద నుంచి పై దాకా ఆ నిచ్చెనని చూశాడు. పచ్చగా వుంది. అది దారుశిల్పం మెడలోంచి గట్టిగా దేనికో కట్టబడి వీపు మీదుగా లావుపాటి పిరుదులు మీదుగా పాదాల్లేని కాళ్ళ వరకూ వుంది.

ఎడ్వర్డ్ గడ్డ మీదకొచ్చి పక్కనున్న స్ట్రీట్‌లైట్‌ని వేశాడు. దారుశిల్పపు ఆవరణంతా పసుపు నియాన్ కాంతిలో స్పష్టంగా కనబడుతోంది. పసుపుకాంతి దారుశిల్పపు నడుముమవరకే పడుతోంది.

పిరుదులు సమ్మోహనకరంగా వున్నాయి. నియాన్ కాంతిలో నున్నగా వున్న వీపు మీదుగా పిరుదుల మించి జాలువారి తొడల వరకూ వేలాడుతోన్న పచ్చని తాడు నిచ్చెన ఉధృతంగా వీస్తోన్న గాలికి అటూ ఇటూ కదుల్తోంది.

"ఎక్కగలవా ? ఎప్పుడైనా ఎక్కావా?" ఎడ్వర్డ్ ఇకారస్ కేసి తిరిగి అడిగాడు.

"లేదు ఎక్కలేదు" ఇకారస్.

"ఎక్కలేదా ? మరి ఎలా వుంటున్నావ్? ఇంట్లో'

"యిలాంటి తాడు నిచ్చెన లేదు. అయినా అది చిన్నది కదా ఈజీగానే లోపలికి పోవచ్చు" ఇకారస్.

"ఓహో' అలాగా. ప్రతిదానికీ తాడునిచ్చెన వుండాలే నాకు తెలిసి"

ఎడ్వర్డ్ అనుమానానికి ఇకారస్ జవాబేమీ ఇవ్వలేదు.

"కానీ చాలా పొడవుగా వుంది. గాలికి మధ్యలో పడిపోం కదా" సందేహం వ్యక్తం చేశాడు ఇకారస్.

"ఎక్కాలి మరి. ఎక్కితేనే కదా లోపలికెళ్తాం లేపోతే బయటే ఉండిపోవల్సి వస్తుంది" ఎడ్వర్డు కటువుగా చూసాడు. "ఎప్పుడు ఏమౌద్దో చెప్పలేం బయట".

"సరే పదండి" అన్నాడు ఇకారస్.

గడ్డ దిగుతూ అప్పుడు చూశాడు నెలవంకనీ, స్పష్టమైన నక్షత్రాల్నీ. గాలి కూడా నెమ్మదిగా వీస్తోంది. దానికిందుగా చీకటి నగరం. అక్కడక్కడా లైట్లు.

దారుశిల్పపు లావుపాటి కాళ్ళ దగ్గరికి ఇద్దరూ చేరారు. ఎడ్వర్డ్ గాలికెగురుతూ అందకుండా పోతున్న తాడు నిచ్చెన కొనని చేత్తో అందుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. ఈలోగా ఇకారస్ దృష్టి తొడ మీదకి మళ్ళింది. తొడ మీద లేతగా వచ్చిన వెంట్రుకల్ని చేత్తో నిమురుతూ.

"ఎంత సహజంగా వుందీ శిల్పం" అనుకున్నాడు మనసులో.

తలపైకెత్తి చూస్తే పిరుదులు కనిపించాయి. రొమ్ములున్న భాగం వైపు అవతలికి చీకట్లోకి వెళ్ళి తలెత్తి చూశాడు. రొమ్ములకి వేపకొమ్మల చివర్లు గాలికి అటూ ఇటూ కదులుతూ రాసుకుంటున్నాయి.

వేపచెట్ల కొమ్మలు అలా తాకే దృశ్యాన్ని అలాగే చూస్తూ నిల్చుండిపోయాడు ఇకారస్.

"రా" ఈలోగా ఎడ్వర్డ్ నుండి పిలుపు విన్పించింది. ఎడ్వర్డ్ అప్పటికే తాడు నిచ్చెన కొనకి ఒక మూల లెతెని కడ్తున్నాడు.

"ఎక్కుతుండగా దీన్ని పట్టుకోలేమా?" ఇకారస్.

"ఎలా పట్టుకుంటావ్ ?" ఎడ్వర్డ్.

"చేతిలో'

"మరి పైకెలా వెళ్తావ్ ఒంటిచేత్తోనా ?"

"ఒంటి చేత్తో ఎలా వెళ్తాంగానీ ఇంకో మార్గం లేదా?" ఇకారస్.

"ఉన్నదొక్కటే మార్గం"

"ఇదొక్కటేనా మార్గం?" ఇకారస్

"అవును యిదొక్కటే. ఎక్కు".

"ముందు మీరెక్కండి". ఇకారస్

"ఏం చేతకాదా" కోపంతో విసుక్కున్నాడు ఎడ్వర్డ్.

"....."

"కుర్రోడివి. చలాకీగా వుండాలి. రాకపోతే నేర్చుకోవాలి. లేకపోతే మధ్య దాకా వెళ్ళి పడిపోతావని భయమా ?"

"కాదు కాదు" ఇకారస్ నవ్వుతూ.

"మరింకేంటి జంకు. పడిపోయినా యిక్కడెవ్వరూ నిన్ను చూసి నవ్వరులే".

"అది కాదండీ. కాలూ చెయ్యీ యిరిగితే యిక్కడెవరూ ఏ వైద్యులూ లేరు మనకి. కుళ్ళి కుళ్ళి చనిపోవాల్సి వస్తుంది" ఇకారస్ సహనం కోల్పోయాడు.

"సరేలే నేనే ఎక్కుతాను ముందు" అంటూ ఎడ్వర్డ్ చేతులకేదో రాసుకుని ముక్కు దగ్గర పెట్టి గట్టిగా పీల్చాడు.

"బావుంది. బావుంది. నువ్వుకూడా రాసుకో ఎక్కేముందు"

"ఏంటది" ఇకారస్.

"చేతులకి పట్టుకోసం. జారిపోకుండా. సెంటువాసనే వస్తుంది"

ఇకారస్ వైపు ఉల్లాసంగా హుషారుగా చూసి తాడు నిచ్చెన ఎక్కడం ప్రారంభించేడు. ఎడ్వర్డ్ పిరుదుల దాకి వెళ్ళి కాసేపు ఆగాడక్కడ, కుడి కాలుని కుడి పిర్ర మీద ఆన్చి.

కేకేసి ఎడ్వర్డ్‌ని అడగాలనిపించింది. పెళ్ళయిందా మీకు ? ఎంతమంది పిల్లలు? కానీ అడిగితే బావుండదనిపించి ఎడ్వర్డ్‌ని చూస్తో నిల్చున్నాడు ఇకారస్.

ఎడ్వర్డ్ పిరుదుల దగ్గర్నుంచి పైకెక్కడం ప్రారంభించేడు. నడుముపైన వున్నాడిప్పుడు. అప్పుడప్పుడూ గాలి కూడా ఉధృతంగా వీస్తోంది.

గాలి ఉధృతంగా వీచినప్పుడల్లా తాడు నిచ్చెన ఎడ్వర్డ్‌తో సహా గాలిలోకి లేచేది. ఎడ్వర్డ్ గాలి తగ్గేంతవరకూ ఆగి మళ్ళీ ఎక్కడం ప్రారంభించేవాడు. వీపు దగ్గరికి చేరుకోగానే ఆగి ఒక చేత్తో తాడుని గట్టిగా పట్టుకుని ఇంకొక చేత్తో వీపుపైనున్న ఒక రెక్కని తెరిచాడు. కిటికీ సైజులో వున్న రెక్క. అందులో ఒక చల్లటి వాటర్ బాటిల్ తీసుకుని గటగటా నీళ్ళు తాగి అందులో పెట్టేశాడు.

పై నుంచి ఇకారస్ వైపు తలతిప్పి కేకేసాడు ఎడ్వర్డ్. "ఇక్కడ నీళ్ళుంటాయి తాగు అలసిపోతే. రెక్క తెరిచే వుంచుతాను. నువ్వు గుర్తుపట్టడానికి".

"అలాగే" ఇకారస్ కింద నుంచి.

"తాగేసిన తర్వాత మళ్ళీ రెక్క మూసేయ్"

"ఆఁ ఆఁ"

"కొన్ని ద్రాక్షపళ్లు కూడా వున్నాయ్. తినాలన్పిస్తే తిను" అంటూ అక్కడ్నుంచి పైకెక్కాడు ఎడ్వర్డ్.

తల పైకెత్తి కింద నుంచి బదులిచ్చాడు ఇకారస్.

తాడు నిచ్చెన కొన అందకుండా పోగలదని జాగ్రత్తగా దాన్ని పట్టుకుని వున్నాడు. ఒక మూలకి లెతె వేలాడుతోంది. 'ఇదెలా పైకొస్తుంది. బహుశా నేను ఎక్కేసిన తర్వాత ఈ తాడు నిచ్చెనని పైకి లాగుతాడేమో. అంటే ఇంట్లోకి దిగాలంటే దీని ఆధారంగానే దిగాలేమో. అనుమానం ఎందుకు నిజమే అది'.

'మనిషి మంచోడే పాపం. ముందు కఠినంగా కనిపిస్తాడు గానీ తర్వాత రెండు మూడు గంటలకే తనంటే ఏంటో తెలుస్తాడు. ఎదుట వ్యక్తికి' పైకి చూస్తూ ఎడ్వర్డ్ గురించి ఇలా ఏవేవో అనుకుంటూ నిల్చున్నాడు ఇకారస్. దాదాపు మెడకి సమీపంలో వున్నాడు ఎడ్వర్డ్.

ఇకారస్ అలా పైకి చూస్తుండగా ఎడ్వర్డ్ జేబులోంచి ఏదో పుస్తకం పై నుండి పడిపోవడం ప్రారంభించింది.

సరిగ్గా ఇకారస్ నిల్చున్న వైపే అది పడుతోంది.

అంతెత్తు నుంచి అది తెరుచుకుని పిరుదులకి తగిలి ఇకారస్‌కి ఐదారడుగుల దూరంలో పడింది. యిసుకలో. అప్పుడు ఎడ్వర్డ్ గొంతు వినిపించింది పై నుంచి.

"వచ్చేటప్పుడు ఆ పుస్తకం పట్రా మర్చిపోకు విన్పిస్తోందా ?"

'అలాగే తెస్తాను' అని అరిచి పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని చూశాడు

'ది సిక్ పీపుల్ ఫ్రం ఆదర్ ఆఫ్ జెయింట్స్, మోన్‌స్టర్స్'.

"ఏమన్నా చిరిగిపోయిందా?."

పై నుంచి మళ్ళీ కేక వినిపించేసరికి తలపైకెత్తి చూశాడు. ఈసారతను మెడలోంచి చూస్తున్నాడు.

"లేదు" ఇకారస్.

"యిక నువ్వొచ్చేసెయ్ పైకి. పైకి వచ్చేటప్పుడు లెతె కట్టిన తాడు సరిగ్గా వుందో లేదో చూడు. లూజ్ అయితే బిగించు".

"బిగిస్తా" కింద నుంచి ఇకారస్ సమాధానం.

పుస్తకాన్ని బొడ్డులోకి దోపి తాడు నిచ్చెన పట్టుకుని దారుశిల్పాన్ని ఎక్కడం ప్రారంభించాడు ఇకారస్. పై నుంచి మెడలోంచి ఎడ్వర్డ్ చూస్తున్నాడు జాగ్రత్తగా. అప్పుడప్పుడూ సూచనలిస్తూ.

"చెప్పులొదిలేసేయ్ చెప్పుల్తో ఎక్కకూడదు" ఎడ్వర్డ్.

చెప్పులు కిందికి జారవిడిచేడు ఇకారస్.

"ఈజీగానే వుందా తాడుని గట్టిగా పట్టుకో. సెంటు రాసుకున్నావా చేతులకి?"

"ఆc రాసుకున్నాను" ఇకారస్.

"భయాలు మనసులో పెట్టుకోకు. పాజిటివ్‌గానే ఆలోచించు. ఎప్పుడూ ఎక్కగలననే అనుకో.నెగిటివ్ ఆలోచన్లని వదిలేయ్; లేకపోతే కిందనే వుండిపోతావు సుమీ" ఎడ్వర్డ్ పై నుండి సూచనలిస్తున్నాడు.

అప్పుడప్పుడూ ఉన్నట్లుండి గట్టిగా వీస్తోన్న గాలికి ఇకారస్ జుత్తు ఎగురుతోంది.

తనింకా పిరుదుల కిందనే వున్నాడు వేలాడుతూ.

పది నిముషాలు గడిచేసరికి పిరుదుల దగ్గరకొచ్చాడు. పిర్రలు నున్నగా నిగనిగలాడు తున్నాయి. ఒక్కోసారి పాలరాయితో చేసినట్టుగా. మరోసారి నిజమైనవే అన్నట్టుగా కనబడుతున్నాయి ఇకారస్ కళ్ళకి. అందుకే అక్కడే ఆగిపోయాడు. చూస్తుండగా పిరుదులు బాగా మరిగిన పాలరంగులోకి మారిపోయి మెత్తగా కదుల్తున్నట్లుగా కనిపించగానే ఇకారస్ దాని మీద చెయ్యి ఆన్చబోయాడు. ఆన్చగానే అవి పాలరాతిలోకో, దారుశిల్పంలోకో మారిపోయి యథాస్థితికి వచ్చేసాయి. 'ఈసారి మాత్రం అవి నన్ను మోసం చెయ్యవు' అనుకుని ప్రాణంతో వున్న పిరుదుపై తన పాదాన్ని గట్టిగా ఆన్చబోయి గభాలున జారిపోయాడు. తను కాలు పెట్టిన చోట గ్రీజ్ వుందని అప్పుడు తెలుసుకున్నాడు.

మళ్ళీ ఎలాగోలా ప్రయత్నించి మళ్ళీ తాడు నిచ్చెనపై సరిగ్గా నిలబడ్డాడు. పిరుదుల్ని దాటుకుంటూ పైకెళ్ళడం ప్రారంభించేడు.

పైకి వెళ్తున్నాడేగానీ మనసు ఇంత క్రితం జరిగిన చిత్రవిచిత్ర సంఘటన గురించే ఆలోచిస్తూంది. పిరుదులొక ఎనిగ్మాగా మిగిలిపోవు కదా? రొమ్ములు కూడా తననిట్లాగే మోసం చేస్తాయా ? ఇదంతా ఎనిగ్మాటిక్ శిల్పంలా వుంది.

తనకేమీ అన్పించలేదా చాలా సాదాసీదాగా ఎక్కేసాడు. ఎటువంటి భావాలకీ లోను కాకుండా. ఇకారస్ నడుం దగ్గర వుండగా ఎడ్వర్డ్ నుండి కేక వినిపించింది.

"పుస్తకం జాగ్రత్త ఒకసారి చూసుకో వుందో లేదో ?"

పుస్తకం గురించి పదే పదే ఎడ్వర్డ్ అడగడం చిరాకేస్తున్నా ఓర్మితో సమాధానం చెప్తున్నాడు ఇకారస్. "తెస్తున్నాను గానీ, ఇక్కడేమన్నా అర వుందా? దాహమేస్తోంది'

"అక్కడేమీ వుండవు. ఇంకా పైకిరా. ద్రాక్షపళ్ళు కూడా వుంటాయి"

"అదేనా దిక్కు చివరికి. యింకేమీ లేవా యిక్కడ?"

"అదొక్కటే దిక్కు"

"బాగా అలసిపోయాను నేను" ఇకారస్.

"అక్కడ కొంచెం సేపు వుండొచ్చులే. గాలి చల్లగా వీస్తుందక్కడ" ఎడ్వర్డ్.

ద్రాక్ష పళ్ళైనా దొరుకుతాయనే ఆశతో ఇకారస్ శక్తినంతా మళ్ళీ కూడదీసుకుని తొందరగానే ద్రాక్షపళ్ళ అర దగ్గరికి చేరుకున్నాడు. నున్నటి వీపుని చూస్తో మెల్లమెల్లగా తినడం మొదలుపెట్టాడు. చాలా దాహంతో.

"ఈ వీపేమీ రాయి కాదు కదా ! లేకపోతే నా కళ్ళే రాయి కళ్ళా. దారుణం కదా దారుణం. ప్రాణం రాయిగా మారిపోవడం. రాళ్ళు కూడా మోసగిస్తాయి చివరికి. లేదంటే చాకుతో ఈ వీపుని కోస్తే".

"పైకి రా యింకెంత సేపు రెస్ట్ తీసుకుంటావు - ఆ రెక్క మూసేసిరా"

ఎడ్వర్డ్ పిలవడంతో తన ఆలోచన్లోంచి బయటపడి మెడదగ్గరికి చేరుకున్నాడు.

"కాసేపు కూర్చుందామిక్కడ. ఎందుకంటే యిప్పుడే కదా వచ్చావు పైకి. గాలి కూడా మంచిగేస్తోంది" అంటూ ఎడ్వర్డ్ మెడ అంచు మీద లోపలికి కాళ్ళు పెట్టి కూర్చున్నాడు. ఇకారస్ కూర్చొంటూ దారుశిల్పం లోపలికి చూశాడు. లోపలంతా చీకటి. ఎంత లోతుకు దిగాలో' అనుకుంటూ.

"ఇంట్లో కెళ్ళడమెట్లా" ఎడ్వర్డ్‌ని ప్రశ్నించాడు.

"ఆ తాడునిచ్చెనే లోపలికేసుకుని దిగాలి. మరింత లోపలికేం కాదు. ఒక పది అడుగులు"

"అంటే దూకేయచ్చు ఇక్కడ్నుంచి" ఇకారస్.

"అట్లా దూకొద్దు. కాలు మెలికపడిందంటే వాస్తాది. నాకొకసారి అలాగే జరిగింది"

"అన్నట్టు పుస్తకం"

బెల్టు కిందకి చెయ్యిపెట్టి తీసాడు ఇకారస్. చెమటతో అట్ట తడిసిపోయి వుంది. కొన్ని కాగితాల అంచులు కూడా తడిసిపోయాయి.పుస్తకాన్ని తొడ మీద ప్యాంటుకి తుడిచి ఎడ్వర్ట్‌కిచ్చాడు.

ఎడ్వర్ట్ దాన్ని తీసుకుని దారుశిల్పంలోకి ఒక మూలకి విసిరేశాడు. పరుపు మీదికి విసురుతున్నట్టుగా. ఆ తర్వాత ఒక కాలు అంచుపై నుంచి మెడ యివతలకి తాడు నిచ్చెనని జాగ్రత్తగా పైకిలాడగం ప్రారంభించేడు. పైకి లాగిన తాడు నిచ్చెననంతా లోపలి కేస్తూ "జాగ్రత్తగా లాగాలి లేకపోతే దేనికో తగిలి చిరిగిపోవడమో, కిందికి పడిపోవడమో జరుగుద్ది'. ఇకారస్ వంక చూస్తూ అన్నాడు. సుమారొక ఐదు నిముషాలు లాగిన తర్వాత 'లెతె'తో సహా ఇద్దరూ లోపలికి దిగారు.

9

ఎడ్వర్డ్ లైట్లు వేసాడు.

ఫ్లోరంతా చెక్కలతో తయారుచేసి వుంది.

"కూర్చో" అంటూ ఇకారస్‌ని పరుపుకేసి చూపించాడు.

సూర్యకాంతం పువ్వుల బెడ్‌షీట్ పరిచి వున్న మెత్తని పరుపు మీద కూర్చున్నాడు ఇకారస్. ఒక నీలం తలగడ. తలగడ మీద దారుశిల్పం ఎక్కుతుండగా పడిపోయిన పుస్తకం. రెండు చేతులూ వెనక్కి ఆన్చి గదంతా చూస్తున్నాడు ఇకారస్.

ఒక రొమ్ము లోపల ఒక కుర్చీ టేబిల్ వేసి వున్నాయి.

రెండో రొమ్ము చీకటిగా వుండి లోపలేదో పాములాగా చుట్టుకుని వుంది.

అది పామే అనుకొని అప్రమత్తమై ఇకారస్ చూస్తుండగా గమనించి "భయపడకు అది పాము కాదులే" అంటూ ఎడ్వర్డ్ రొమ్ములోపల బల్బ్ ఆన్ చేశాడు.అప్పుడు ఇకారస్‌కి స్పష్టంగా కనిపించింది. తాచుపామంత లావుతో ఒక నైలాన్ తాడుచుట్టి వుంది. దాని కింద ఒక తెల్ల కాగితం.

ఐదడుగుల ఎత్తులో వున్న ఆ రొమ్ములోపలికి వెళ్ళి ఎడ్వర్డ్ ఆ తాడుని పైకి తీసి మళ్ళీ దాన్ని చుట్టి కాగితంతో సహా ఆ రొమ్ము లోపల ఒక మూలకి విసిరేసాడు. చెక్క ఫ్లోరు మీద కాలుపెట్టి కూర్చొని "ఇది నా చిట్టచివరి సంకేత స్థలం కానీ ఆ సంకేతాన్ని అందుకుంటానన్న గ్యారంటీ లేదు" అన్నాడు ఇకారస్‌తో.

"సరే, నేనేదో మాట్లాడతాను గానీ, ఇప్పుడేం చేద్దాం?".

లెతె వంక చూశాడు చిన్నగా నవ్వుతూ ఇకారస్.

"లెతెని తాగాలనుందా? సరే. నీ ఇష్టం. తాగడమే కదా చెయ్యాల్సింది. అంత కన్నా ఏం చేస్తాం? ఈ మృతనగరంలో""

"మనమెప్పటికీ బందీలమై పోతామా యిక్కడ?" భయం ముఖం పెట్టాడు ఇకారస్.

"దిగులు మంచిది కాదు. మనమేమీ యిక్కడ శాశ్వతం కాదు. మనమూ చచ్చిపోతాము. ఒకవేళ ఈ మృత మహానగరంలో చావాల్సిన చివరి వాళ్ళం మనమిద్దరమే అయితే మనం చనిపోయిన తర్వాత ఈ ఖాళీ నగరమే వుంటుంది. శాశ్వతంగా భూమితో పాటు తిరుగుతూ ఇదే గాలి దుమ్మునీ ధూళినీ రోడ్ల మీద లేపుతూ చెల్లాచెదురు చేస్తూ వుంటుంది. ఈ కార్లనీ, బస్సుల్నీ, ఇళ్ళ మెట్లనీ దుమ్ముతో కప్పెదుతుంటుంది. అవే చెట్లు తమలో తాము భయంకర ఆనందంతో గాలిని కౌగిలించుకుంటూ చప్పుడు చేస్తూనే వుంటాయి. అవే నిటారు భవంతులు నక్షత్రాల్తో మౌనంగా సంభాషిస్తూనే వుంటాయి.. అవే వెన్నెల రాత్రులు అవే మిరుమిట్లుగొలిపే పగళ్ళు భయంకరమైన ఒంటరి పగళ్ళు"

"ఇలాగా ఎంతకాలముంటుందీ నగరం?"

"ఎంతకాలమంటే మనమేం చెప్పగలం ? రుతువుల్లో పెనుమార్పులు రావొచ్చు. వంద సంవత్సరాలు నిరాఘాటంగా మంచుకురిస్తే ఏమౌతుంది? మొత్తం ఈ నగరమంతా మంచులో కూరుకుపోతుంది. అంటార్కిటికాలా అంతా గడ్డగట్టిపోతుంది. మంచు ఖండం కింద నగరం".

కుర్చీల్ని సర్దేందుకు లేచాడు ఎడ్వర్డ్.

"ఈ జగత్తు చేతుల్లో మనం బలహీనులం" ఇకారస్.

"అవును కరక్టు చెప్పావు. మనం బలహీన అతిథులం" ఎడ్వర్డ్ లెతెని ఎడమ రొమ్ములో వున్న టేబిల్ మీద పెట్టాడు. వరసగా పక్క పక్కనే వున్న రెండు కిటికీల్ని తెరిచాడు. టేబిల్‌కి రెండువైపులా చెరో కుర్చీవేసి ఇద్దరూ కూర్చున్నారు. కిటికీలోంచి చల్లని రాత్రిగాలి రొమ్ములోకి ప్రవేశించి ఇద్దరి జుత్తునీ తాకుతోంది. కిటికీ బయటంతా నక్షత్రాల కింద నగరం పరుచుకుని వుంది. అప్పుడప్పుడూ వేపకొమ్మలు చప్పుడు చేస్తూ కిటికీలోంచి తొంగి చూస్తున్నాయి. గొప్ప ఏకాంత సమయం.

టేబిల్ మీద చేపముక్కలూ, లెతె, రెండు బంగారపు గ్లాసులూ ,ఎడ్వర్డ్ మ్యూజియం కెళ్ళి తెచ్చాడు వాట్ని. చాలా ప్రాచీనమైనవి. ఆ గ్లాసులంటే చాలా యిష్టం ఎడ్వర్డ్‌కి. నీళ్ళు తాగడానికీ, మద్యం తాగడానికీ అలాంటి గ్లాసులే వుపయోగిస్తాడు.

వాళ్ళిద్దరూ యిప్పుడు సుమారు అరవై అడుగుల ఎత్తున వున్నారు.

రాత్రి పదకొండు కావొస్తోంది.

అప్పుడు ప్రారంభమయ్యింది వాళ్ళ రోజు.

నిజానికి వాళ్ళు రాత్రుల్లూ పగల్లూ తారుమారైపోయాయి.

తాము ఏ కాలంలో వున్నామో వాళ్ళకి తెలీదు.

ఇలా ఎన్నిరోజులు గడుస్తుంది.

ఈ ఆగంతక నగరంలో ఎంతకాలం గడపాల్సి వుంటుందీ వాళ్ళకేమీ ఖచ్చితమైన ఆధారాలు లేవు.

ఒక వ్యూహం లేదు!

ఒక భవిష్యత్ ప్రణాళిక లేదు!

10

ఏదో మెడను కోస్తున్నట్లుగా లెతె సీసామూతని కోసి వోపెన్ చేశాడు ఎడ్వర్డ్.

లెతెని వంచి రెండుగ్లాసులూ నింపాడు.

చిక్కగా నల్లగా వుంది.

ఇకారస్ దాన్ని చూస్తూ "కొండచిలువ రక్తంలా వుంది" అన్నాడు.

ఎడ్వర్డ్ నవ్వుతూ అన్నాడు.

"కొండచిలువ రక్తంలా వుందా. అదిప్పుడు చుట్టేస్తుంది చూడు నిన్ను"

రెండు గ్లాసులూ పైకెత్తి ఒకదానికొకటి తాకించి "Absalom" అన్నారు ఇద్దరూ ఒకసారి.

ఇకారస్ దాహంతో వున్నాడేమో ఒకేసారి పైకెత్తి తాగేసి చేప ముక్కని నోట్లో వేసుకుని మెత్తగా రుచిగా నమిలాడు.

"చాలా బావుంది. ఇంతకు ముందెపుడూ ఇలాంటిది తాగలేదు".

"నింపాదిగా తాగు సంతోషంగా. యింకా వుంది" అంటూ ఐదువందల రూపాయల నోటు ఇకారస్‌కి ఇచ్చాడు, మూతి తుడుచుకొమ్మంటూ.

ఎడ్వర్డ్ ఒక కట్టని టేబిల్ మీద వుంచాడు. చేతులు తుడుచుకోడానికని.

ఎడ్వర్డ్‌కి డబ్బు పట్ల వుండే ద్వేషం ఒక సరాదాగా మారిపోయింది.

అలా చెయ్యడంలో ఎడ్వర్డ్ ఎంజాయ్ చేస్తుండడం ఇకారస్ గమనించాడు.

ఎడ్వర్డ్ ఎప్పుడూ రెండు మూడు ప్యాకెట్లు జేబులో వుంచుకుంటాడు. ఒకసారేం చేశాడంటే బ్యాంకులోంచి బస్తానిండా డబ్బులు కుక్కి పక్కనే వున్న పబ్లిక్ లేవటరీ ఎదురు గుండా డివైడర్ మీద కూర్చున్నాడు. బస్తాలో ఒక్కొక్క కట్టా ఆ లేవటరీలోకి విసురుతూ లేవటరీని నింపాలని అతని వుద్దేశ్యం. అతను అలాగే చేశాడు ఒకసారి. నడుస్తూ నడుస్తూ ఏమైందోఏమో ఉన్నట్టుండి గోడకేసి కొట్టాడు కట్టని విసురుగా. చెవులనీ, తలనీ, మీద రాసుకుంటూ పోయే విధంగా రాయిని విసిరినట్టు. అలా గిరాటేసిన తర్వాత ఒక్కసారిగా బిగ్గరగా నవ్వుతాడు. భలే నవ్వుతాడు.

ఒకసారి బస్సు నిండా నింపి పెట్రోలు పోసి తగలబెట్టాలనుంది? అంటుంటాడు.

ఖాళీ చేసిన బంగారపు గ్లాసులోకి లెతెని ఒంపుతూ అడిగాడు ఎడ్వర్డ్.

"ఆc ఇప్పుడు చెప్పు. ఓడరేవులోంచి ఎప్పుడు వచ్చావు?"

"ఏమో నేను చెప్పలేను".

"ఓడరేవులో వుండేవాడివి కదా?"

ఇకారస్ ఏమీ పట్టనట్టుగా మౌనంగా కూర్చున్నాడు.నుదిటి మీద జుత్తు గాలి కెగురుతుంది. లెతెని కొంచెం తాగి టేబిల్ మీద పెట్టాడు, చప్పుడు చేస్తూ.

ఇకారస్ కొన్ని విషయాల పట్ల ఎందుకు మౌనం వహిస్తున్నాడో తెలుసుకోవాలనే ఆతృతతో చూస్తున్నాడు ఎడ్వర్డ్.

రెండో రౌండు పూర్తయ్యేసరికి ఇకారస్‌కి నిషా ఎక్కడం మొదలయ్యింది. మనసంతా తేలికగా చేతులవేళ్ళన్నీ బరువుగా ఇనుము మాదిరి అయిపోతున్నాయి. ఇకారస్‌కి తెలుస్తూనే వుంది. 'చేతివేళ్ళు ఒకటేనా కాలివేళ్ళు కూడా బరువుగా అయిపోయాయా' అన్న అనుమానంతో కాలివేళ్ళని కదిలించి చూశాడు. అవి కూడా బరువైపోయాయి ప్రాణం లేనట్టుగా.

"ఓడరేవులంటే ఏమీ మాట్లాడవేంటీ?" రెట్టించాడు ఎడ్వర్డ్.

"ఓడరేవులంటే చిరాకేస్తుంది ఇపుడు చంపేస్తాను ఓడరేవుల్ని" వున్నట్టుండి కోపంగా ఆవేశంతో మాట్లాడాడు ఇకారస్.

"చంపేస్తావా ఓడరేవుల్ని?" ఎప్పుడూ ఎక్కడా ఎవరినోటా వినని మాటలు ఎడ్వర్డ్‌కి ఆశ్చర్యమేసి మళ్ళీ అడిగాడు.

"అవును చంపేస్తాను"

నడి సముద్రపు కదిలికలాంటి ఉద్వేగంతో మళ్ళీ అతనే

"వాటి కోసం సర్వస్వాన్నీ ఒదులుకుని ఊరునీ నాన్ననీ తల్లినీ అందర్నీ వదులుకుని వచ్చాను. పూర్తి విశ్వాసంతో దుమ్ములో ధూళిలో దాని కాళ్ళ వద్ద పనిచేశాను. అనేక రాత్రులు ఆకలిరాత్రులు. అవి నన్ను మోసం చేశాయి. నన్నో భ్రాంతున్ని చేసాయి. నాకొద్దీ ఓడరేవులు, ఎవరూ వద్దు".

ఇకారస్ లీలగా అర్థమయ్యాడు ఎడ్వర్డుకి.

"ఇంటి నుండి పారిపోయి వచ్చేసావా?"

'ఇంటి నుండా ? ఇప్పుడిల్లెక్కడుంది? పారిపోడానికి"

"అంతా శూన్యం అంతా శూన్యం ఎవరూ లేరు"?

మత్తులో తిరస్కారభావంతో చేతుల్ని విదిలించుకుంటున్నాడు ఇకారస్.

"ఇంటికి ఫోన్ చేశావా?" నవ్వుతూ ఎడ్వర్డ్.

"ఫోను చేసినా ఇప్పుడెవరున్నారని ముసలి అమ్మా చనిపోయుంటుంది. చెల్లెళ్ళిద్దరూ, తమ్ముడు చనిపోయి వుంటారు. పదేళ్ళ వయసులో వుండగా వాళ్ళని చూడ్డం అంతే. అప్పుడ్నుంచీ అక్కడ లేను లేను. ఏదో జరిగింది నాకు"

ఇకారస్ లెతె తాగడం ఇదే తొలిసారి కావటం మూలాన మత్తులో విచిత్రంగా పొంతన లేకుండా మాట్లాడుతున్నాడు. ఎడ్వర్డ్ మాత్రం నింపాదిగా కొద్దికొద్దిగా తాగుతూ ఇకారస్‌ని చూస్తున్నాడు.

మళ్ళీ ఇకారస్సే నన్నొంటర్ని చేసి వెళ్ళిపోయాయి ఓడలు. అవి మళ్ళీ నా కోసం రావు. అవి వచ్చినా అప్పటికి వయస్సయిపోయి వృద్ధున్నై వుంటాను. ఓడలు! చూశారా ప్రాచీన ఓడలు. ఇప్పుడు చూస్తున్నాను వాట్ని. అందులో నేను కూర్చుని వున్నాను. ఓడ అంచులో చేతులకి గెడ్డం ఆన్చి చూస్తున్నాను. చాలా ఆనందంగా

వున్నాను ఆ ఓడ మీద. సూర్యకాంతిలో ఎంతో ఆరోగ్యంతో హాయిగా వుంది నా ముఖం ఆ ప్రాచీన సముద్రంలో అలాగే వూగుతూ ఎక్కడికో ఏ పనులకో. ఆకుపచ్చ తెరచాపలు అంటుకున్నాయి. ఆ మంటల్లో తోసెయ్యాలి ఓడరేవుల్ని అంతా దగ్ధమైపోవాలి. మంటలు మంటలు"

"ఎందుకింత ద్వేషం. ఇక్కడ ఎవరికి ఎవరూ పూచీలేరు" ఎడ్వర్డ్.

"అవును యిక్కడ ఎవరికి ఎవరూ పూచీలేరు. అవి నన్నెక్కడికైనా తీసుకెళ్తాయనే అనుకున్నాను".

"జీవితాన్ని వృధా చేశాను. మొద్దుబారిపోయాను".

11

ఎప్పటిలాగే తెల్లారింది. తానే దీపమై ఈ నిర్జీవ నగరాన్ని చూస్తూ నిల్చున్నాడు సూర్యుడు. 'ఈ లోకం వెలుగుతూ ఆరిపోతూంటుంది రోజూ. ఎప్పుడూ ఇలాగే జరుగు తుంది. ఎన్ని సంవత్సరాలో ఎన్ని రోజులో ఎవరూ లెక్కపెట్టలేరు. సముద్రపు ఒడ్డులో ఎన్ని ఇసుకరేణువులు. ఎన్ని నీటి చుక్కలైతే సముద్రం! అడవిచెట్టు ఎన్ని ఆకుల్ని రాల్చింది, ఎన్ని చిగిర్చింది ? మనుషులూ అంతే. ఎప్పటివాళ్ళో? కాలం తెలియదు. ఈ మహా బలాన్ని అంచనా వేయలేం. ఎన్ని ప్రేమలు ఎన్ని కోర్కెలు? ఎన్ని అసంతృప్తి మరణాలు? అయ్యో ఇదొక మహా కూడలి. మహా సంగమం. తెలిసో తెలియకో అందరూ, అన్నీ యిక్కడికే వస్తాయి'.

'సంబరమంతా యిక్కడే'.

యిదొక మహిమాతలం.

అంతులేని ఆనందాన్నిస్తుంది.

కఠినమైన శిక్షలు వేస్తుంది.

భయపెడ్తుంది.

దూరంగా వుంచుతుంది.

ఎక్కడికైనా 'యెలబారిపొమ్మని' శపిస్తుంది.

అలిగినా ఏడ్చినా, కన్నీళ్ళతో మనస్సుని కాల్చుకున్నా ఆగ్రహం చల్లారదు దీని చేతులకి.

తనకిక మొహాన్ని చూపించొద్దని కసురుకుంటుంది.

నీ ముఖం చూడ్డం యిష్టంలేదని అసహ్యించుకుంటుంది.

అందుకే వీధులన్నీ ఖాళీగా మిగిలిపోయాయి ఎప్పటికీ.

వేల సంవత్సరాలుగా అలాగే వుంటాయి వర్షంలో, పెనుగాలిలో, ఎండలో కఠిన చలిలో.

12

ఇకారస్ అయిష్టంగానే వీడ్కోలు తీసుకుని బయలుదేరాడు. తన దారుశిల్పంలోకి అడుగుపెడ్తూనే ఏదో భయం ఆవహించింది. తను బలహీనుడ్నయిపోతున్నానీ తనకేదో జబ్బు చేసిందనీ. ఏమైపోతుంది తనకి? ఏం జరుగుతోంది యిక్కడ?

వచ్చి అలాగే పడుకున్నాడు.

తినాలనిపించలేదు.

'ఎసీలియం' ని కొద్దిగా తీసుకుని నిద్రలోకి జారుకున్నాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా ఎండ తీవ్రమయ్యింది.

నల్లని ఇనుపరోడ్డూ, తెల్లగా మెరుస్తోన్న భవనాలు చాలా స్పష్టంగా కనబడుతున్నాయి.

ఎప్పుడూ చప్పుడు చేస్తుండే రావిచెట్టు ఉక్కపోతగా ఉడికిపోతూ నిల్చుంది నిశ్శబ్దంగా.

కుర్చీ పక్కన కిందే పడుకున్నాడు ఇకారస్.

తలగడ లేదు. దుప్పటి లేదు. మంచినీళ్ళ కూజా కూడా లేదు ఆ శిల్పంలో.

అలాగే చతికిలబడి వెల్లకిలా రెండుచేతులూ తల వెనక్కి అలా పడేసి పడుకున్నాడు.

సన్నగా గురక కూడా మొదలయ్యింది – వయస్సు పైబడింది కదా.

వెల్లకిలా పడుకుని చూస్తే మెడలోంచి ఆకాశం, మబ్బులూ స్పష్టంగా కదులుతూ కన్పిస్తాయి.

ఎక్కడిదో ఎండిన ఆకొకటి మెడలోంచి వచ్చి పడింది ఇకారస్ గుండె జేబు మీద.

అప్పటికే కలలో వున్నాడు ఇకారస్.

భయంకరమైన కల.

తన ముప్పయ్ ఏళ్ళలో ఇలాంటి కల ఎప్పుడు రాలేదు.

భయంకరమైనది.

కల అంతా చీకట్లోనే కలకలం. తన ఇంట్లో మంటలు వాసన, అంతా గందరగోళం. అమ్మ మంటల్లో కాలిపోతూ ఇంట్లో హాహాకారాలు చేస్తోంది. ముఖం మాత్రమే తగల బడుతోంది. నల్లగా కాలిపోతుంది. అమ్మ రెండు చేతులు మంటల్లో కాలిపోతున్న ముఖం దగ్గరికి తెచ్చి బాధతో ముఖాన్ని పట్టుకోలేక గగ్గోలు పెడుతోంది.

కానీ, ఆమె కేకలేమీ విన్పించడం లేదు. ఇకారస్ అక్కడే వున్నాడు. అక్కయ్య వచ్చి నీళ్ళు పొయ్యిరా అంటూ అరిచి నీళ్ళ బిందె అందించింది. ఆ నీళ్ళు అమ్మ ముఖం పైన చల్లగానే నీళ్ళన్నీ ముఖంపై పడి ఎండిపోతున్నాయి. తెల్లని బూడిదవర్ణపు ఇనుపముఖం. భయంతో ఆందోళనతో కాలిపోతూన్న అమ్మ ముఖంపైనా శరీరంపైనా నీళ్ళు పోస్తున్నాడు. అంతా ఇనుము కాలుతోన్న వాసన. వేడి.

'నేనెక్కడ తప్పు చేశాను? నేనెటుపోయాను? యింత ఘోరం జరిగింది. నన్నంతా అపరాధిని చేస్తారు నీచుడ్ని' తన్లో తాను అనుకుంటున్నాడు. ముసలి అమ్మని భుజాల మీద వేసుకుని రెండుకాళ్ళని గట్టిగా పట్టుకున్నాడు. పట్టుకుని బయలు దేరాడు. వెంటనే తను పట్టుకున్న కాళ్ళు నాన్న కాళ్ళయిపోయాయి. 'భుజాల మీద వేసుకున్నది అమ్మనా నాన్ననా. నాన్నే అయితే చనిపోయాడు కదా. కానీ ఇదంతా మోసం ఇదంతా జీవితపు కమురువాసన. వేడి సెగ. ఇలా ఎందుకు జరుగుతుంది'?.

కలలోంచి మెలకువ వచ్చి కూర్చున్నాడు. చెవులూ మెడా చెమటలు పట్టేసాయి. అంతా చీకటి. తాను లేవలేననుకున్నాడు. గుండెంతో భయంతో మబ్బులతో బరువెక్కి పోయింది.

13

ఎడ్వర్డ్ గుర్తుకొచ్చాడు.

దారుశిల్పానికి ఆనుకుని వున్న ఇంట్లో స్నానం చేసి రోడ్డు మీద పడ్డాడు.

'తనకెవరూలేరు. తనెవరికి చెందడు' అనే భయం, వాస్తవమూ ఇకారస్ గుండెల లోలోతుల్లోకి పాతుకుపోయింది ఆక్టోపస్ చేతుల్లా.

అందరూ ఎటోవెళ్ళిపోయిన ఈ ఖాళీ నగరంలోంచి తనూ వెళ్ళిపోవాలనుకుంటున్నాడు. కానీ ఎక్కడికని వెళ్ళిపోవాలి?

'ఈ వయసులో ఎక్కడనీ ఎందుకనీ జీవితాన్ని ప్రారంభించాలి'?

ఏ జీవికైనా ఇవి మౌలికమైన విధులూ, సమస్యలూ. కానీ వీటిపట్ల ఎందుకో ఉదాసీనంగా నిర్లిప్తంగా వుంటూ వచ్చాడు ఇకారస్.

'కానీ ఇప్పుడు తప్పనిసరి.'తనలోకంలో' మనుషులంటూ ఎవరూ లేనప్పుడు నా అన్న వాళ్ళెవరూ లేనప్పుడు తనుండీ ఏం లాభం యిక్కడ? వృద్ధాప్యం వరకూ జీవించడమా? వూహించడానికే భయమేస్తోంది. యిష్టం లేని ఈ స్థలంలో, యిష్టం లేని జీవితంలో తనకంటూ ఒక స్త్రీ లేని ప్రపంచంలో తను జీవితాన్ని కొనసాగించడం కష్టం. కనీసం ఆ జీవితాన్ని వూహించడానికైనా అతను సిద్ధంగా లేడు. వాట్ని ఎవాయిడ్ చేసేసాడు. మరెందుకు ఇక్కడ?'

'ఏం చెయ్యాలని?'

'ఒక చీకటి గుహై చనిపోతూ బతకడం?'

'ఒక ఖాళీ దహన రుతువై బతకడం! భరించలేను! పిచ్చివాణ్ణవుతాను!'

ఇకారస్ అలా తన్తో తను అనుకుంటూ రోడ్డు మధ్యలో నడుస్తున్నాడు. ప్యాంటు జేబులో చేతులు పెట్టుకుని.

ధారాళంగా వీస్తోన్న గాలులు అతని నుదురునీ, చొక్కానీ తాకి వెళ్ళిపోతున్నాయి.

అంతటా మంత్ర నిశ్శబ్దం.

ఇకారస్ అలా రోడ్డు మీద రాళ్ళనీ మందు బాటిళ్ళనీ ఖాళీ అట్టపెట్టెలవలె, కాలితో తన్నుకుంటూ సాలోచనగా నడుస్తున్నాడు.

ఈలోగా సగం కొబ్బరి టెంకంత వున్న దాన్నేదో కాలితో తన్నాడు. అదెల్లి ఇకారస్ ముందరే ఇరవై అడుగుల దూరంలో పడింది. కానీ అది కొబ్బరి టెంక కాదని గుర్తించాడు. ఏదో ఇనుము రేకుతో తయారు చేసినట్టుగా కనబడుతోంది.

ఇకారస్ దాని దగ్గరకెళ్ళి చేతుల్లోకి తీసుకుని చూసాడు. అదొక రొమ్ముభాగం. మొదలు నుండి సరిగ్గా కోస్తే ఎలా వుంటుందో అలా వుందది. కానీ దాన్ని ఇనుపరేకుతో కొన్ని ముక్కలు అతికించి రివిట్లు వేసి తయారుచేసారు. ఎండలో వుండడం వలన కాలుతోంది.

'ఎవరు చేసుంటారు దీన్ని?' తనకు తాను ప్రశ్నించుకున్నాడు ఇకారస్.

'ఎవడో పిచ్చోడై వుండాలి. సినిక్ మాత్రమే ఇలా ఆలోచించి తయారుచేసి వుంటాడు. లేకపోతే రొమ్ముని ఇలాగా ఎవరైనా చేస్తారా ? కనీసం ఊహించడానికే దుర్లభం అవుతోంది?'

లోపలి డొల్లలో ఏవో నల్లగా మరకలు కనిపించడతో దాన్ని లోపలికి ముక్కుని పోనిచ్చి వాసన చూసాడు.

కుళ్ళిన రక్తం వాసన. వీడెవడో రాక్షసుడే అయివుంటాడు. హంతకుడు కాదు కదా? కొంతమందికి వర్జిన్ల రక్తం తాగాలనే భయంకరమైన కోరిక వుంటుందని విన్నాడు. రక్తం తాగకపోతే వాళ్ళు బతకరనీ; ఆ కోరిక వాళ్ళని దహింపచేస్తుందనీ, అందుకోసమే వాళ్ళు హంతకులౌతారనీ విన్నాడు.

ఇదైతే అలాంటి రాక్షసుడు తాగిన బొచ్చె కాదు కదా? అనుకుంటూ దాన్ని భయంతో తటాలున అవతలికి విసిరేసాడు ఇకారస్.

'అలాంటి మనిషి ఇక్కడున్నాడంటావా ?' పదిపదిహేను అడుగులు ముందుకు నడిచాడో లేదో ఎందుకో అనుమానం వచ్చి ఇందాక భయంతో కిందపడేసిన ఇనుప వక్షోజపు డొల్లని చేతిలోకి తీసుకుని వేళ్ళని లోపలికి పెట్టి రక్తపు మరకల్ని తడిమి చూసాడు.

ఇంతక్రితమే తాగినట్టుగా చూపుడు వేలుకి అంటుకుంది రక్తం.

ఇకారస్ మనసు వెంటనే ఎడ్వర్డ్ వైపు మళ్ళింది.

ఎడ్వర్డ్ తప్ప ఈ నగరంలో ఇంకెవరూ కనిపించలేదు తనకి. మరోవైపు అతని వాలకం, ముఖం, మాట్లాడేతీరు చూస్తే అలాంటివాడు కాదనిపిస్తోంది.

ఏమైనప్పటికీ మనమెవర్నీ ఖచ్చితంగా అంచనా వేయలేం.

'ఏమో ఎవరి లోపల ఏమేం చీకటి జ్వాలలున్నాయో ఎవరికి తెలుసు'?

'పైకి మంచివాడుగా, అమాయకంగా కనిపించినట్టుగా లోపలి మనస్సు మనం చూడలేం కదా'. ఇకారస్ ఆ ఇనుపరొమ్ముని ఎక్కడ్నుంచి తీసుకున్నాడో అక్కడే అదేదో మాయావస్తువులా పెట్టేసాడు.

ఈ వస్తువు కనిపించగానే అతని మనసంతా భయంతో డిస్టర్బ్ అయిపోయింది.

'అందులో అది ఎవరైనా రక్తం తాగడం నిజమే. కానీ ఎవరైనా ఎందుకు తాగుతారు? జంతువేమీ కాదు కదా ? ఒకవేళ జంతువులే వాట్ని తాగితే ఎవరు పోస్తారు రక్తాన్ని వాటికోసం? పోసేందుకు ఎవరూ లేరు కదా ఇక్కడ? ఆ వక్షోజపు డొల్లలో వున్న మరకలు స్త్రీవే అని ఎందుకనుకోవాలి. వేరే ఇతర జంతువువి అయినా అయివుండాలి. కొమొడో రక్తం అయి వుండొచ్చు. కానీ ఇది కూడా వాస్తవ దూరం.'

ఇకారస్‌కి ఇదంతా గందరగోళంగా, భయంగా వుంది.

తను నడుస్తూ నడుస్తూ అదేదో కొబ్బరి టెంకననుకుని తన్నేయడం తీరా అది చూస్తే ఇనుపరేకుల్తో తయారుచేసిన రొమ్ము భాగమవ్వడం, అందులో రక్తపు మరకలు పచ్చిగా తగలడం. ఇవన్నీ అతని ఆలోచనల్ని అనేక కోణాల్లోకి నడిపిస్తున్నాయి.

'ఒక వేళ ఏ జంతువో కాకుండా, ఏ సినిక్కో కాకుండా, ఏ పిచ్చోడో కాకుండా అసలు ఏ సాధారణ మనిషికైనా ఎందుకు తాగాలన్పిస్తుంది. ముఖ్యంగా వర్జిన్ బ్లడ్‌ని. అందుకేమన్నా మర్మం, శక్తీ వుందా ? అతీతశక్తి. విశ్వాంతరాళాల్లో మొలకెత్తే పచ్చగడ్డి లాంటి శక్తి ఏమైనా వుందా రక్తంలో, ఆ నెత్తురులో. లేకపోతే ఎందుకు తాగుతారు ఎవరైనా? అగామెమ్నన్ ! యుద్ధం కోసం కూతుర్నే బలిచ్చావు. ఆ వెచ్చని రక్తం కళ్ళచూస్తేనే నీ దేవత కోపం శాంతిస్తుందనుకున్నావా ? సిగ్గులేదు నీకు. దేవతలు కూడా చీకటి రక్కసులే. నెత్తుర్లో పిశాచ మోహముంటుందో ఏమో, లేకపోతే వాళ్ళెందుకు తాగుతారు. ఏదో వుంది. మొత్తానికి ఆ నెత్తుర్లో తేనెపూల లాంటి రుచేదో వుంది. వెయ్యి బావుల దాహం ఒక్కసారి తీరుస్తుందేమో? అది తీర్చుకోవడం కోసం వాళ్ళు హత్యలు చేస్తుంటారు ? ఆ అమాయకపు అతిసున్నితమైన స్వచ్ఛమైన పాల మెడల్ని వాళ్ళు కడు మూర్ఖంగా పళ్ళు బిగించి కసిగా తాడుతో బిగించి చంపివుంటారు. చంపకపోతే వాళ్ళకి రక్తమెలా దొరుకుతుంది. బతికుంటే ఆమె ఆనందంగా, ప్రేమతో సంతోషంగా ఇవ్వదు కదా ! అసలు ఆమెంటే నెత్తురేనా ? బహుశా ఆమెలో నెత్తుర్నే వాళ్ళు చూస్తారేమో ? వక్షోజాలూ, నడుమూ, పెదవులూ, నీలాకాశం లాంటి కళ్ళూ, దేవతల గాలికి ఎగిరే శిరోజాలూ, వీపూ, తొడలూ, స్వర్గపు సంగీతాన్ని విన్పించే పాదాలూ, బద్దలుచేసే శరీరపు ఛాయా, మమకారం ఇవేమీ వాళ్ళకి కన్పించవేమో? వాళ్ళకి కావల్సింది రక్తమొకటేనా ? చిక్కని నెత్తురు టానిక్ లాంటి నెత్తురు, బెల్లం లాంటి నెత్తురు, మల్లెపూలు నూరితే కారే ద్రవం లాంటి నెత్తురు, వెయ్యి సంవత్సరాల ఒకే ఒక్క జన్మ దాహాన్ని తీర్చే నెత్తురులాగే వాళ్ళకి కనిపిస్తుందేమో. కానీ నెత్తురు

పీల్చుతున్నప్పుడు వాళ్ళకి భయమెయ్యదేమో. పాపమని అనిపించదూ? ఇలాంటి పాపపు పనికి ఎందుకు ఒడిగడుతున్నామనీ, ఇలాంటి అనాగరిక ఆలోచనలు ఎందుకు వస్తున్నాయనీ వాళ్ళు ఆలోచించరు కదూ ?'

ఇకారస్ అనేకానేక ప్రశ్నల్ని తనకి తాను వేసుకుంటూ ఎడ్వర్డ్ వుంటోన్న వీధి వైపు నడుస్తున్నాడు.

యాదృచ్ఛికంగా తనీవాళ చదరంగపు డిజైను వున్న షర్టూ ప్యాంటూ వేసుకున్నాడు. వాట్ని మనమెంత దూరంలోంచైనా ఇట్టే గుర్తుపట్టవచ్చు.

కావల్సింది సూక్ష్మదృష్టి మాత్రమే !

14

ఇకారస్సేమీ హేపీగా లేడు.

ఇవాళే కాదు. ఎప్పుడూ.

అది అతనికి తెలుస్తూనే వుంది. ఈ నగరంలోకి రాకమునుపు నుంచీ మంచిగా లేదు. ఏవేవో ప్రశ్నలు. వాటికి జవాబులుండవు.

స్కూళ్లూ, కాలేజీలు. ఇవేమీ వాటికి జవాబులు చెప్పవు.

తన గత జీవితాన్ని గురించిన జ్ఞాపకాల్ని, సంఘటనల్నీ ఇకారస్ గుర్తు చేసుకుంటున్నాడు.

ఒకడెందుకు హంతకుడౌతాడో, ఒకడెందుకు హతుడౌతాడో ఎవరూ చెప్పరు. విడమర్చి చెప్పరు కదా ! తన బాల్యంలో కౌమారంలో ఎన్నెన్నో వికృత జీవుల్ని మహా భయంకరుల్నీ చూశాడు. అప్పటికీ ఇప్పటికీ తన దగ్గర ఏ సమాధానమూ లేదు.

సమాధానాలు దొరక్కపోతే ఏమౌతుంది వయస్సు పెరిగే కొద్దీ? ఇప్పుడదే జరుగు తోంది. అసంతృప్తి. ఎందుకెళ్ళిపోవాలనుకుంటారు ఇక్కడ్నుంచి? చచ్చి పోవాలనుకున్నా ఎందుకు బతకాలనిపిస్తుంది? ఏది ఆపుతోంది? ఎవరు ఆపుతున్నారు? 'దొంగ ఎధవలు' అనుకుంటూ ఇకారస్ ఒక రాయిని తీసుకుని పై అంతస్థులకి విసిరాడు దాన్ని కసిగా. అది అద్దాల్ని బద్దలుచేసుకుంటూ పెద్ద శబ్దంతో లోపలికి పడింది. అదేదో కంప్యూటర్ ఇన్స్టిట్యూట్‌లా వుంది.

'పోతేపోనీ పేల్చేయ్యాలి వాట్ని. ఇపుడెందుకూ అవి'

పెద్ద బ్రిడ్జీ ఒకటి ఎదురైంది.

బ్రిడ్జీ మధ్యగా అలా నడుస్తూ పోతున్నాడు ఇకారస్.

అతని ఆలోచన్లో ఇంకా ఆ మాయా వస్తువే మెదుల్తోంది. దాన్ని తన ఆలోచన్లలోంచి తప్పించెయ్యలేకపోతున్నాడు.

ఇకారస్ కూడా తన గురించి వాళ్ళలా అనుకోవడం నిజమేనని అనుకున్నాడు.

అక్కడే మొదలయ్యింది మనసులో తుఫాను. ఆ లేత వయస్సులో.

వీధులన్నీ దూరంగా జరిగిపోయాయి ఇకారస్ నుంచి.

ఇకారస్ బ్రిడ్జీ మధ్యకు చేరుకుని నిలబడ్డాడు.

ఇంకా ఎవరెవరో మనుషులు బాల్యంలో కౌమారంలో తను చూసిన మనుషులు వస్తూ పోతున్నారు తన మనస్సులో. అందులో కొందరు ఏమయ్యారో తెలీదు. ఇప్పుడెలా బతుకుతున్నారో తెలీదు. జీవితంలో పనికిరాకుండా పోయినవాళ్ళు, మురికికూపంలో, తమను తాము సృష్టించుకున్న వీధి చీకటిలో దినాల్ని వెళ్ళదీస్తూ, కష్టపడుతూ కొందరు. హంతకులు కొందరు. సుఖంగా ఆరాంగా బతుకుతున్న వాళ్ళ కొందరు. పిరికివాళ్ళూ, పారిపోయి వచ్చిన వాళ్ళు కొందరు.

అందరూ గతకాలపు రూపాలే ఇప్పుడు.

బ్రిడ్జీ సిమెంటు రైలింగ్ మీద చేతులు ఆన్చి చూస్తున్నాడు. బ్రిడ్జీ కింద ఎదురుగా కొంతదూరంలో రైల్వేస్టేషన్. ఏదో ట్రైన్ ఒకటి నిల్చి వుంది. దాని చివరి స్టేషన్ ఇదే. అది మరి ముందుకెళ్ళదు.

ప్లాట్‌ఫాం మీద ప్రయాణీకుల బ్యాగులూ, సామానులూ ఎక్కడివక్కడే పడున్నాయ్. హడావిడిగా భయంతో వదిలేసి వెళ్ళిపోయినట్టు చెల్లాచెదురుగా అక్కడ కొన్ని యిక్కడ కొన్ని మరికొన్ని బ్యాగులు ట్రాక్ మీద పడిపోయి వున్నాయి.

'ఎక్కడికో వెళ్లవలసిన వాళ్ళు, ఎన్నో ప్రయోగాలు చెయ్యాల్సిన వాళ్ళు; పిల్లలూ, స్త్రీలూ, ముసిలాల్లూ, యువకులూ, పెద్దలు అందరూ ఏ ప్రాంతానికి వెళ్ళిపోయారో?'

రైల్వేస్టేషను కానుకుని పెద్ద పెద్ద భవన సముదాయాలు. వాటి కవతల దూరంగా కొండలు, గుట్టలు. ఇటు ఎడమ పక్కగా ఆయిల్ కంపెనీ; పెద్ద పెద్ద నిర్మాణాలు ఎండలో మెరుస్తూ.

ఇకారస్ అలా బ్రిడ్జీ మించి చుట్టుప్రక్కల భవనాల్ని గమనిస్తూ నిల్చున్నాడు. మిగతా సగం బ్రిడ్జీ వైపు చూస్తూండగా రెండు బిల్డింగుల మధ్యలోంచి కనిపించింది. పొడవాటి దారుశిల్పం.

దాని పక్కన పురాతన వేపచెట్టు. పదిమంది మనుషుల లావు వుంటుంది దాని మొదలు.

అది ఎడ్వర్డ్ దే అయివుంటుంది.

విశాలమైన రొమ్ములు ఎండలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

'తనేం చేస్తుంటాడు. ఇప్పుడు నిద్రపోతుంటాడేమో?'

ఎడ్వర్డ్ వుంటోన్న దారుశిల్పం దగ్గరికి ఇకారస్ సమీపించేసరికి ఎడ్వర్డ్ పిర్రల వద్ద తాడు నిచ్చెన పట్టుకుని దిగుతున్నాడు. మహావృక్షపు చెట్లనీడలు దారుశిల్పం మీద పడి అటూ ఇటూ కదుల్తున్నాయి. ఎడ్వర్డ్ దళసరి కాటన్ షర్టు వేసుకున్నాడు. తెల్లటిది. నీడలో స్పష్టంగా కనబడుతోంది. ఆ షర్టుని చూడగానే ఇకారస్‌కి తన నాన్న గుర్తుకొచ్చాడు.

డ్యూటీ యూనిఫాంగా నాన్న దాన్ని వేసుకునేవాడు.

ఇప్పుడెక్కడ వున్నాడో.

ఎడ్వర్డ్ దిగి ఇకారస్ వంక చూస్తూ

"హల్లో' అంటూ చెయ్యిని పైకెత్తాడు. చేతిలో 'ది సిక్ పీపుల్' కనిపించింది. ఎడ్వర్డ్‌కి ఆ పుస్తకమంటే యిష్టం. ఎడ్వర్డ్ ముఖం ప్రశాంతంగా వుంది. ఇప్పుడే స్నానం చేసినట్టున్నాడు. కొత్త సంగతులేమన్నా తెలిసాయా?" ఇకారస్ దగ్గరకొస్తూ అడిగాడు.

"సంగతులేముంటాయి. కొట్లలో మాంసం కుళ్ళి కంపుగొడుతుంది. గబ్బు వాసన. రెండు మూడు రోజులైతే మనకి తిండి దొరకడం కష్టం".

"ఇలాంటి పరిస్థితుల్లో మనమేం చేయలేం. సాధ్యమైనంత వరకూ బతకాలి. బతకగలిగే దారుల్ని వెదుక్కోవాలి. అదే మనం చెయ్యగలిగింది" ఎడ్వర్డ్.

"ఒక పని చెయ్యొచ్చు మనం. అదొక్కటే మార్గం"

ఏంటో చెప్పమన్నట్టుగా ఇకారస్ వంక చూసాడు ఎడ్వర్డ్.

"ఇప్పటికే రెండు రోజులైంది. వున్న ఆహారమంతా మరికొద్ది రోజులైతే పాడయిపోద్ది" ఫ్రిజ్‌లో మనికి కావల్సినవి భద్రపరచుకుందాం ముందు. అవైనా వారంరోజులే వస్తాయి. తర్వాత మనం వేరే దారి వెదుక్కోవాల్సిందే.

ఆ పనైతే మనం చెయ్యొచ్చు. ఈ పక్క వీధిలోనే ఫ్రిజ్‌ల షాపుంది. సుమారు 'ఇరవై' వరకూ వుంటాయి. అందులో నిల్వ చేద్దాం. డ్రైవింగొచ్చా నీకు' ఇకారస్ మొహంలోకి చూస్తూ అడిగాడు ఎడ్వర్డ్.

"రాదు" ఇకారస్.

"ఏం? మనిషన్నాక డ్రైవింగూ ఈతా వచ్చుండాలి. ఇవి రాకపోతే కష్టం. ఎందుకని నేర్చుకోలేదు?"

"డ్రైవింగ్ నేర్చుకోవడం యిష్టం లేదు, ఈత కూడా రాదనుకో"

"అన్ని పనులూ నేర్చుకోవాలి ఇకారస్ ! ఈ లోకంలో వున్న పనులన్నీ చేశాను నేను. తొలుత కలకత్తా గంగానదిలో లాంచీ మీద పనిచేశాను. ఆ తర్వాత లారీ క్లీనరుగా కుదురుకున్నాను. ఆ తర్వాత డ్రైవరునయ్యాను. డ్రైవరుగా చాలాకాలమే చేశాను. ఎన్నో వూళ్ళు తిరిగాను. అది మానేసి బస్సుల్ని నడిపాను కొంతకాలం. దాంతర్వాత కటక్‌లో ఓ పెద్దమనిషి దగ్గర కారు డ్రైవరుగా చేరాను. ఎక్కడా స్థిరపడలేదనుకో. ముప్ఫయ్ మూడేళ్ళు వచ్చాయి. సగం జీవితం అయిపోయింది కదూ. పైసా కూడబెట్టలేదు. బహుశా ఆ దృష్టే లేదు. ఇప్పుడు చూడు. ఈ నగరంలో ఎంత డబ్బు కనబడుతుందో కళ్ళముందు అంతా వృధా కదూ ?'

"పైకి మీరు చాలా ఆశాజీవిలా కనిపిస్తున్నా మీలో భయంకరమైన నిరాశావాదున్నాడు" ఇకారస్.

"నువ్వూ అట్లాండోడివే కదా ! నేనైతే లోకాన్ని చూశాను. నీకు ఏ అనుభవమూ లేదు కదా! అనుభవం లేకపోతే వెలితిలో చచ్చిపోతారు ఇకారస్. అది గుర్తుంచుకో' ఎడ్వర్డ్.

కొద్దిసేపు వాళ్ళ మధ్య మాటలేమీ లేకుండానే కొంతదూరం నడిచారు. ఇనుపరోడ్డుని దాటుకుని ప్రధాన రహదారిలోకి వచ్చారు.

కార్లూ వాహనాలూ యథాస్థానంలో అలానే వున్నాయి. ఆగంతుక నిశ్శబ్దంలో టీ కొట్టు, బట్టల షాపులు, మందులమ్మే షాపులు, ఫైనాన్సు, ఆసుపత్రి, బ్యాంకులు అన్నీ తెరిచే వున్నాయి. అలానే, తిని వదిలేసి గాలికెగురుతోన్న విస్తరిలా.

ఇకారస్ వాటన్నింటినీ చూస్తున్నాడు.

ఆసుపత్రి అద్దాల తలుపులోంచి బయటకొస్తూ ఎవరూ కనిపించరు. సైకిల్ మోత వినిపించదు. బస్సుకోసం ఎదురుచూస్తూ బస్టాండ్లలో ఎవరూ కనిపించరు.

ఫోన్ బూత్‌లు ఖాళీగా వున్నాయి. అంతటా ఏదో వెలితి! కనుచూపు మేరా వెలితి! చెట్ల కొమ్మల్ని వూపుతోన్న గాలి లాంటి వెలితి!

15

"మనం కార్లో పోయి మనకి కావల్సిన ఆహారాన్ని తెచ్చుకుందాం ముందు. ఆ తర్వాత ఆలోచిద్దాం ఏం చెయ్యాలో ఈ రోజు' అన్నాడు ఎడ్వర్డ్.

"కార్లోనా ?' ఇకారస్.

"ఏం ? ఇప్పుడవన్నీ ఎవరివీ కావు. కార్లో నువ్వెప్పుడూ ప్రయాణించలేదు కదా ! వెళ్దాం హాయిగా వుంటుంది."

ఎడ్వర్డ్ ఇకారస్‌లు నల్లని బెంజ్ కార్లో కూర్చున్నారు. రెండుపక్కల అద్దాల్ని కిందికి దింపి.

ఎడ్వర్డ్ కారుని స్టార్ హోటలున్న రోడ్డులోకి మలిపాడు.

కారు నెమ్మదిగా పోతోంది. ఇకారస్ నిర్మానుష్య భవనాల వంక షాపుల వంక అనాలోచితంగా చూస్తూ కూర్చున్నాడు.

"జరగాల్సిందేదో జరిగింది మొత్తానికి. బహుశా తమకి జరిగిన విపత్తుని మనుషు లెవరూ వూహించి వుండరు" ఎడ్వర్డ్.

"'వూహించి వుండరని మనమెలా వూహించగలం?"

"ఏ అండర్ గ్రౌండ్ బంకర్లోనో, మరో సురక్షిత చోటుకో, దట్టమైన అడవులున్న పర్వతాలకో వెళ్ళుంటారనా నీ ఉద్దేశం" ఎడ్వర్డ్.

"అలా అని ఖచ్చితంగా చెప్పలేను. మిారన్నట్టు ఏదో జరిగింది"

నిదానంగా స్పీడును పెంచాడు ఎడ్వర్డ్.

"కారు బావుంది. ఏ ఇండస్ట్రియలిస్టుదో అయి వుంటుంది. ఏ పాతిక లక్షలో వుంటుంది దీని ఖరీదు"

"ఎంత దూరముంటుంది?" ఇకారస్.

"ఏం దూరాల్తో పనేముందిప్పుడు ? ఏం ఎవరికైనా కలుస్తానని చెప్పావా?' నవ్వుతూ అడిగాడు ఎడ్వర్డ్.

ఇకారస్ కూడా నవ్వేడు.

"నేనొస్తానని వేచి చూసే వారెవరున్నారు ? ఎవరూ లేరు ? ఇక వుండరేమో"

కారు ఇనుప బ్రిడ్జీలోకి ప్రవేశించింది. హౌరాబ్రిడ్జీలాంటిదే.

కింద నది పరవళ్ళు తొక్కుతూ ఎప్పుడూ లేనంత వేగంతో పోతోంది.

బ్రిడ్జీ మీదికి పోగానే ఒక్కసారి నది గాలి చల్లగా తగిలింది. విశాలమైన నదీ ఆవరణనీ, నది రెండు పక్కలా గుంపు గుంపులుగా వున్న లాంచీల్నీ పడవ కొయ్యల్నీ చూస్తూ "ఇంత ఉధృతంగా ఎప్పుడూ వుండదు. కానీ ఈ వేళెందుకో పరవళ్ళు తొక్కుతోంది" అన్నాడు ఎడ్వర్డ్.

"ఇక్కడేదైనా సాధ్యమే ఇప్పుడు" ఇకారస్

16

కారు బ్రిడ్జిని దాటి కొంతదూరం వెళ్ళగానే సమాధులు మొదలయ్యాయి.

ఎండపడి మెరుస్తున్నాయి తెల్లగా. చాలాదూరం వరకూ వున్నట్టున్నాయి సమాధులు.

"సుమారు రెండు కిలోమీటర్లు వరకూ వుంటాయి. ప్రపంచంలోనే అతిపెద్ద సమాధి స్థలి అంటారు దీన్ని". సమాధుల వైపు, మధ్యమధ్యలో ఊడల మర్రి చెట్లవైపు చూస్తోన్న ఇకారస్‌తో అన్నాడు ఎడ్వర్డ్.

సగం సమాధులు దాటిపోయేసరికి ఎడ్వర్డ్‌కి రోడ్డుమీదేదో మెరుస్తూ కనిపించింది. ఎడ్వర్డ్ దాని దగ్గరికి పోనిచ్చి కారులోంచి దిగాడు. తను అనుకున్నది కరక్టే. సిగరెట్టు పెట్టె చేతిలోకి తీసుకుని చూసాడు.

'సిమ్మేరియా'

'ఫేమస్ బ్రాండే' !

లోలోపల అనుకుంటూ పెట్టెని వోపెన్ చేసి చూసాడు స్మైరంగు సిగరెట్లు. రెండే వున్నాయి. ఫిల్టర్ నల్లగా మసిబొగ్గు లాగా వుంది. ఫిల్టర్‌కి ఆనుకునే సన్నని బంగారపు గీత. చూడ్డానికి చాలా బావుంటాయి సిమ్మేరియా సిగరెట్లు. వాటిని జేబులో వేసుకుని ఖాళీ సిగరెట్ పెట్టెను గోడకవతలకి సమాధుల్లోకి విసిరేసాడు.

"ఏంటది ?" కార్లోకి వచ్చి కారు స్టార్ట్ చేస్తోన్న ఎడ్వర్డ్‌ని అడిగాడు ఇకారస్.

"సిమ్మేరియా" అని కారుని ముందుకు పోనిస్తూ. "ఎప్పుడైనా విన్నావా దాని పేరు ?' ఎడ్వర్డ్.

"లేదు. విన్లేదు"

"సిమ్మేరియా అని ఫేమస్ ఇటాలియన్ బ్రాండ్ సిగార్స్. పైకి సిగార్స్‌లాగే కనిపిస్తాయి. లోపలంతా ఇటాలియన్ మారిజువానా వుంటుంది. అదే దాని అసలు రహస్యం".

"మారిజువానానా ?" ఇకారస్ ఆశ్చర్యంగా అడిగాడు.

"మారిజువానానే. ఇటాలియన్ పర్వత సానువుల్లో పండిస్తారు. ఆ తోటలో ఎంతో మంది యువతులు పనిచేస్తారు."

"పర్వత సానువులూ, తోటలూ మేఘాలూ, స్త్రీలూ గొప్ప కలయిక కదా యిది?" ఇకారస్ మొహం ఆనందంతో ఉప్పొంగింది.

"పర్వత సానువులంటే యిష్టమా నీకు ?'

"అవును. పర్వతాలే కాదు. దూరదేశపు పళ్ళతోటలన్నా యిష్టం. ఆపిల్ తోటలు, ద్రాక్ష తోటలు, లోయలు, చలిమేఘాలు యిష్టం". ఇకారస్ కళ్ళు సంతోషంలో మెరిసాయి.

"ఆహా ఊహాశక్తి బాగానే వుంది నీకు. సైబీరియిన్ పక్షివనుకున్నావా? నువ్వు ఎక్కడికైనా వెళ్ళిపోవడానికి, లేదా బెలూన్‌వనుకున్నావా ?" వ్యంగ్యంగానే అన్నాడు ఎడ్వర్డ్.

"లేదు లేదు నన్నపార్థం చేసుకున్నావు. నాకేగనక డబ్బులుంటే అక్కడికే వెళ్ళిపోతాను. ఆ స్త్రీల వద్దకే. దూరపు లోయల దగ్గరికే వెళ్ళిపోతాను. కానీ యిక్కడ యిరుక్కుపోయాను. మొసలినోట్లో కాళ్ళు. పాదాల కింద గడియారాలు తగుల్తున్నాయి. ఎన్ని మింగిందో మొసలి?"

సమాధులు వెళ్ళిపోయి చాలాసేపయ్యింది. కారు వేగంగానే పోతోంది. కొత్తగా ఈ మధ్యనే వేసిన రోడ్డు కావడం వలన ఏ ఆటంకమూ లేకుండా, ఎక్కడా ఆగకుండా పోతోంది. అదీకాక ఎడ్వర్డ్‌కి ఈ రోడ్డు బాగా తెలుసు.

రోడ్డు కిరువైపులా తురాయి చెట్లు. నిండా పూలు పూసి వున్నాయి.

"ఎవర్నైనా ప్రేమించావా?" ఇకారస్‌ని అడిగాడు.

"ప్రేమించాను"

"ఎలా వుంటుందమ్మాయి. బావుంటుందా బంతిపువ్వులా". కళ్ళెగరేస్తూ ఎడ్వర్డ్.

"కాదు పర్వతసానువుల్లా వుంటుంది, దూరపు సముద్రంలా వుంటుంది. సముద్రంమీది ప్రాచీన ఓడలా వుంటుంది. తెల్లని రేవు పట్టణంలా, ద్వీపపు స్వర్గపు యిసుకలా మెరుస్తూ వుంటుంది".

"మరి పెళ్ళి చేసుకోలేదా?" ఎడ్వర్డ్

"పెళ్ళి చేసుకుంటే ఈ నగరానికెందుకొస్తాను?"

"మరేమయ్యింది" ఎడ్వర్డ్.

చనువుగా ఎడ్వర్డ్ జేబులో చెయ్యిపెట్టి సిగరెట్టు తీసుకున్నాడు ఇకారస్.

"మారిజువానానా?" ఎడ్వర్డ్.

"అవును మారిజువానానే కాలుస్తాను" ఎడ్వర్డ్ వంక చూస్తూ అన్నాడు ఇకారస్.

"నీ యిష్టం" ఇకారస్ వంక దిగులువదనంతో చూస్తా అన్నాడు ఎడ్వర్డ్.

"ఎవర్ని ప్రేమిస్తున్నానో తేల్చుకోలేకపోయాను, వర్షంలో తడిసిన ఆమె కాలి అందెల్నా , ఓడరైలింగ్‌నా"

"ఆమెతో మాట్లాడావా?"

"లేదు" ఇకారస్.

"మరి?"

"సముద్రాలూ, ప్రాచీన వీధులూ, వచ్చి మాట్లాడాయి ముందు. ఆమె కళ్ళని అర్థం చేసుకోలేకపోయాను. ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వచ్చేసాను"

ఎడ్వర్డ్ బాధతో నిట్టూర్చాడు.

"ఇది జరిగి పదేళ్ళవుతుందా?"

"అవును పదేళ్ళయ్యింది. మళ్ళీ ఆమెని చూసి. ఆమెకి పిల్లలని విన్నాను"

ఎడ్వర్డ్ ఇకారస్ చేతుల్లోంచి 'సిమ్మేరియా' అందుకుని రెండు మూడుసార్లు పీల్చి ఇచ్చాడు.

"ఈ పదేళ్ళలో ఆమె గుర్తుకు రాలేదా?"

"గుర్తుకొచ్చింది వారానికి రెండుమూడు సార్లు" ఇకారస్.

"ఏ స్త్రీనీ ప్రేమించలేదా ఈ పదేళ్ళలో" ఎడ్వర్డ్.

17

"మరేం చేస్తావిప్పుడు ? ఇంటికెళ్తావా ?" ఎడ్వర్డ్

"ఒట్టి చేతుల్తోనా ? ఆమెని కలవడానికి వెళ్ళనా? ఒట్టి గుండెల్తో ఎలా వెళ్ళను?'

ఇకారస్ జుత్తు గాలికెగురుతోంది.

ఎడ్వర్డ్ తన ఆలోచన్లో పడి కారుని దేనిమీదకో పోనిచ్చాడు. ఒక్కసారిగా కారంతా కుదుపుకు లోనయ్యింది. ఈ హఠాత్ పరిణామం నుండి తేరుకుని కారుని ఆపాడు ఎడ్వర్డ్.

'మనిషి దేహంకాదు కదా?' అనుమానమేసింది ఎడ్వర్డ్‌కి.

ఇకారస్, ఎడ్వర్డ్, ఇద్దరు కారు దిగి వచ్చి చూసారు.

ఇటుకల్ని ముప్ఫయ్యో నంబర్‌లాగా ఎవరో పేర్చి వున్నారు. ఎడ్వర్డ్ సీరియస్‌గానే వున్నాడు.

"మనిషి కాదు కానీ, ప్రమాద సూచికలా తోస్తోంది. ఏమైనా మనం జాగ్రత్తగా వుండాలి"

"నంబర్లలో కూడా ప్రమాద సూచికలుంటాయని నువ్విప్పుడన్నాక గానీ నాకు తెలీదు" ఇకారస్.

"ఆఁ వుంటాయి ఎందుకుండవు. ఇప్పుడు కొన్ని నంబర్లు చెప్తాను. అవంటే ఇష్టమా నీకు? 11, 16, 19, 2, 25, 30, 35"

అథారిటీగా అడుగుతున్న ఎడ్వర్డ్‌ని చూడలేక తలవంచుకున్నాడు ఇకారస్.

"మూడో నంబరంటే పరమ అసహ్యం నాకిపుడు" మళ్ళీ ఎడ్వర్డ్ అన్నాడు ఇకారస్ వంక చూస్తూ

"దిగులుగా కాలు ముడుచుకుని పడుకునుంటుంది ఎప్పుడూ"

ఆ ఇటుకల్ని ఒక తన్ను తన్ని, కోపంతో ఒక దాన్ని తీసుకుని అడ్వర్టయిజింగ్ హోర్డింగ్ మీదికి విసిరాడు. లైఫ్ ఇన్సూరెన్స్‌కు సంబంధించిన హోర్డింగది.

సాయంత్రం ఐదుగంటల వరకూ రకరకాల ఫుడ్ ఐటమ్స్ తెచ్చి ఫ్రిజ్‌లో పెట్టారు. స్టార్ హోటల్‌నుంచే కాకుండా, చుట్టుపక్కల మెస్‌ల నుంచీ, ఇళ్ళలోంచి తెచ్చారు.

షాపు మెట్ల మీద కూర్చున్నాడు ఎడ్వర్డ్, వీధిలోకి చూస్తూ.

తుపాకులమ్మే దుకాణం, దంతవైద్యుడూ, దాని పక్కనే టీ షాపు, గార్మెంట్స్, స్టేషనరీ, గ్రోసరీ, నూడుల్సు, అవన్నీ వస్తువులతో క్రిక్కిరిసి వున్నాయి.

'ఇవన్నీ సంపూర్ణంగా నాశనం కావాలంటే వందసంవత్సరాలు పడుతుందేమో! క్షీణించడమనేది జరుగుతుందా అసలు? మేమిద్దరమే ఎందుకున్నామిక్కడ? ఎంత కాలముంటాం? ఏదైనా జరగబోతుందా మాకు ? అజ్ఞాత శక్తులేమన్నా మమ్మల్ని పరిశీలిస్తున్నాయా? ఊహకందని దూరం నుంచి ఎవరైనా గమనిస్తున్నారంటావా?' ఎడ్వర్డ్ తనకుతానే ప్రశ్నలు వేసుకుంటున్నాడు.

'చావు తప్పదా? చావు తప్పదా ఏంటి? చావొక వాస్తవం. నుదుటి మీద అగ్నిశిఖల్తో రాసి వుంటుంది చావు'.

'ఈలోగా ఏమైనా' .... ఆగ్రహంతో అనుకుంటూ కుడివైపు వీధిలోకి ముఖం తిప్పాడు. పదంస్తుల బ్యాంకు భవనాన్నీ, భవనపు ముందలి గోడల్నీ చూస్తున్నాడు. దవడల కింద చేతుల ఆన్చి.

గోడల మీద 'విప్లవం వర్ధిల్లాలి ప్రపంచకార్మికులారా ఏకం కండి! అని పెద్ద పెద్ద ఎర్రటి అక్షరాలు నెత్తురుతో రాసినట్టుగా ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ఇకారస్ లోపలి ఫ్రిజ్‌ల డోర్‌లన్నీ వేసి ఒకసారి మళ్ళీ చెక్ చేసుకుని బయటకొచ్చాడు.

"ఈ గోడల మీద రాసుకోనిస్తారా వాళ్ళు?" పక్కకు వచ్చి నిల్చున్న ఇకారస్‌ని అడిగాడు ఎడ్వర్డ్.

"ఎందుకు రాసుకోనివ్వరు. ఎక్కడైనా రాసుకోవచ్చు. స్కూళ్ళ మీద కాలేజీల మీద, జైలు గోడల మీద, ఇళ్ళ మీద, ఫ్యాక్టరీల మీద, రోడ్ల మీద ఎక్కడైనా రాసుకోవచ్చు. ఎవరూ ఏమీ అనరు" ఇకారస్.

"నువ్వు రాసావా ఎప్పుడైనా?" ఇకారస్‌ని అడిగాడు ఎడ్వర్డ్.

"ఆఁ రాసాను" ఇకారస్.

'ఎప్పుడు ?'

"పదేళ్ళ క్రితం" ఇకారస్.

"ఎక్కడ రాశావు యిక్కడేనా?"

"అక్కడనీ యిక్కడనీ కాదు. చాలా పట్నాల్లో రాసాను భలే వుంటుంది. రాత్రులంతా మేల్కొని రాయటం" ఇకారస్ కళ్ళు ఉత్సాహంతో మెరిసాయి.

"మరిప్పుడు రాయటం లేదా?'

"లేదు ఆ పట్నాల్ని వదిలి వచ్చేసాను. అవింకా రాస్తూనే వుంటాయి. డబ్బాలో రక్తం అయిపోయేవరకు'. ఇకారస్.

"నువ్వు అప్పుడప్పుడూ చాలా చిత్రంగా మాట్లాడుతుంటావు ఇకారస్! ఇంతకు ముందేదో పర్వతాలు లోయలూ వచ్చి నీతో మాట్లాడాయంటావు. ఎందుకు అలా ? ఫ్రస్టేషనా?"

"అవును ఫ్రస్టేషన్" బయటకనకుండా లోపలే అనుకున్నాడు ఇకారస్.

ఇకారస్ బదులు చెప్పకపోయేసరికి.

'ఫ్రస్టేషన్లుండొద్దు. ఏ విషయంలోనైనా బి హేపీ. గతాన్ని మర్చిపో. జరిగేదేదో జరిగి తీరుతుంది. ఏదో ఒకటి చేస్తూ పోవాల్నంతే. 'దా' అంటూ లేచాడు ఎడ్వర్డ్.

"ఎక్కడికి ?" ఇకారస్

"వీనస్ స్టోర్‌కి. చీకటి పడకముందే పోదాం. ఇవాళ కరెంటు వుండే వుంటుంది. లేకపోతే లేదు."

"ఈ సారి నేను 'లెతె'ని తాగను. యిష్టం లేదు. అది నీకైతే సరిపోతుంది. నేను మాత్రం 'ఎలీసియం'ని తెచ్చుకుంటాను."

"సరే నిన్నెవరూ బలవంతం చేయట్లేదు. నీ ఇష్టమొచ్చిందే తాగు"

వీనస్ స్టోర్ వైపు ఇద్దరూ నడుస్తున్నారు. వీనస్ స్టోర్ కానుకునే టెలిస్కోప్ ఎన్‌క్లేవ్ వుంటుంది.

టెలిస్కోపు ఎన్‌క్లేవ్ అత్యంత అధునాతన శైలిలో కట్టిన భవనం. నీలం అద్దాల అమరికలో భారీగా వుంటుంది. ఆరంతస్థుల బిల్డింగ్. ప్రపంచ వైజ్ఞానిక మార్కెట్లో కొత్తగా వచ్చిన టెలిస్కోపులన్నీ అక్కడ అమ్మకానికీ, ప్రదర్శనకీ పెడతారు. చూడ్డానికి కూడా రానిస్తారు. స్కూల్లో, కాలేజీల పిల్లల్ని గుంపులుగా వెంటబెట్టుకుని ఉపాధ్యాయులు తరచూ యిక్కడికి వచ్చేవారు.

భవనం పైన టెర్రాస్ చాలా బావుంటుంది. ఒక సమావేశ స్థలం. అక్కడక్కడా టెలిస్కోపులుంటాయి. ఔత్సాహికులెవరైనా వాటిని వుపయోగించుకోవచ్చు.

ఇకారస్‌కి టెలిస్కోపులంటే యిష్టం.

చిన్నప్పుడు ఖగోళశాస్త్రవేత్తని కావాలని బలమైన కోర్కె వుండేది. గ్రహతలాల్ని శూన్య మైదానాల్ని దగ్గరగా మరింత దగ్గరగా తాను అక్కడే వున్నంత దగ్గరగా చూడాలనీ అనుకునేవాడు. టెలిస్కోపులో చంద్రున్ని చూడాలని తన కోర్కె 'ఇప్పుడు చూడొచ్చు' అనుకున్నాడు ఇకారస్.

ఎప్పటిలానే ఎడ్వర్డ్ 'వీనస్ స్టోర్' లోకి దూకి 'ఎలీసియం'నూ 'లెతె'నూ బయటకు తెచ్చాడు.

ఎలీసియం, లెతె రెండూ కావాలంటే దుంకాల్సిందే. భయం లేకుండా దుంకక పోతే అవి దొరకవు. యిక్కడ తప్ప యింకెక్కడా లేవు. అదే అర్థం కావటం లేదు ఎడ్వర్డ్‌కి. నగరంలో చాలా చోట్ల వైన్ షాపుల్లో వెదికాడు. ఈ బ్రాండ్లు ఎక్కడా ఎప్పుడూ కనిపించలేదు. ఈ మిష్టరీ ఏంటో అర్థం కాదు. చెప్పేందుకు ఎవరూ లేరు.

"ఇదిగో నీ ఎలీసియం" ఇకారస్ చేతిలో పెట్టాడు బాటిల్ని.

"ఈ వేళ యిక్కడే తాగుదాం. ఈ టెలీస్కోపు భవనం పైన బావుంటుంది. ఎక్జోటిక్‌గా వుంటుంది. రెండు టెలిస్కోపులున్నాయి".

ఇకారస్ ముందస్తుగానే అన్నాడు. భవనం టెర్రాస్ నుంచి కనిపిస్తోన్న టెలిస్కోపుల్ని చూపిస్తూ.

"టెలిస్కోపులంటే యిష్టం లాగుంది నీకు. ఎందుకూ ఆ గ్రహలపట్ల ప్రేమా? ఎవరూ వుండని, ప్రాణమనేదే లేని నేలలు ఎలా వుంటున్నాయో అక్కడ?" ఇకారస్ వంక చూస్తూ ప్రశ్నించేడు ఎడ్వర్డ్.

"అవును ఆ శూన్యపు కలలంటే యిష్టం. నేనెప్పుడూ వాట్ని చూడలేదనుకో. ఒక్కోసారి అనిపిస్తూంటుంది. యిక్కడే ఎందుకు ప్రాణముందా అని ? అన్ని గ్రహాలకి మల్లే యిక్కడ కూడా ప్రాణం లేకుండా వుండొచ్చు కదా ? ఎందుకిక్కడ ఇంతమంది జనాలూ, ఇన్ని బిల్డింగులూ, ఇన్ని మిలటరీ టాంకులూ ఇంతమంది భిక్షగాళ్ళూ?"

"చాయిస్" అన్నాడు ఎడ్వర్డ్.

"ఆ ఛాయిస్సయినా ఎవరిచ్చారు ?"

"'నీకు ఛాయిస్సెవరు ఇచ్చారో తెలుసా నీకు?" వెటకారంగా అన్నాడు ఎడ్వర్డ్.

"మూర్ఖంగా మాట్లాడకా" ఇకారస్ తెగేసి చెప్పాడు.

"ఏం ఎందుకూ తల్లిదండ్రులంటే అంత ఎవర్షన్ ?"

"అదంతే. అదంతే. వదిలేశెయ్. పది సంవత్సరాల క్రితమే మర్చిపోయాను"

ఎలీసియం వున్న కవరుల్ని ముడివేసాడు ఇకారస్.

"జీవితపు పరమార్థాన్నే తిరస్కరించావు అందుకే నీకు నిర్జన ప్రాంతాలంటే obsession' ఎడ్వర్డ్ కఠినంగా అథారిటీగా.

మనసు చివుక్కుమంది ఇకారస్‌కి ఉన్నట్టుండి. ఏమీ మాట్లాడకుండ మౌనం వహించాడు.

పైకెల్లేందుకు మెట్లెక్కుతూ టెలిస్కోపు భవనంలో ఎడ్వర్డ్ అన్నాడు. "ఈ పుస్తకాన్ని చదువు" అంటూ the sick people ని పైకెత్తి చూపించాడు.

"అవన్నీ ఏం చెప్తాయి. ఆఖరికి చావే కదా!" ఎడ్వర్డ్ వెనకాలే మెట్టెక్కుతున్న ఇకారస్ బదులిచ్చాడు.

18

టెర్రాస్ ఆధునిక రీతిలో తీర్చిదిద్ది వుంది. లేతపచ్చని మార్బుల్ టైల్స్. ఒక మూల రౌండుగా కుర్చీలు. కుర్చీల మధ్యలో వున్న గుండ్రటి గ్లాస్ టేబిల్ మీద ఒక ఇత్తడి గ్లాసు. అందులో డైజీ పూల మొక్కలు వాడిపోయి వున్నాయి. అలాంటి కుర్చీల వలయమే పక్కన ఐదడుగుల దూరంలో మరొకటి వుంది.

టెర్రాస్ పై నుంచి ఆకాశాన్ని ఎప్పుడూ రెండు కళ్ళు చూస్తున్నట్టుగా.

టెర్రాస్ మధ్యలో మెట్లతో కూడిన ఒక ఇనుప నిర్మాణం. దాని మీద రెండు టెలి స్కోపులు; కూర్చుని చూసేందుకు వీలుగా ఇనుప స్టూలూ వున్నాయి.

"యిప్పుడు కాదు చూడాల్సింది. బాగా చీకటి పడ్డాక, నక్షత్రాలూ చంద్రుడూ స్పష్టంగా కనబడుతుండగా చూడాలి" టెలిస్కోపుల వంక తలెత్తి చూస్తోన్న ఇకారస్‌ని ఉద్దేశించి అన్నాడు ఎడ్వర్డ్.

తాగడానికంతా సిద్ధం చేశారు.

రెండు గ్లాసులూ చేతుల్లో పైకెత్తి తగిలించి

'Absalom' అన్నారు ఒకేసారి మెల్లగా.

'Absalom' అనేది ఒక సంజ్ఞాపదం

ఎందుకనో వాళ్ళు యాంత్రికంగానే అట్లా పలుకుతున్నారు. మామూలుగా అయితే 'చీర్స్' పలకాలి. ఈ నగరంలోకి వచ్చాక మర్చిపోయారు ఆ పదాన్ని.

"ఏమిటాలోచిస్తున్నావ్ ?" ఏమీ మాట్లాడకుండా మౌనం వహించిన ఇకారస్‌ని వుద్దేశించి అన్నాడు ఎడ్వర్డ్.

"ఎలా బతకాలనా? ఎలా గడపాలనా ఇక్కడ ? యిదొక పద్మవ్యూహం. ఎక్కడికీ పోలేవు. అర్థమయ్యిందా?" ఇకారస్ మొహంలోకి చూస్తూ ఎడ్వర్డ్.

ఇకారస్ ఎడ్వర్డ్ మాటల్ని వింటూ కూర్చున్నాడు. అంతా ఎడ్వర్డ్ మాట్లాడుతున్నాడు. తాగిన మత్తులో.

"వృద్ధాప్యం గురించి ఆలోచిస్తున్నావా? అంత అవకాశం ఈ నగరం నీకివ్వద్దులే"

"నేను టెలిస్కోపుని చూడ్డానికి వెళ్తాను". ఎడ్వర్డ్ మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ ఇకారస్ లేచాడు. అప్పటికే చీకటిపడింది.

వెన్నెల రాత్రులు. చుట్టూరా ఆకాశం స్పష్టంగా నక్షత్రాల్తో కాంతులీనుతోంది. వేసవి గాలి ఉధృతంగా వీస్తోంది.

ఇకారస్ షర్ట్ గుండీల్ని విప్పేసి మత్తుగా ఇనుప మెట్లెక్కి టెలిస్కోపుని అందుకున్నాడు.

చంద్రుడు నిరాడంబరంగా వున్నాడు మామూలుగా.

చంద్రుని పక్కనే, ఉవ్వెత్తున లేచి చంద్రుని కబళించబోతున్నట్టుగా తెల్లని మేఘశిఖ, మేఘసముద్రం పైన కెరటానికి ఆనుకుని వుంది. చంద్రుని కిందనంతా సముద్రంలాగా విశాలమైన మేఘం.

టెలిస్కోపుని పట్టుకుని చంద్రునివైపు తిప్పాడు ఇకారస్.

ఇంతకు ముందెప్పుడు ముట్టుకోకపోవడం వలన సరైన పిక్చర్ రావట్లేదు.

"ఒక్క నిముషం" అంటూ ఇకారస్‌కి తెలియకుండా పక్కననుంచున్న ఎడ్వర్డ్ టెలిస్కోపు అందుకుని దేన్నో వోపెన్ చేసి ఎడ్జస్ట్‌మెంట్ చేసాడు.

"ఇప్పుడు చూడు" ఎడ్వర్డ్.

టెలిస్కోపునందుకుని చంద్రుని చూస్తోన్న ఇకారస్ ముఖం ఒక్కసారిగా వికసించింది ఆనందంతో.

"చాలా దగ్గరగా కనిపిస్తున్నాయి రాళ్ళు, మైదానాలు, గుట్టలు. అచ్చం యిక్కడిలాగే వున్నాయి" టెలిస్కోపు నుంచి ముఖం పైకెత్తి ఎడ్వర్డ్‌తో అన్నాడు.

"చాలా దగ్గరగా స్పష్టంగా, వూదారంగులో కన్పిస్తున్నాయి రాళ్ళు"

"అవును అలాగే వుంటాయవి" ఎడ్వర్డ్.

"అలాంటివి యిక్కడ కూడా చూశాను" ఇకారస్.

"అందులో ఆశ్చర్యమేమీ లేదు. వుంటే వుండొచ్చు" ఎడ్వర్డ్.

"గుహలు కూడా వున్నాయి. నల్లటి పళ్ళులేని నోళ్ళతో" ఇకారస్.

"అవి యాదృచ్ఛికంగా ఏర్పడి వుంటాయి". ఎడ్వర్డ్.

ఇకారస్ టెలిస్కోపులోకి ముఖం పెట్టి చూస్తూ "అసలు ప్రాణమే లేకపోతే, ఏ ఉద్దేశ్యంతో వున్నట్టు అక్కడి మైదానాలూ రాళ్ళూ లేదా ఏదో ఒక ఉద్దేశ్యమూ, అర్థమూ వుంటాయా ఆ రాళ్ళకి? లేకపోతే అవెందుకుండాలక్కడ?' ఇకారస్ ఔత్సాహికంగా సగం దిగిన మత్తులో.

"కొన్ని ప్రశ్నలకి మనం సమాధానం చెప్పలేం. యిక్కడెందుకు మనుషులు లేరంటే మన దగ్గర సమాధానముందా? అదీ అలాగే అవుంటాయి. అలానే ఇప్పటికీ ఎప్పటికీ" ఎడ్వర్డ్.

"అవంటే నాకిష్టం. నేను ప్రేమిస్తున్నాను ఆ రాళ్ళని. ఆ రాళ్ళని చూశావా?ఎలా వున్నాయో అక్కడ నిరాడంబరంగా హాయిగా" ఇకారస్ కళ్ళు మెరిసాయి.

"నీ మాటలు వింటూంటే నాకో తెగ మనుషులు గుర్తుకొస్తున్నారు" ఎడ్వర్డ్.

"తెగా ? గ్రహరాళ్ళకీ తెగలకీ ఏమిటి సంబంధం ?" ఇకారస్.

"సంబంధమని కాదు. ఎందుకో, వాళ్ళు గుర్తుకొచ్చారు" ఎడ్వర్డ్.

"ఇప్పుడు వున్నారా వాళ్ళు ?" ఇకారస్.

ఇనుప నిర్మాణపు అంచు మీద కూర్చొంటూ అన్నాడు ఎడ్వర్డ్. "ఎవరూ లేరు. సుమారు ఐదువందల ఏళ్ళ క్రితమే అంతరించిపోయారు. అప్పటికే వాళ్ళు యాభైమంది వుండేవారట. ఒకసారి వడగళ్ళవాన భారీగా వస్తే, వడగళ్లంటే మామూలు వడగళ్ళు కాదు. ఏనుగంత సైజువి. ఆ భీకరమైన వానలో వాళ్ళ స్థావరాలన్నీ చెదిరి పోయాయి. ఐదుగురే మిగిలారు. ఇద్దరు యువతులూ ముగ్గురు మగవాళ్ళు. ఆ ఇద్దరు యువతుల్నీ ముగ్గురూ పంచుకున్నారు. వాళ్ళు కూడా చనిపోయారు. తెలియని జబ్బుతో.

ఒకామె మాత్రం మిగిలింది. ఇద్దరు పిల్లలతో. ఆమె ఆ ఇద్దరు పిల్లల్ని వెంటబెట్టుకుని సముద్రం ఒడ్డునే నడుచుకుంటూ వెళ్ళి ఓ బెస్తపల్లెకు దత్తతపోయారు. ఆమె ఆ పిల్లలతో ఆ ఊళ్ళో స్థిరపడింది. మళ్ళీ పెళ్ళి చేసుకుంది. ఒకరోజు ఆమె సముద్రపు ఒడ్డున లోపలికీ బయటకీ వచ్చిపోతున్న అలల మీద నడుస్తుండగా సముద్రపు పాముని తొక్కి అక్కడికక్కడే చనిపోయింది. ఆమె కనిపించకపోయి రెండు రోజులైంది. ఆ ఇద్దరు కొడుకులూ చుట్టుపక్కల వూళ్ళన్నీ తిరిగారు. ఈ లోగా ఆమె శవాన్ని సముద్రపు ఒడ్డులో తిరిగే ఎండకుక్కలు పీక్కుతిన్నాయి. ఆకలితో వున్నాయేమో ఆమె దేహాన్ని మొత్తం తినేసి బొమికల్నే మిగిల్చాయి. ఆఖరికి ఓ కుక్క మళ్ళీ మర్నాడు అక్కడికి వచ్చి ఆ అస్థిపంజరాన్ని ఈడ్చుకుంటూ రాళ్ళలోకి తీసుకుపోయింది. అలా ఆ అస్థిపంజరం రాళ్ళ సందుల్లోంచి సముద్రంలోకి వెళ్ళిపోయింది.

ఆమె మాంసం తిన్న కుక్కలు వెర్రెత్తిపోయాయి.

తొలుత, సముద్రతీరంలో కనబడిన చెట్టు మొదలు నల్లా కసిగా కొరికాయి.

ఆ తర్వాత బెస్త పల్లెకు సమీపించాయి ఒక రోజు రాత్రి.

ఆరుబయట మంచాల మీద నిద్రపోతున్న ఆమె కొడుకుల్ని కరిచాయి క్రూరంగా. దానికి వైద్యమేంటో వాళ్ళకి తెలీదు. బెస్తవాళ్ళకీ తెలీదు. బెస్తవాళ్ళు చేప లివరునీ, వేప వేర్లనీ నూరి గాయాల మీద అద్దారు, వాళ్ళ నమ్మకం కొద్దీ విశ్వాసంతో. అవేమీ పని చేయలేదు. కొడుకులిద్దరిలో ఒకడు కొంతకాలానికి పిచ్చెక్కి సముద్రపు రాళ్ళకి తల బద్దలు కొట్టుకుని చనిపోయాడు. మరొకడు సముద్రంలోకి దూకేసాడు, ఏమీ చెయ్యలేక వేడిని తట్టుకోలేక. వాళ్ళకి అప్పుడు పదహారేళ్ళ వయస్సే. ఎవర్నీ ప్రేమించలేదు. అయితే ఈ కథ యిక్కడితో ఆగిపోలేదు. ఆమె బతికుండగా ఒక గర్భిణీ స్త్రీతో చంద్రున్ని గురించి ఒక కథ చెప్పింది. అది తమ తెగవాళ్లు చలినెగడు చుట్టూ కూర్చుని వున్నప్పుడు మగతగా నిద్రపోతూ వింటట, ఓ అర్ధరాత్రి. ఆ గర్భిణీ విన్న మాటలు ఆమె గర్భంలో వున్న పిల్లాడి లేత చెవుల్లో, దేముడి చెవుల్లో పడ్డాయి. ఆ మాటలనే నీకిప్పుడు విన్పిస్తున్నాను".

వెన్నెల పడుతోన్న టెలిస్కోపు మీద తలని ఆన్చి ఆసక్తిగా వింటున్నాడు ఇకారస్.

"టెలిస్కోపులో నువ్వు చూసిన రాళ్ళున్నాయి చూశావా? ఆ రాళ్ళన్నీ ఆత్మల రూపాలే. పెళ్ళి కాకముందూ, పెళ్ళి జరుగుతుండగా చనిపోయిన వాళ్ళు, యిష్టం లేకుడా ఆత్మహత్యలు చేసుకున్న వాళ్ళ ఆత్మలన్నీ చంద్రుని మీదకెళ్ళి రాళ్ళుగా

మారిపోతాయట. వాళ్ళే కాదు. లేత వయస్సులో చంపబడిన వాళ్ళు, తమని తాము చంపుకున్నవాళ్ళు, పసివాళ్ళు, పిచ్చివాళ్ళు చనిపోయిన తర్వాత చంద్రుని మీదకే పోతారట. అక్కడ్నుంచీ వాళ్ళు జన్మ జన్మాలకీ ఈ భూమి వైపు కోరికతో వాంఛలతో చూస్తుంటారుట. చూశావా ఆ తలం మీద ఎన్ని రాళ్ళున్నాయో పోగుబడి అలానే. ఆ తేజోమయ కాంతి అంతా వాళ్ళ స్వచ్ఛమైన మనస్సుల ప్రతిఫలమే. పాలలా మెరుస్తుండే కాంతి నువ్వెప్పుడైనా గమనించావా ? అప్పుడప్పుడూ చంద్రునికి దూరంగా ఒక వలయం కనిపిస్తుంది ఏడు రంగులతో. ఆ రంగులన్నీ వాళ్ళకి దూరం. ఒక్కోసారి ఆ ఆత్మలు ఆ వలయం మీద కూర్చుని కాళ్ళూపుకుంటూ ఈ లోకాన్ని చూస్తుంటాయి బాధతో".

ఎడ్వర్డ్ చెప్పడం ముగించి తన చేతిలోని మద్యపు గ్లాసుని బిల్డింగ్ మించి కిందికి విసిరేసాడు. రెండు మూడు క్షణాల తర్వాత అది భళ్ళున పగిలిన చప్పుడు వినిపించింది రోడ్డు మించి.

ఇకారస్ ఇదంతా విన్న తర్వాత తన్లో తాను ఆలోచనల్లో పడిపోయాడు. టెలిస్కోపు నుంచి అనాలోచితంగా దూరం జరిగాడు.

టెలిస్కోపు అప్పుడు నల్లగా, చిక్కగా కనిపించింది ఇకారస్‌కి.

19

టెలిస్కోపు వున్న ఆ ఇనుప నిర్మాణం మీదనే ఎవరి మౌనంలో వారు నిల్చున్నారు, కొంతసేపు.

వెన్నెల్లో కలలోని లోకంలా ఇళ్ళూ, అపార్ట్‌మెంట్లూ, ఖాళీ రోడ్లు, కదుల్తోన్న చెట్లు, అక్కడక్కడే పొడవాటి కొబ్బరి చెట్ల తలలు, మేఘాలు ... వాటిని చూస్తూ నిలబడ్డారు ఇకారస్, ఎడ్వర్డ్‌లు.

వాళ్ళ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ అప్పుడు వినిపించింది ఏదో పడిపోయిన చప్పుడు. ఎడ్వర్డ్‌కి అనుమానమేసింది మొదలు.

వెంటనే టెలిస్కోపును అందుకుని చప్పుడు విన్పించిన దిశగా తిప్పాడు. బ్యాంకు భవనం వద్ద ఎవరో తచ్చాడుతున్నారు. అక్కడంతా చీకటిగా వుండటం వలన టెలిస్కోపులో స్పష్టంగా కనిపించడం లేదు.

మెట్ల మీద నుంచి అతను ఏదో రోడ్డు మీదకు ఈడ్చుకువస్తున్నట్టుగా, అతని గుండు లీలగా కనిపిస్తోంది.

"పద అక్కడ జరగకూడనిదేదో జరుగుతోంది" అంటూ ఇకారస్‌ని తొందర పెడుతూ ఎడ్వర్డ్ కిందకు పరుగుతీశాడు.

అతని వెనకాలే ఇకారస్. అతనిలో చిన్నగా భయం, ఉద్విగ్నత మొదలయ్యాయి. బ్యాంకు భవనం దగ్గరే. టెలిస్కోపు భవనం నుంచి ఓ వంద మీటర్ల దూరంలో వుంటుంది.

ఆ పరిసరాల్లో అదే ఎత్తైన భవనం.

ఎడ్వర్డ్, ఇకారస్‌లు టెలిస్కోప్ ఎన్‌క్లేవ్ నుంచి రోడ్డు మీదకు వచ్చేసరికి భవనం మెట్ల వద్ద మంట ఉవ్వెత్తున లేస్తోంది.

ఆ మంట వెలుగులో అక్కడెవరో నీలపు జీన్ ప్యాంటు, తెల్లని షూలు వేసుకుని హడావుడిలో వున్నాడు. షర్టు వేస్కోలేదు. నున్నటి గుండుతో వున్నాడు.

స్ట్రోకర్‌కి నలభై ఏళ్ళుంటాయి.

గుండు గీయించుకున్నాడు. మీసాలు గడ్డం గీసుకోవడం వలన నున్నగా కనిపిస్తున్నాడు. ఇంకా బలిష్టంగా వున్నట్టు కనబడతాడు. చామనఛాయ రంగు దేహం. కానీ దగ్గరకంటా అతన్ని పరిశీలిస్తే అలసిపోయిన, శక్తిహీనమైన అతని వయస్సు కనిపిస్తుంది.

స్ట్రోకర్ ఎక్కడ్నుంచి వచ్చాడో ఏవూరో ఇకారస్, ఎడ్వర్డ్‌లకి తెలీదు. స్ట్రోకర్‌కి కూడా తెలీదు. తన జీవితమేంటో, గత చరిత్రేంటో ? తనెందుకు ఇలా అయ్యాడో? స్ట్రోకర్‌కి మాత్రం తన ఆలోచనలు చర్యలూ సరియైనవి గానే కనిపిస్తాయి. తను లోపలేమను కుంటున్నాడో తను ఏం చేయలేకపోతే జీవించి వుండలేడో అదే చేస్తున్నాడు. భౌతికంగా తనెప్పుడో చనిపోయాననీ, ఇది తనకి మూడో జన్మ అని తన నమ్మకం. కాబట్టి ఈ మూడో జన్మలో చేసిందే, అనుభవించిందే ఎందుకు చేయాలి? అనుభవించాలి ? ఈ దుఃఖానికంతటికీ కారణం ఎప్పటికీ ధ్వంసం కాని నిర్మాణాలేనని, సమూలంగా ధ్వంసం చేసి అన్నిటినీ శుభ్రంగా తుడిచేసి పచ్చటి ఛద్దర్ పరుచుకొని పడుకోవాలని అనుకుంటాడు.

ఇకారస్ స్ట్రోకర్ గురించి ఆలోచిస్తూ మెట్ల మీదున్న ఎడ్వర్డ్ దగ్గరకెళ్ళి "పిచ్చోడే కదా వాడు?" అనుమానంతో, స్ట్రోకర్‌కి వినబడకుండా అడిగాడు. ఉన్న పళాన పకపకా వ్యంగ్యంగా నవ్వాడు ఎడ్వర్డ్. నవ్వాపి, "పిచ్చోడే వాడు తెలియట్లా".

"తనెక్కడివాడో, ఏ వూరో, తనెలా యిక్కడికి వచ్చాడో అడుగుదామా అతన్ని" సూచనప్రాయంగా ఇకారస్.

"అడుగుదాము ఏంటి ? అడుగువెళ్ళి"

"అడిగితే ఎక్కడ కొడతాడేమోనని" ఇకారస్.

"ఏమీ కొట్టడులే. జీవం లేని వాటి మీదే అతని కోపం చూశావుగా?"

"నిన్నేమీ చేయడులే. అలా కన్పిస్తాడంతే. పైగా మధ్య వయస్కుడు !" వెళ్ళమన్నట్టుగా చూశాడు ఎడ్వర్డ్.

తగ్గుముఖం పట్టిన మంట దగ్గర గొంతుక్కూచుని వున్న స్ట్రోకర్ దగ్గరకెళ్ళి ఇకారస్ అడిగాడు వినయంగా

"ఎక్కడ్నుంచి వచ్చారు మీరు ?'

"చంద్రుడు నుంచి" స్ట్రోకర్.

'.....'

"అవును. చంద్రుని మీద నుంచే. రాళ్ళంట, ఆ మృత నిశ్శబ్దమంటే యిష్టం లేక బలం కొద్దీ, పెనుగులాడి దేనికో గుద్దుకుని లోయలో పడిపోయాను. అలా రెండు రెండు పల్టీలు కొడుతూ అలా పడుతూనే వున్నాను. అప్పుడు నాకే స్పర్శా లేదు. అదీ మళ్ళీ మీ మధ్యకు వచ్చిపడ్డాను. గోడకు కొట్టుకుని తిరిగొచ్చిన బంతిలా. నిన్ననే నాకు తెలివి వచ్చింది" కళ్ళు పైకెత్తి నవ్వుకుంటూ ఇకారస్ వంక చూసాడు స్ట్రోకర్.

"ఖచ్చితంగా వీడు పెర్వెర్టెడే". అని మనసులో నిశ్చయించుకున్నాడు ఇకారస్.

20

తెల్లవారుజాము నాలుగు గంటలవుతోంది.

స్ట్రోకర్ స్ఫింక్స్ నేషనల్ ఆర్ట్ గేలరీ లాన్‌లో వున్నాడు.

పాలరాతి శిల్పాలు చాలా వున్నాయా పార్కులో.

స్ట్రోకర్ మూడ్‌లో లేడు.

తనొక మాడ్‌ఫెలో అనే గిల్ట్ లోకి వెళ్ళిపోయున్నాడు. చూడ్డానికి స్ట్రోకర్ మాడ్ ఫెలో లాగే కనిపిస్తాడు. ఎందుకంటే అతని చేతలు హఠాత్తుగా మారిపోతుంటే ముఖకవళికలూ, లోలోపల బద్దలయ్యే ఆలోచనలూ విన్నవారికెవరికైనా అతడు పిచ్చివాడనే నిర్ణయానికి వస్తారు. ప్రతివిషయంలోనూ అతన్ని బోల్తా కొట్టిస్తూ మాట్లాడతారు.

స్ట్రోకర్‌కి తనమీద తనకే అనుమానం, ఆగ్రహం.

కొన్ని ఆలోచనల వల్ల తాను ప్రభావితం అవుతున్నాడన్నది స్ట్రోకర్‌కి తెలుస్తూనే వుంది.

ఎప్పుడూ గొడ్డలి పట్టుకుని తిరుగుతుంటాడు.

ఆరుబయట రోడ్డుమధ్యలో పడుకుంటాడు.

ఇకారస్, ఎడ్వర్డ్‌లు పరిచయమైనా వాళ్ళ యిళ్ళలోకి వెళ్ళి పడుకోడు. రోడ్డు మీద పడుకోడమే తనకిష్టం.

ఒక్కోసారి వాళ్ళని కూడా బలవంతం చేసి తనతో పాటు రోడ్డు మీద పడుకునేట్టు చేస్తాడు. అతని ఆలోచనలెప్పుడూ స్థిరంగా వుండవు. కొన్నిసార్లు వాళ్ళకి చెప్పకుండా నిద్రలోంచి లేచి వెళ్ళిపోతుంటాడలా. ఖాళీ వీధుల్లోకి వెళ్ళి రోజుకి రెండైనా మార్బుల్ శిల్పాన్ని ముక్కలు ముక్కలు చేస్తాడు.

నునుపైన శిల్పపు వెనుక తట్టున నిలబడి వీపు భుజాన్ని ఒక చేత్తో పట్టుకుని గొడ్డలితో కుడిపక్క భుజం దగ్గర్నుంచి నడుముపై కోస్తున్నట్లుగా గీసాడు స్ట్రోకర్. పాలరాతి శిల్పపు తల మాంసంలా విచ్చుకుని వెడల్పయ్యింది. నెత్తురేమీ కారలేదు.

శిల్పానికి దూరం జరిగి చూసేసరికి గాయం లోపల పచ్చని చెట్ల కొమ్మలు అప్పుడే వర్షం వెలిసినట్టుగా కదుల్తున్నాయి. చల్లగా ట్రాంక్విలిటీతో స్ట్రోకర్ చూస్తున్నాడు. కొంతసేపటికి ఆ చెట్టు పోయి ఆ ఖాళీ భాగంలోంచి కొండచిలవొకటి బయటకొచ్చి వీపు మీదుగా కదిలి మెడమించి తలలోకి వెళ్తోంది.

కొండచిలువ కూడా వెళ్ళిపోయింది.

ఒక తాళం చెవులగుత్తి గాయపు కింద అంచు మీద పడి కనిపించింది.

గుత్తినందుకుని చూసాడు స్ట్రోకర్.

చల్లగా ఐస్‌లా వున్నాయి.

వాట్ని గాయపు డొల్లలోకి విసిరేసాడు.

మరికొంతసేపటికి అందులో, ఒక సైకిల్ మీద నిక్కరుతో కుర్రాడు వెళ్ళిపోతుండడం కనిపించింది. ఆ తర్వాత పాముల పెట్టె, పైన నాగస్వరాన్ని ఎవరో నల్లని ముసలాడు తెల్లని తలపాగాలో ఊదుతూ కనిపించాడు.

ఆ దృశ్యాలన్నీ చీకాకు పెట్టాయి స్ట్రోకర్‌కి. వెంటనే దాన్ని నరికేద్దామనుకున్నాడు.

కానీ గొడ్డలితో మళ్ళీ మెడనుంచి వెన్నుపూస మీదుగా కోస్తున్నట్టుగా గీయడం మొదలుపెట్టి పిర్రలు మొదలయ్యే దగ్గర ఆపాడు.

కోసిన మేరకు రెండు మూడు అంగుళాల మేరకు విచ్చుకోవడం తనకి తెలుస్తోంది.

ఆతృతగా చూస్తున్నాడు తెరుచుకున్న భాగం వైపు.

కొద్దిసేపటికి ఒకదానిమించి ఒకటి పాకుతూ పోయే ఎర్రటి మిల్లీ పాడ్స్ లోపల్నుంచి బయటకొచ్చాయి. ఆ తర్వాత అవి పోయి వెన్నుపూసల్లాగే పెద్ద పెద్ద గోళీకాయలు ఒకదాని మీదొకటిగా వరసగా ఒకే లైనులో అమర్చి వున్నాయి మెడ నుండి పిర్రల వరకూ.

ఆ గోళీకాయలు రెండింటిని తీసుకోవాలనుకున్నాడు స్ట్రోకర్. తీస్తే అవన్నీ బయటకి పడిపోయి దొర్లుకుంటూ పోతాయని తియ్యలేదు.

కానీ చెయ్యిని ఆన్చి ముట్టుకున్నాడు; వేడిగా కాలుతున్నాయి. ఇవేమీ స్ట్రోకర్‌తో సంతృప్తిని కలిగించలేకపోయాయి.

ఏదో నిర్ణయానికి వచ్చినట్టు వంగుని కుడి పిర్ర మీద ఒక కిటికీ రెక్క మాదిరి కోసి దాన్ని తెరిచాడు. ఏమీ కనిపించలేదు. ఏమీ వినబడలేదు. కొన్ని నిముషాలు గడిచాక కుడిపిర్రలోంచి పెద్ద ఎత్తున గాలి వీస్తున్న చప్పుడు విన్పించింది. ఆకులు కూడా ఎక్కడ్నుంచో, దొర్లుతూ ఎగురుతూ వచ్చాయి పక్కనుంచి, తుఫాను సమయపు వాతావరణం నెలకొంది. నల్లటి మేఘాలు ఒకదాని మీద వొకటి ఎక్కుతూ కమ్ముతూ దూసుకొచ్చాయి. మేఘాలు దూసుకొచ్చిన కొద్దిసేపటికే ఏదో కొమ్మ విరిగిపోతున్న శబ్దం. ఆ చప్పుడు వెంటనే కొమ్మ వచ్చి పడింది. పిర్రలో వానలో ముసురులో తడిసి వుండడం వలన ఆకులు తేటగా పచ్చగా కనబడుతున్నాయి. స్ట్రోకర్‌కి ఒక రెమ్మని విరవాలనిపించి పిర్రలోకి చెయ్యిపెట్టాడు. లోపలంతా చల్లగా గాలి తగుల్తోంది. విరిచిన కొద్దిసేపటికే రెబ్బ మెత్తటి ఎముకగా మారి పోయింది. దాన్నందులోనే పడేసి చేతివేళ్ళకి అంటుకున్న ఎముక పొడరుని వాసన చూసాడు. కుళ్ళి కంపుగొడుతుంది.

ఓపిక నశించింది.

గొడ్డలి తీసుకుని పొడవైన బల్ల్‌గా వున్న తొడ మీద ఒక దెబ్బ వేశాడు. ఒక్క దెబ్బకే ముక్కలై శిల్పం కిందపడింది.

"మీరే కారణం, మీరే కారణం" కోపంగా పళ్ళు బిగించి అరుస్తూ శిల్పాన్ని ఒక్క తోపు తన్నాడు. తొమ్మిదించీలు కూడా కదల్లేదు శిల్పం.

"ఒక స్టాంపు వేసి మెడలో వేసారు కదా కార్డు. పిరికి వాణ్ణన్నారు, పనికి రానివాణ్ణన్నారు, చీత్కరించి చూశారు. ఆ కార్డుతోనే మొదలయ్యిందా చచ్చిపోయిందా జీవితం?" ద్వేషంతో నాలిక బయటకు తీసి దవడలు బిగించాడు. అప్పటికి అతని ఎడమ కాలు వక్షోజాలపై వుంది. గొడ్డలితో నరుకుతున్నట్టుగా ముక్కముక్కలు చెయ్యనారంభించేడు. ఒక దెబ్బతో శిరస్సుని నిలువునా చీల్చాడు. పగిలిన శిరస్సులోంచి కాగితపు వుండలు బయటపడ్డాయి. మెడా తలా కాళ్ళూ పాదాలూ అన్నీ సమస్తం నరికేసి ఆ ముక్కల్ని తీసుకెళ్ళి కాల్వలోకి పడేసాడు.

తనకేమీ నిమిత్తం లేనట్లుగా, కరుణతో ప్రేమతో చూస్తోన్న కళ్ళూ పెదాలూ ఒక్కొటొక్కటిగా నల్లని చిక్కని బురదలోకి మునిగిపోయాయి. మొత్తం కంప్లీటుగా ఏ ఒక్క చిన్న తుంపు లేకుండా ఏరి కాల్వలోకి విసిరేసాడు.

ఆందోళనతో అలసిపోయి స్పింక్స్ ఆర్ట్ గేలరీ మెట్ల మీద కూర్చున్నాడు. మనసు అదుపులో లేకుండా వుంది. ఆలోచనలో మునిగి దేన్నో చూస్తున్నాడు. తన లోపలిదే. తెల్లని కార్డు వూగుతోంది. తన మెడలోనే.

నెత్తురు! నెత్తురు. వెలుతురు పడుతోన్న గోడ మీదికి చిమ్మాలి. గొడ్డలి గుర్తుకొచ్చి యాంత్రికంగా చెయ్యిని జరిపి గొడ్డల్ని అందుకున్నాడు. ఆర్ట్ గాలరీ గుట్టదిగి వీధిలోకి అడుగుపెట్టాడు. యింకా తెలవారలేదు. నడుస్తూ నడుస్తూ బస్‌స్టాప్ షెల్టర్‌లో కూలబడిపోయి కొద్దిసేపటికే గాఢనిద్రలోకి వెళ్ళిపోయాడు.

దురదృష్టవంతుడు ఏ మాత్రం కదలిక లేకుండా మొద్దులాగా కొయ్యమొద్దులాగా పడున్నాడు. పిల్లలూ, స్త్రీలూ, యువకులూ తమ స్వర్గపు పాదాల్తో నిల్చొనే చోట. ఇప్పుడా బస్టాపులోకి ఎవరూ రాక ఎవరూ బస్సుల కోసం, ఎదురుచూడక వారం రోజులైంది. బస్టాపు కొంచెం ముందుకు ఖాళీ బస్సు మాత్రం ఆగి వుంది.

ఒక శవం లాగా పడున్నాడు స్ట్రోకర్.

కనుచూపుమేరా వెలితి. నిశ్శబ్దం.

ఎప్పటిలాగే తెల్లారింది.

దానికి వయసు లేదు. దిగులూ లేదు.

వీధి పొడుగూతా కదుల్తోన్న చెట్ల లాగా తెల్లారింది.

21

స్ట్రోకర్‌ని వెదుక్కుంటూ వచ్చిన ఎడ్వర్డ్ ఇకారస్‌లు బస్టాప్‌లో పడి వుండడం చూసి లేపారు. లేపవలసిన ఆవశ్యకత అవసరమూ వాళ్ళకి లేవు. ఈ ఆగంతుక నగరం గురించి వాస్తవాలేమన్నా అతను చెప్పగలడని వాళ్ళ నమ్మకం. రోజులు గడిచిపోతున్నాయి. పరిస్థితి చూస్తే తమకి కూడా పిచ్చిపట్టేట్టు వుందని వాళ్ళు గ్రహించారు.

స్ట్రోకర్ లేచి కూర్చున్నాడు.

ఇకారస్ అతని వంక బెరుకు బెరుగ్గా చూస్తున్నాడు. నిన్న రాత్రి స్ట్రోకర్ వాలకం చర్యలూ చూసినప్పటి నుండీ స్ట్రోకరంటే గొంగళిపురుగుని చూసినట్టు చూస్తున్నాడు.

ఎడ్వర్డ్ మాత్రం స్ట్రోకరంటే మొదట్నుంచీ స్నేహం, ఆదరణ చూపిస్తున్నాడు. స్ట్రోకర్‌కి దూరంగా వుంటూనే ఈ పిచ్చోడిపట్ల ఎడ్వర్డ్‌కి ఎందుకింత మమకారమో అర్థం కావట్లేదు.

"ఎక్కడికెళ్ళారు చెప్పకుండా" ఎడ్వర్డ్.

"నిన్నటి రాత్రి నుంచీ మనసేం బాలేదు. పీడకలలు, ఎవర్నో హత్యచేస్తున్నట్టు దేన్నో పగలకొడ్తున్నట్టు" స్ట్రోకర్.

"ఇక్కడెందుకు పడుకున్నారు? మా దగ్గరికి రావొచ్చు కదా ?" దగ్గరి బంధువులా మందలించాడు ఎడ్వర్డ్.

"ఇది నా డెస్టినీ నాయనా. డెస్టినీ ఎవరైనా వూహించగలరా ?"

"డెస్టినీ గురించి మాట్లాతారేంటి సార్ ఈ మృతనగరంలో ఇంకా డెస్టినీయా" ఎడ్వర్డ్.

"గత జన్మలో పాపాలు చేసుకున్నానేమో హంతకున్నై వుంటాను".

నిద్రమత్తులోనే భయంగా ముఖాన్ని రుద్దుకుంటూ "మిమ్మల్దిద్దర్నీ ఇంతకు ముందు చూసినట్టు గుర్తు. నిన్న మంట దగ్గర కనిపించారు. మీరేనా?" ఇకారస్ ఎడ్వర్డ్‌లను చూస్తూ అడిగాడు.

"నిద్రమత్తు మీకింకా దిగలేదు. పొంతనలేకుండా మాట్లాడుతున్నారు. రండి వెళ్దాం" ఎడ్వర్డ్.

స్ట్రోకర్ లేచి నీళ్ళ కుళాయి దగ్గరకెళ్ళి ముఖమూ గుండూ శుభ్రంగా కడుక్కున్నాడు.

"వేణ్ణీళ్ళింకా వస్తున్నాయి. యింకా రెండు రోజులైతే యివి కూడా రావు". స్ట్రోకర్.

ఎడ్వర్డ్ తన మెడలో వున్న టవలును అందించాడు స్ట్రోకర్‌కి.

"మీకేమైనా తెలిసిందా యిక్కడేం జరిగిందో?" ఇకారస్. ఇకారస్‌లో రోజురోజుకీ భయం పెరుగుతోంది.

"నా క్కూడా తెలీదు. ఈ నగరానికొచ్చినప్పటి నుండీ ఒక పిట్ట గూడా నాకు ఎదురవలేదు" మళ్ళీ స్ట్రోకరే అన్నాడు. "నేను చూసినంతమటుకు ఏదో వూహించనిదే జరిగింది. ఇళ్ళూ, షాపులూ అన్నీ తెరిచే వున్నాయి. వాటన్నింటినీ అలానే వదిలేసి పరుగులు తీసుంటారు. ఈవెన్ కారు డోర్లు కూడా తెరిచే వున్నాయి. మీరు గమనించారో లేదో. రోడ్లు మీద వెళ్తూ వెళ్తూ బైక్‌లు, సైకిళ్లూ పడిపోయి వుండడం చాలా దగ్గర్లో కనిపిస్తుంది. ఆసుపత్రుల్లో కూడా చూశాను. రోగుల మంచాలన్నీ డోర్ల దగ్గర స్టకప్ అయిపోయి వున్నాయి. ఈడ్చికెళ్ళినట్లుగా, సెలైన్‌బాటిల్లూ, స్టాండ్సూ వార్డులమ్మట పడున్నాయి".

"మేం కూడా అదే అనుకుంటున్నాం. హఠాత్తుగా జరిగిన సంఘటన అనీ" ఎడ్వర్డ్.

దీన్ని ముందుగా వూహించగలిగితే పరిస్థితి వేరే విధంగా వుండేదేమో?' ఇకారస్ వాళ్ళ సంభాషణల్లోకి వస్తూ.

"వూహించినా ఏం చేస్తారు ? జరిగేది మానవప్రయత్నం కన్నా బలమైనదైనపుడు" స్ట్రోకర్.

"మన విజ్ఞానం పనికిరానిదే అయిపోయింది?" అన్నాడు ఎడ్వర్డ్ బ్యాగుల షాపులో మెల్లగా కదుల్తోన్న బ్యాగుల్ని చూస్తూ.

"అది పనికిరానిదే మరి తెలియట్లే ?" స్ట్రోకర్ తనదైన ధోరణిలో మాట్లాడాడు ఏమీ పట్టనట్టు.

ఉన్నట్టుండి స్ట్రోకర్ ఒక సైకిల్‌ని ఎత్తి కార్ల మీదికి విసిరేడు.

ఇకారస్, ఎడ్వర్డ్‌లు దూరం జరిగారు.

"ఎందుకింత కోపం నీకు ?" స్ట్రోకర్‌ని అడిగాడు ఇకారస్.

"కోపమా ? ఇక్కడేమీ లేకుండా అన్నింటినీ పేల్చెయ్యాలి" ఇకారస్ వంక ఎర్రగా చూసాడు స్ట్రోకర్.

ఇకారస్‌కి అర్థమయ్యింది.

22

ముగ్గురూ విశాలమైన బాదంచెట్టు కింద నుండి వెళ్తున్నారు.

స్ట్రోకర్ ఏమీ మాట్లాడం లేదు.

ఎడ్వర్డ్ కూడా.

"అన్నా"

ఇకారస్ తనని అన్న అన్ని పిలిచేసరికి చిరాగ్గా ఏమిటన్నట్టుగా చూశాడు. ఇకారస్ తనని అన్నా అన్నందుకు లోలోపల ఆనందమేస్తోంది ఎడ్వర్డ్‌కి. ఎరుకలోకి వచ్చినప్పట్నుంచి ఎవరూ తనని అన్నా అని పిలవలేదు. ఈ మృత ఖాళీ నగరంలో బంధుత్వాలెందుకు ? దీన్లో వున్న అసంబద్ధత తెలుస్తూనే వుంది. దగ్గరత్వం పడనే పడదు. అసలు అసాధ్యం.

"గార్మెంట్స్ షాపుకెళ్దాం" అంటూ ఎత్తుగా వున్న అద్దాల షాపు వైపు చూపించాడు ఇకారస్.

"బట్టలపై కొత్తగా మోజుపుట్టుకొచ్చిందా ఇకారస్?" అన్నలాగా ఎదురు ప్రశ్నవేసాడు ఎడ్వర్డ్.

"మోజు కాదు. ఈ బట్టలన్నీ విప్పేసి కొత్తబట్టలేసుకోవాలనుంది"

"నిన్ననే కదా కొత్తవేసుకున్నావు" ఎడ్వర్డ్.

"అయినా సరే" ఇకారస్.

ముగ్గురూ మెల్లెకి బట్టలషాపులో కెళ్ళారు. ప్రత్యేకించి అది టీ షర్టులు మాత్రమే అమ్మేషాపు. చుట్టూ కలయచూసి మొదట్లో వెళ్ళిపోదామనుకున్నాడు ఇకారస్.

స్ట్రోకర్ వారించి "టీ షర్టులు బావున్నాయి. చూడది 'ఆఫ్రికన్ సఫారీ 35' పేరూ నెంబరూ సింబాలిక్‌గా వుంది. పైగా వైట్ కలర్ మీద నల్లటి అక్షరాలు. ఎడ్వర్డ్ నీకిది బావుంటుంది" అంటూ దాన్ని హేంగర్‌తో సహా తీసి ఎడ్వర్డ్‌కి చూపించాడు.

ఇకారస్‌కి మరొకటి తీసి ఇచ్చాడు. లేతపచ్చనిది. చూడ్డానికి ముచ్చటేస్తోంది. దాని మీద 'గ్రీస్' అని సముద్రపు రంగు అక్షరాలున్నాయి. దానిమీద కూడా నంబరుంది 30 అని. ఇకారస్ ఆ కొత్త గ్రీస్ టీ షర్ట్‌ని చూసి ఉప్పొంగిపోతూ లోలోపలే స్ట్రోకర్‌ని పొగిడాడు. స్ట్రోకర్ అంటే తనకి పడకపోయినా 'టేస్టున్న మనిషే' స్ట్రోకర్‌ని చూస్తూ అనుకున్నాడు.

స్ట్రోకర్ తనకోసం ఒకటి తీసుకున్నాడు.

నల్లటిరంగు టీషర్ట్. దాని మీద మంటల్లా మండుతూ. 40వ నెంబరు స్పష్టంగా కనబడుతోంది. దాని కింద వీక్ కలర్

"లోన్లీ ఐలాండ్" అన్న పేరు.

ఆ పేరు చూసి ఇకారస్ ఎడ్వర్డ్ లిద్దరూ బనాయిస్తున్నట్టుగా నవ్వారు.

స్ట్రోకర్‌కి అది అతికినట్టు సరిపోద్ది.

ఆ టీ షర్టుని చూడగానే ఇష్టపడ్డాడు స్ట్రోకర్.

23

ఆ ఖాళీ నగరపు గదిలో వోల్టేజీ పెరిగినట్టు పది గంటలకల్లా వెన్నెల మరింత తేజోవంత మయ్యింది.

చంద్రుడు సరిగ్గా ఆర్రోడ్ల కూడలి నెత్తిమీదున్నాడు.

విశాలమైన ఆ కూడలి మధ్యలో వాహనాలేమీ లేవు. ఒక పిల్లాడి సైకిల్ తప్ప.

వాహనాలన్నీ సిగ్నల్స్ దగ్గర ఆగిపోయి వున్నాయి.

ఆరు రోడ్లకి అది కూడలి కావడంవలన మధ్యలో వున్న స్థలం విశాలంగా వుంది.

అక్క చెల్లెళ్ళలా ఆ రెండు దారుశిల్పాలు వెన్నెలో పక్కపక్కనే నిలబెట్టి వున్నాయి.

స్ట్రోకర్ సలహాని పాటించి ఇంతకుముందు దూరంగా వున్న ఆ శిల్పాల్ని ముగ్గురూ నెట్టుకుంటూ చౌరస్తాలోకి చేర్చారు.

ఉదయం తొమ్మిదినుంచీ అదే పని. చాలా సులభంగానే అవి కదిలాయి.

ఐదారు బ్యాంకులు తిరిగి ఒక టిప్పర్ నిండా నోట్లని తెచ్చి దారుశిల్పాలు దృఢంగా అటూ ఇటూ వంగకుండా వుండేందుకు కాళ్ళచుట్టూ వాట్ని పేర్చారు. రెండడుగుల ఎత్తులో ఒక నలుచదరపు స్టేజి మాదిరి తయారయ్యింది.

"ఇప్పుడివి ఎక్కడికి పోవు. అయినా చెప్పలేం. పెనుగాలులొస్తే ఒరిగినా వొరగొచ్చు"

చేతులు దులుపుకుంటూ స్ట్రోకర్ అన్నాడు.

మధ్యాహ్నం నుంచి టిప్పర్‌లో తిరగడం వలన అలిసిపోయారు ముగ్గురూ. ప్రాణం ఒట్టిపోయినట్టుగా కూలబడ్డాడు స్ట్రోకర్. తనే ముందు తాగుదామనుకున్నాడు.

టిప్పర్ తీసుకుని ముగ్గురూ వెళ్ళారు 'వీనస్ స్టోర్'కి.

24

దారుశిల్పాల్ని తొలుత చూసినప్పటినుంచి స్ట్రోకర్ ఎందుకో చిరాగ్గా ఉన్నాడు.

"మీ ఇళ్ళేమీ బాగోలేదు. ఇలాగేనా వుంచుకునేది ఇళ్ళని?" కరుకుగా చూస్తూ అడిగాడు స్ట్రోకర్.

"ఇవేమీ మేం కట్టుకున్న స్వంత ఇళ్లు కావు" ఎడ్వర్డ్.

"మధ్యలో దొరికాయి అందులో వుంటున్నామంతే" ఇకారస్.

"మధ్యలో దొరికిన యిళ్ళా ? దొరికినవి మీ స్వంతమెలా అవుతాయి మరి?" స్ట్రోకర్ కళ్ళెగరేస్తూ వ్యంగ్యంగా.

"అందుకే ఏ అలంకరణలూ చెయ్యలేదు వాటికి" ఎడ్వర్డ్.

"మరెందుకుంటున్నారు దాంట్లో ? యాంత్రికంగా వుండాలనే వుంటున్నారు కదూ?" తప్పు పట్టినోడిలాగా స్ట్రోకర్ ప్రశ్నిస్తూ "అవకాశవాదులు మీరు" అని బయటకే అనేసాడు.

"అరచేతుల్లేవు, పాదాల్లేవు. మెడ లేదు. మీరే నరికేసారు. సరైన బట్టల్లేవు అలంకరణలు లేవు యెదవలు మీరు? వాట్ని దొంగిలించి వుంటారు ?' అంటూ ఇకారస్ ఎడ్వర్డ్‌లని పురుగుల్ని చూస్తున్నట్టుగా ముఖం పెట్టాడు.

ఇకారస్ ఎడ్వర్డ్‌లు ఒకర్నొకరు అపరాధ భీతితో చూసుకున్నారు.

చెయ్యని నేరం తమ మీద వేస్తున్నాడు, వీడికీ తమకీ సంబంధమేమిటి ? ఇకారస్ నిమ్మళించుకుని "నీవు తప్పు మాట్లాడుతున్నావు. యిళ్ళకీ మాకు సంబంధం లేదు. అవక్కడున్నాయి. అందులో వుండటం బయటకన్నా బావుంది. వుంటున్నామంతే!" తెగేసి చెప్పాడు.

"అవలా తయారవ్వడానికీ, అసంపూర్తిగా పడి వుండడానికీ మీ పూచీ ఏమీ లేదంటున్నారు. అదే కదా మీ వుద్దేశ్యం? మరి తలేం చేసిందయ్యా! తల మొత్తం పెకిలించేశారు అక్కడ్నుంచి" స్ట్రోకర్‌కింకా వాళ్ళిద్దరి మీదా అనుమానం తీరలేదు. వాట్ని ఛిద్రం చేసి నాటకమాడుతున్నారని అనుకుంటున్నాడు.

నిజానికి ఎడ్వర్డ్ ఇకారస్‌ల బాధ్యతేమీ లేదు. అందులో వాళ్ళిక్కడికి రాకమునుపే అవి అక్కడున్నాయి. యిప్పుడెలా వున్నాయో అప్పుడూ అలానే వున్నాయి. వాళ్ళు కొత్తగా వాటికి చేసిందీ చేర్చిందీ ఏమీ లేదు.

పగలంతా బయట తిరిగొచ్చి రాత్రుల్లు అందులో పడుకుని విశ్రాంతి తీసుకోవడం నిద్రపోవడం తప్పవాళ్ళేమీ చెయ్యడం లేదు. వూరికే వాళ్ళ మీద నెపం వేస్తున్నాడు స్ట్రోకర్.

స్ట్రోకర్ వ్యక్తిత్వాన్ని మనం వూహించలేం. ఒక్కోసారి ఇద్దరు ముగ్గురు మనుషులుంటారు తనలో. ఒకడు నేర స్వభావం కలవాడైతే మరొకడు మరీ సున్నితమైనవాడు. వీళ్ళిద్దరి మధ్యా మూడోవాడు నలిగిపోతుంటాడు. ఒక్కో సందర్భంలో తన మనస్సు బట్టి ఆ ముగ్గురిలో ఎవరో ఒకరిలాగా వుంటాడు. తన మీద తనే అనుమాన పడుతుంటాడు లేదా వేరేవాళ్ళని అనుమానిస్తుంటాడు. స్ట్రోకర్‌కి నలభై ఏళ్ళు వచ్చినా బలంగా వుంటాడు.

మనసెప్పుడూ స్థిరంగా వుండదు!

ప్రమాదకారి!

ఎప్పుడు ఎలా వుంటాడో చెప్పలేం!

అసహనంలో ఆవేశంలో వుంటాడు!

ఒక్కోసారి మధ్యాహ్నం పూట ఒక్కడే ఏడుస్తూ కూర్చుంటాడు ఖాళీ వీధిలో.

అప్పటికి, అందరికీ అన్నిటికీ దూరమైపోయినట్టు, గుండె బాధలో లోపలికి నొక్కుకు పోయి మెలితిరుగుతున్నట్టు అనిపిస్తుంది.

రెండు మూడుసార్లు చనిపోవాలని ప్రయత్నించాడు కానీ ఆ పని చేయలేక పోయాడు.

అంతర్లీనంగా పగతో ద్వేషంతో రగిలిపోతుంటాడు.

నలభై ఏళ్ళు వయసొచ్చేవరకు తను బతుకుతానని ఎప్పుడూ అనుకోలేదు. అతను వుంటున్నాడు. పెరుగుతూ పెద్ద వాడయ్యాడంతే.

ఈ నగరానికి బాగా చిన్నప్పుడే వచ్చానని ఎడ్వర్డ్ ఇకారస్‌లతో చెప్తుంటాడు. కానీ వాళ్ళు నమ్మరు. ఎందుకంటే అదే నిజమైతే ఇంతకాలమూ తనేం చేస్తున్నట్టు ? నగరం తనకేమీ నేర్పలేదా? ఎలా బతకాలో? ఏ మనిషికైనా నలభై ఏళ్ళు వచ్చేసరికి పెళ్లాం పిల్లలు సంపాదనా వుండి వుండాలి అనుకుంటారు ఎవరైనా. అది వాస్తవం కూడా.

కానీ ఈ కేసులో వాళ్ళకి నమ్మబుద్ధి కావట్లేదు. చిన్నప్పుడే మతిభ్రమించి యిక్కడికి వచ్చివుంటాడని వాళ్ళ అభిప్రాయం.

అందుకే అతను ఎక్కడ ఎలా వుండాలో, ఎలా మాట్లాడాలో అలాగే వుంటాడు. అంటీ అంటనట్టు.

అతనికి ఇబ్బంది కల్గించడం కానీ చిరాకు తెప్పించడం కానీ చెయ్యరు.

25

వెన్నెల పతాకస్థాయికి చేరుకుంది.

ఆ వెన్నెల్ని చూస్తే కత్తితో జున్నుని కొయ్యాలనిపిస్తుంది. జున్నుని తినాలన్పిస్తుంది.

గ్లాసుల నీడలు స్పష్టంగా, డ్రీమింగ్ గా కనబడుతున్నాయి. ఏం చెయ్యాలి ? ఎలా అన్వేషణ మొదలుపెట్టాలి ? వాళ్ళ ముందున్న సమస్యలు.

కొత్త టీ షర్టులతో ముగ్గురూ కొత్తగా హాయిగా వున్నారు. వెన్నెల్లో.

రెండో రౌండు పూర్తయ్యింది.

ఒకే గ్లాసులో ఎలీసియంనీ లెతెని కలిపి మొదట్నుంచి కాక్‌టెయిల్ తాగుతున్నారు ముగ్గురూ. స్ట్రోకర్ బలవంతం మీద.

కాక్‌టెయిల్ తాగడం ఇకారస్‌కి అదే మొదటిసారి.

చుట్టుపక్కల ఎక్కడా అలికిడి లేదు.

వెన్నెల్లో వరసగా విద్యుత్ స్తంభాలు, ఆ చివరికి చీకటివరకూ.

ఆ నిశ్శబ్దంతో చెట్ల చప్పుడు తప్ప ఏమీ లేదు.

"ఏంటా పుస్తకం ?" ఎడ్వర్డ్ తొడ పక్కనున్న పుస్తకాన్ని చూస్తూ అడిగాడు స్ట్రోకర్.

"ది సిక్ పీపుల్" ఎడ్వర్డ్.

"చదివేసావా?"

"లేదు. సగం వరకే, అంటే ఓ ముప్ఫయ్ పేజీల వరకూ చదివాను. ఇంకొక డెబ్భయ్ పేజీలుంటుంది"

గ్లాసు పైకెత్తి మళ్ళీ ఎడ్వర్డ్ అన్నాడు "బాగానే రాసాడు, అమెరికన్. అతని జీవితం అసంపూర్తిగానే ముగిసిపోయింది. ముప్పయ్ ఏళ్ళకే ఆత్మహత్య చేసుకున్నాడు. శాన్‌ఫ్రాన్సిస్కో గోల్డెన్ గేట్ బ్రిడ్జీ తెలుసా? ఆ బ్రిడ్జీ పూర్తిగా పై నుంచి చూస్తే చిక్కని నీలి జలాలు కనిపిస్తాయి. అంతెత్తు నుంచి మొదట బాకుతో పొడుచుకుని తర్వాత దూకేసాడు కిందికి"

'ఫ్రస్టేషనా?" స్ట్రోకర్.

"ఫ్రస్టేసన్ కాదు. ఎందుకు చనిపోయాడో తెలీదు. 'జెయింట్స్ ఆండ్ మోనస్టర్స్' అని తన మొదటి పుస్తకం. బాగానే అమ్ముడుపోయింది అమెరికాలో. అతను చనిపోయిన తర్వాత ఆ బ్రిడ్జీకి 'సిక్ బ్రిడ్జి' అని పేరుపెట్టాలని కొంతమంది అభిమానులు అమెరికన్ ప్రభుత్వానికి కోరారు. అదీ ఈ మధ్య ?"

ఇకారస్ ఏమీ మాట్లాడకుండా గ్లాస్ చేతిలో పట్టుకుని తలవంచుకున్నాడు. స్ట్రోకర్ అది గమనించి ఇకారస్‌ని కదిలించాలనుకుంటుండగా ఇకారస్ తన కొత్త గ్రీస్ టీషర్టుని మూడీగా తీసేసి దూరంగా విసిరేసాడు.

"ఏమౌతుంది?" ఎడ్వర్డ్

"యిష్టం లేదు" ఇకారస్.

"ఏంటి మద్యమా?"

"కాదు జీవితం"

ఎడ్వర్డుకి అర్థమయ్యింది. కాక్‌టెయిల్ ప్రభావం తెలుస్తోంది.

"యిక్కడెవరికి యిష్టం వుందని" ఎడ్వర్డ్ అనునయింగా అన్నాడు స్ట్రోకర్ వంక ఓరగా చూసి నవ్వుతూ.

"కాదు నేను నిజమే మాట్లాడుతున్నాను. యిష్టం లేదు. జీవితమంతా ఒక నెల రోజులకే కుదించేశాను. రెండో నెల ప్రారంభంలోనే అయిపోవాలి. లేదంటే రెండో నెలంతా ఎడారి అయిపోతుంది. అది నేను భరించలేను" అటు స్ట్రోకర్ వైపూ ఇటు ఎడ్వర్డ్ వైపు కాకుండా ఎటోవైపు చూస్తూ ముగించాడు ఇకారస్.

"నీవన్నీ భ్రమలే. నీ మీద నీకు నమ్మకం ఎక్కువ. నీవనుకున్నట్టుగా ఏదీ జరగదు". నలభైయ్యో నంబరు టీషర్టు వేసుకున్న స్ట్రోకర్.

"జరగాల్సింది జరిగి తీరుతుందని నమ్మకముంది. ఏదో ఒక రోజు ఈ చివురుని లావాగిన్నెలో పడేస్తాను" ఇకారస్.

"లావా గిన్నెలో పడేస్తావా ? అంత సులభంగా వుంటుందనుకుంటున్నావా? నేను చాలామందిని చూశాను. విఫలయత్నం చేసినోళ్ళని ఈ లోకం గుర్తించదు. వాళ్ళని దూరం పెడ్తుంది. చేతకాని వాళ్ళుగా చూస్తుంది. ఆ అవమానపు భారం మోయటం కష్టం. తలెత్తుకుని తిరగలేరు. ఎదురుపడిన వాళ్ళ కళ్ళల్లోకి సూటిగా చూడలేరు. వాళ్ళెవరు కానీ, బంధువులు పరిచయస్థులు, మిత్రులూ, తన ఈడువాళ్ళ అందరూ తనకన్నా ప్రతిభావంతులుగా, గొప్పవాళ్ళుగా కనిపిస్తారు. అప్పుడు వాళ్ళందరూ నీ లోపలికి వచ్చి నువ్వు వెనక్కి వచ్చేసిన దగ్గరికే నెడతారు సామూహికంగా. దాన్నెదిరించే శక్తి వుంటేనే వుండగలవు. లేదంటే అయిష్టంగా వెళ్ళిపోతావు'. స్ట్రోకర్ అనుభవజ్ఞుడిలాగా సముదాయిస్తూ, హెచ్చరిస్తూ మాట్లాడేడు.

"లేదు, ఈ విషయంలో నేను దృఢంగా వున్నాను. లోయలోకి పడిపోయే రాయిలాంటి విశ్వాసంతో వున్నాను ?" ఇకారస్.

"చనిపోవడానికి ధైర్యం కావాలి. ముఖ్యంగా కఠినమైన మొండితనం కావాలి. ఉప్పొంగే మీదకొచ్చే సముద్రంలాంటి మొండితనం". స్ట్రోకర్ కళ్ళు మెరుస్తున్నాయి.

కొంతసేపటికి ఇకారస్‌కి మద్యమెక్కువై మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు. స్ట్రోకర్, ఎడ్వర్డ్‌లు అతన్ని లేవనెత్తి నోట్ల స్టేజీ మీద వేసారు.

"ఏమైందో తెలియని ఈ దెయ్యాల నగరంలో ఇకారస్‌కి అలా అనిపించడం సహజమే". రోడ్డు మీద వెల్లకిలా పడుకుంటూ అన్నాడు ఎడ్వర్డ్.

స్ట్రోకర్ కూడా పడుకున్నాడు.

నక్షత్రాల్తో విశాలమైన నల్లని ఆకాశం ఊయల్లోలా పక్కకు కదులుతున్నట్టుగా వుంది వాళ్ళ కళ్ళ ముందు.

సమీపంలో వున్న తంగేడు చెట్లు ఒళ్ళంతా సన్నసన్నగా కదిలిస్తున్నాయి.

వెన్నెలో దారుశిల్పాలు సమ్మోహనం చేస్తూ నిల్చున్నాయి.

వెన్నెల్లో వక్షోజాలూ,

వక్షోజాల కింద నీడా.

నగరతలమంతా వెన్నెల్లో బోలుగా, పండుటాకు గాలిలో తేలిపోతున్నట్టు కలలోలాగా కన్పిస్తోంది.

ఒక నిశ్శబ్దపు భవంతుల లోయలాగా, దెయ్యాల వూరులాగా వుంది.

అంతవరకూ అరికాళ్ళని వూపుకుంటూ ఏదో ఆలోచిస్తూ వున్న స్ట్రోకర్ అప్పుడే నిద్రలోకి జారుకుంటున్నాడు.

సరిగ్గా అప్పుడు విన్పించింది!

తన చెవుల దగ్గర.

తెలుస్తూనే వుంది.

అడివి కొంగల గుంపులు; వాటి అరుపులు!

ఆ అరుపుల్లో అక్కడక్కడా మానవస్వరాలు!.

ఆ శబ్దాలన్నీ ఒకేసారి తన దగ్గరకి వచ్చి దూరమైపోతున్నట్టు.

లేవలేకపోతున్నాడు.

కాని ఏదో అనుమానం వేసి లేచి కూర్చున్నాడు. యింకా వినబడుతున్నాయి అరుపులు ఎక్కడ్నుంచో దూరం నుంచి.

'అవి కొంగల శబ్దాలు కావు మనుషులవే' మనసులో రూఢి పర్చుకున్నాడు స్ట్రోకర్.

స్పష్టంగా, అప్పుడప్పుడూ అస్పష్టంగా వినబడుతున్నాయి. మొత్తానికి ఏదో గోల మంద్రంగా వినబడుతోంది నిరాఘాటంగా.

ఎడ్వర్డ్‌ని నిద్రలేపాడు.

కొంచెంసేపు ఆగిపోయిన శబ్దాలు ఇప్పుడు మళ్ళీ విన్పిస్తున్నాయి.

ఇద్దరు తలలు పైకెత్తి ఆకాశం వైపు శ్రద్ధగా వింటున్నారు.

అంతా అయోమయంగా వుంది వాళ్ళకి.

చప్పుడు నల్లటి ఆకాశంలోంచే వస్తోంది.

కానీ నమ్మశక్యం కావడం లేదు.

"అది మనుషుల చప్పుడులాగే వుంది" స్ట్రోకర్.

"మనుషుల చప్పుడైతే పైనుండి, చుక్కల నుండి ఎందుకొస్తుంది?" ఎడ్వర్డ్

"యిక్కడే పక్కనుంచో ఎక్కడ్నుంచో రావొచ్చు'

చప్పుడు వస్తోన్న దిశగా చుక్కలవైపు తీక్షణంగా పరిశీలిస్తున్నాడు స్ట్రోకర్. "లేదు. అవి అడవికొంగలు. పెద్దపెద్ద గుంపులుగా అరుచుకుంటూ వెళ్తున్నాయి. చీకటి కదా అందుకే అవి కనబడ్డం లేదు" ఎడ్వర్డ్.

"మరి మధ్య మధ్యలో విన్పిస్తోన్న స్త్రీల, పిల్లల గొంతుల్లా వస్తోన్న అరుపుల మాటే మిటి?" స్ట్రోకర్.

"అవి పిల్లలనీ, స్త్రీలవీ కావు. అది నీ భ్రమ, నీ చెవుల భ్రాంతి"

స్ట్రోకర్ మాటల్ని కొట్టిపారేశాడు ఎడ్వర్డ్. పై నుండి కొంగల్లా వెళ్ళిపోతున్నవి మనుషులెలా అవుతారు ?

కొంతసేపటికి శబ్దాలు తగ్గుముఖం పట్టాయి.

పక్షుల హారం కనుమరుగైపోతున్నట్టుగా.

శబ్దాలు అంతమైపోయిన దిశగా చూస్తూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళు నిల్చున్నారు.

ఇకారస్ మాత్రం నోట్ల పరుపు మీద గాఢంగా నిద్రపోతున్నాడు. ఇవేమీ పట్టనట్టుగా వాళ్ళ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ టెలిస్కోపు భవనం అవతల సమీపంలోంచి తమనెవరో కొడ్తున్నట్టుగా స్త్రీల పిల్లల ఏడుపులు, అరుపులు విన్పించాయి.

ఆకాశంలోకి లేస్తున్నట్టుగా.

ఎడ్వర్డ్ ఎలర్ట్ అయిపోయాడు.

"పద" అంటూ టెలిస్కోపు భవనం వైపు వెళ్ళబోతున్న ఎడ్వర్డ్ బాహుదండాల్ని పట్టుకుని ఆపాడు స్ట్రోకర్.

అప్పటికే స్ట్రోకర్ ఆందోళనతో, భయంతో జాగ్రత్తగా చూస్తున్నాడు విద్యుత్ స్తంబాల పైన.

ఎడ్వర్డ్ కూడా స్ట్రోకర్ చూస్తోన్న వైపే చూశాడు.

పెద్ద పెద్ద వలయాకారపు గుర్తులు నడిచెళ్ళిపోతున్నాయి. వీధిపైన ఆకాశంలో. పాదాలు కానీ ఏమీ కనిపించడం లేదు. అడుగులు వెళ్తున్నట్టుగా అడుగుల రూపంలో ఖాళీ స్థలం మాత్రమే కనబడుతోంది. చప్పుడు కూడా లేదు.

చాలా సూక్ష్మంగా, ప్రత్యేకంగా చూస్తేగానీ అవి వెళ్తున్నట్టుగా కనిపించవు. స్ట్రోకర్ తన నిశిత దృష్టితో, సిక్స్‌సెన్స్‌తో తొలుత గర్తుపట్టగలిగాడు. యించుమించు పది ఏనుగుల పాదాలు ఒకేపాదంగా నడిస్తే ఎంత వైశాల్యం వుంటుందో ఒక పాదం అంత వుంటుంది. రాత్రి ఆకాశంలో బిల్డింగులకి యింకా పైన అవి వెళ్ళిపోతున్నాయ్. అలా వెళ్తూ వెళ్తూ పక్క వీధిలోకి మళ్ళాయి.

"మనం జాగ్రత్తగా వుండాలి. ఈ పాటికి అవి మనల్ని చూసే వుంటాయి. ఏ క్షణంలోనైనా మనం దొరికిపోతాం" ఎడ్వర్డ్‌ని హెచ్చరించాడు.

"గ్రహాంతర జీవులై వుంటాయి. పశువుల మంద వెనకాల నడుస్తున్నట్టు మనుషుల్నెక్కడికో తోలుకెళ్తున్నారు" స్ట్రోకర్

"ప్రశ్నలకీ, ఊహలకీ ఇది సమయం కాదు. సమాధానాలు నా దగ్గరే కాదు. యించెక్కడా దొరకవు. మనం చెయ్యాల్సింది అవెక్కడికెళ్తున్నాయో కనుక్కోగలగడం ట్రేస్ చెయ్యాలి కనీసం చిన్న క్లూ అయినా దొరకాలి".

ఆవేశంతో ఉత్సాహంతో అరిచాడు ఎడ్వర్డ్. "ఇప్పుడేం చేద్దాం ?"

"ముందు బైక్ స్టార్ట్ చెయ్"

ఎడ్వర్డ్ పరుగుపరుగున వెళ్ళి గోడకానించి వున్న ఎజ్డీని స్టార్ట్ చేశాడు.

అప్పటికే స్ట్రోకర్ మరొక బైక్ తీసుకొని సిద్ధంగా వున్నాడు.

ఇకారస్ ఆ చప్పుడికి కూడా లేవలేదు.

ఆ రెండు బైకులూ ఒక పక్కనొకటి ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ, పెద్దగా చప్పుడు చేసుకుంటూ వెళ్తున్నాయి.

చీకటి సందులు వచ్చినప్పుడు, వాటి పక్క నుండి వెళ్తున్నప్పుడు, అకస్మాత్తుగా మలుపు తిరిగినపుడు స్ట్రోకర్ జాగ్రత్తగా పరిసరాల్ని గమనిస్తున్నాడు. ఏ పక్క నుంచైనా ఎవరైనా ఏదైనా హఠాత్తుగా అడ్డం రావచ్చొనే తన సిక్స్‌సెన్స్‌తో.

పెద్ద అంగలు వేస్తూ వెళ్తోన్న అడుగులు వాళ్ళకి చాలాదూరమే ముందు వెళ్ళిపోయాయి. ఒక అంగ యిక్కడపడితే మరొక అడుగు రెండు విద్యుత్తు స్తంభాల తర్వాత పడుతోంది. అయినా వేగంగానే పోతున్నాయి.

సుమారు ఇరవై ముప్పయ్ జతల అడుగులు అలా వెళ్తున్నాయ్.

కొంతసేపటికి ఎత్తైన గడ్డ ఎదురైంది.

ఎడ్వర్డ్, స్ట్రోకర్‌లు వేగాన్ని పెంచారు.

రాత్రి మూడో నాలుగో అవుతోంది అప్పుడు. గడ్డ మీద బైకులు ఆపి నిల్చుని చూశారు. దిగువ వీధిలో ఏమీ కనిపించలేదు. ఇద్దరూ అలాగే నిల్చున్నారక్కడ దూరంగా చూస్తూ.

కొన్ని క్షణాలు గడిచిపోయాయి.

అవి వెళ్ళిపోయిన దిక్కు నుంచి ఇరుసు శబ్దం పెద్దగా దిక్కులు పిక్కటిల్లేట్లు ప్రతిధ్వనించింది. ఉరుమంత ధ్వనితో.

ఇద్దరి గుండెలూ ఒక్కసారి గుభిల్లుమన్నాయి.

మొదలైంది అనుకున్నారు.

బైకులతో దారుశిల్పాల దగ్గరికి వచ్చేప్పటికి ఇకారస్ లేడు.

26

ఉన్నట్టుండి వాతావరణమంతా చల్లగా అయిపోయింది. ఆకాశమంతా మేఘావృతమైంది. విశాలమైన కారునల్లని వానాకాశం ముందు తెల్లని ఎత్తైన భవంతులతో వీధి స్పష్టంగా తేటగా కనబడుతోంది. వెడల్పాటి తార్రోడ్డుకి ఇరువైపులా నిండా పూలు పూసిన తంగేడు చెట్లు, తురాయి చెట్లు ఒక వూపుతో ఉధృతంగా వీస్తోన్న గాలికి చప్పుడు చేస్తూ రోడ్డు మీదకి పూలని రాల్చుతున్నాయి విసురుగా.

రాలినపూలు తొందర తొందరగా కదులుతూ ఏదో ఒక మూలకి చేరుకుంటున్నాయి. మళ్ళీ అక్కడ్నుంచి మరోచోటికి. అవెళ్ళిపోయిన తర్వాత మళ్ళీ కొత్త పూలు.

చిన్న టిన్నొకటి తీసుకుని పెట్టిసైడ్సు షాపు మెట్లు దిగి రోడ్డు మీదకొచ్చాడు ఇకారస్. ఎడ్వర్డ్‌నీ, స్ట్రోకర్‌నీ నమ్మొద్దనుకున్నాడు. చివరికి దగా చేస్తారు. శక్తిహీనుల్ని చేస్తారు. యిరికిస్తారు.

ఆ టిన్‌ని నల్లటి క్యారీబ్యాగ్‌లో వేసాడు. ఆ బ్యాగ్‌లో అప్పటికే విస్కీ, కొన్ని సిగరెట్లూ, చేపముక్కలూ వున్నాయి.

సరైన స్థలం కోసం వెదుకుతూ వెళ్తున్నాడు.

నిన్నటి రాత్రి నుంచీ ఇకారస్‌కి మళ్ళీ మునుపటి దిగులు కమ్ముకుంది.

ప్రాణాన్ని ఎవరో బంధించినట్టుగా, బరువుగా నడుస్తున్నాడు. బ్రిడ్జీ మించి పడిపోతూన్న రచయితే పదే పదే గుర్తుకొస్తున్నాడు యింకా. నాలిక నిండా నీళ్ళు నింపుకోవాల నిపిస్తుంది.

ఆ నీలి జలాలు!

ప్రశాంతపు జలాలు!

డైమెన్షియా!!

షూ తొట్రుపాటు. ఇనుప కమ్మీధైర్యం!

పొడవాటి కరెంటు పోల్‌కి ఆనుకుని కూర్చున్నాడు వీధిలోకి చూస్తూ.

ఖాళీ వీధి వెనక నిండా నల్లని మబ్బులు పట్టిన ఆకాశం.

రేగిన అతని జుత్తులాగే చెట్లూ కదులుతున్నాయి దూరం వరకూ.

'సుఖజీవులు' వాట్ని చూస్తో, వాటి పూలని చూస్తో అనుకున్నాడు ఇకారస్.

'ఇక్కడికి ఎవరూ రారు. ఏ పాపాలూ వుండవు. భయాలకి అంతం'

టిన్‌లోంచి ద్రవాన్ని తీసి నీళ్ళ బాటిల్లో కొద్దిగా వేసాడు.

'ఇది చాలు'

బాటిల్లో విస్కీ ఎక్కువ మోతాదులో కలిపి అందులో చేపముక్కలు చిన్నగా తుంచి వేశాడు. తాగుతూ నములుకోవచ్చని. బాటిల్ నిండా నీళ్ళు నింపి మిగిలినవన్నీ అక్కడే వదిలేసి లేచాడు.

సగం వరకూ బాటిల్‌ని తాగేసాడు.

కాళ్ళు బరువెక్కిపోయాయి.

లోలోపలికి చూస్తో దేన్నో పట్టుకుంటున్నాడు.

'ఏడుస్తూ ఎవరూ రావొద్దు వెళ్ళిపొండి' అంటూ చేతుల్ని అటూ ఇటూ విసుర్తున్నాడు, ఎర్రబడ్డ కళ్ళతో.

మోచేతుల మీద చర్మాన్ని బరుక్కుంటూ కొండల్లా వరసగా మణికట్టు వరకూ లేస్తోన్న రొమ్ముల్ని వేళ్ళతో ఊడ్చి పక్కనున్న పూలచెట్టు ఆకుల మీదికి చిమ్ముతున్నాడు.

గులాబీ రంగు ద్రవాన్ని భరించలేకున్నాడు.

ఉన్నట్టుండి

భూమి దిగువునుండో

శివారు వీధి నుండో

చెవులు బ్రద్దలయ్యేటట్లు 'సైరన్' ప్రతిధ్వనించింది ఒక్కసారి.

స్టీలు రాక్షసి అరుపులాగా 'కీ'మంది.

కళ్ళు తిరుగుతున్నాయి.

27

ఎంత సేపయ్యిందో తెలీదు.

ఇకారస్ ఒక గొయ్యిలో పడున్నాడు శవంలాగా.

లోపలంతా ఏదో తిరుగుతోంది.

ఏవేవో తెలుస్తూనే వున్నాయి.

తన్లోంచి తను వేరై వెళ్తోన్నట్టు దృశ్య భ్రాంతి.

తమకు తాము ఏదో ఉద్దేశ్యంతో కదిలి ఈ భవంతులన్నీ తన మీదికి వస్తున్నట్టుగా భయం.

లోయల మధ్య కొండల, గుహల్లోపల వున్నాననుకుంటున్నాడు.

"నీ పని అయిపోయింద"ని అనుకుంటున్నాడు ఇకారస్.

'పని అయిపోయిందని' లోయల్లోంచి శబ్దం తిరిగి వినబడుతోంది, మాటకి మాట తనకి తెలుస్తునే వుంది.

'జీవితంలో నువ్వు ఓడిపోయావా?' అని అనుకుంటూంటే –

'నువ్వు ఓడిపోయావా' ఆ ప్రశ్నే తనకి వేస్తున్నాయి కొండలు.

'దీనికంతటికీ అమ్మేనా కారణం ?'

'అమ్మేనా కారణం ?'

మాటలు తిరిగొచ్చి ఓదార్పుగా అడుగుతున్నాయ్.

'.... భయమా నీకు ?'

'భయమా నీకు ?' మళ్ళీ ప్రతిధ్వని.

మాట్లాడే దుష్టగుహలున్నాయేమో లోపల.

స్పృహ లేకుండా కలలోలాగా పడున్నాడు.

గొయ్యిలో యిసుక కదలడం ప్రారంభించింది. సముద్రపు యిసుక తెలుస్తూనే వుంది.

గరుకుగా బలిష్టంగా తననెవరో లాగేస్తున్నారు.

అనేకానేక మెత్తని చేతులతో ఆతృతతో, మోహంతో.

నీళ్ల అడుగుకి తొక్కి పెడ్తున్నారు. మెడ ఎత్త లేకపోతున్నాడు ఇకారస్.

వెళ్ళిపోతున్నాడు తనెక్కడికో.

మళ్లీ చూడలేనా ఎడ్వర్డ్‌నీ, స్ట్రోకర్‌నీ.

ఆ వీధుల్లోకి మళ్ళీ రాలేనా, మళ్ళీ మాట్లాడలేనా మీతో.

మాటలు, మాటలు, స్నేహపు మాటలు. స్వర్గపు మాటలు.

సముద్రపు యిసకలో క్రమంగా కాళ్ళూ నడుమూ గొయ్యి లోపలికి వెళ్ళిపోతున్నాయి.

తల కూడా లోపలికి పూడ్చుకుపోయింది.

ఇకారస్ చేతులు అశక్తంగా విషం కలిపిన నీళ్ళ బాటిల్‌ని అక్కడే వదిలేసి లోపలికి వెళ్ళిపోయాయి.

మరికొంత సేపటికి, పాదాలూ, తొడలూ, పేవులూ, వృషణాలు, ఊపిరితిత్తులూ నీళ్ళతో నిండి బరువెక్కి పోయాయి.

బలమైనదేదో తను కోరుకున్నదేదో, తనని కిందికి తొక్కుతోంది.

ఆశ లేదు. ఆశ నిండా నీళ్ళు.

28

తను మరణించాడన్న స్పృహ ఇకారస్‌కి లేదు.

విషం మింగిన సంగతీ తనకి గుర్తులేదు.

ఇప్పుడంతా తను కొత్తలోకంలో వున్నాడు.

గాలి హాయిగా, అన్నీ అంతా రెపరెపలాడుతున్నట్టుగా వుంది.

తెల్లని టర్కీటవలుతో జుత్తుని తుడుచుకున్నాడు.

ఓ ఇరవై ఏళ్ళ యువతి, తనకి ఎప్పట్నుంచో పరిచయమున్న స్నేహితురాలిలాగా, తను ఆమెకి ఎంతో దగ్గరవాడిలాగా నవ్వుతూ వచ్చి టవలు చేతుల్లోంచి అందుకుంది. పక్కనున్న నీలం రంగు బండ మీదనున్న గోధుమరంగు దుస్తుల్ని తీసి ఇకారస్‌కి ఇచ్చింది. లాల్చీలాగా కాళ్ళవరకూ వుండే వస్త్రం; ఎడారుల్లో మగవాళ్ళు వేసుకునేది.

ఆమె వెనుదిరిగి టేబిల్‌ని తీసుకుని చెట్టునీడలో పెడుతోంది.

అప్పుడు చూశాడు ఆమెని.

గోధుమరంగు ముతకచీర కట్టుకుని వుంది. జాకెట్టు వేసుకోలేదు.

చీర కొంగుని అధరాల చుట్టూ వేసుకుంది.

బాగా కాల్చిన గోధుమ రొట్టెలు, చిక్కని తోటకూర సూపూ మట్టిగిన్నెలో తెచ్చిపెట్టింది. ఇకారస్ ఆమె చెక్కిళ్ళు చూస్తూ దృష్టి మరల్చుకోలేకపోతున్నాడు. ఆమె నిండైన పెదవులూ, గుండ్రటి ముఖమూ, కళ్ళూ, ఏదో సువాసన. మత్తెక్కించే సువాసన. తనని ఎక్కడో చూసిన గుర్తు, పదేళ్ళు, ఇరవై ఏళ్ళు, ముప్పయేళ్ళు వెనక్కి తీసుకెళ్తున్నాయి. ఆమె చూపులూ చేతులూ గుర్తుకు రావటం లేదు. ఎప్పటికాలం గుర్తులో ?

'ఆమె చనిపోయిందా? లేదు కదా ?'

లేతగాలికి శిరోజాలు ఆమె ముఖం మీదికి పడుతుండగా నిదురమత్తులో వీధిలోకి చూస్తూ ఇకారస్‌కి ఎదురుగా కూర్చొంది.

నిర్మలంగా ఆనందంగా వున్న ఆమె వదనంలో అంతర్లీనంగా విషాదఛాయ కదులుతోంది.

"అవును ఆ అమ్మాయే ఈమె ! ఓ ఇరవై ఏళ్ళక్రితపు కాలి అందెలు.. ఆమె ఆమే !'

ఇకారస్ ఉండబట్టలేక అందమైన ఆమె అరచేతిని చేతుల్లోకి తీసుకున్నాడు.

శిల్పంలాగా బరువెక్కింది చెయ్యి.

వేళ్ళతో రాసి చూసాడు.

శిల్పం చెయ్యిలాగా నునుపుగా వుంది.

ఇకారస్ గుండె మొద్దుబారిపోయింది.

ఆమె నవ్వుతోంది!

మిగతా శరీరము, ముఖము, కళ్ళూ, జీవంతోనే వున్నాయి!

తను పట్టుకున్న చెయ్యి మాత్రం బరువెక్కిపోయింది. పాలరాతి చెయ్యిగా మారిపోయింది. భుజాల మీద చెయ్యివేశాడు. భుజాలు కూడా నునుపుగా గట్టిగా తగిలింది. ఆమె వంక చూశాడు. గులాబీ పెదాలతో చిర్నవ్వు నవ్వుతోంది.

Sternum మీద ఎవరో గొడ్డలితో బలంగా కొట్టినట్టయ్యింది ఇకారస్‌కి.

'లోపల దుఃఖమేదో బ్రద్ధలౌతోంది,ఈ జన్మలోనూ దుఃఖమేనా,ప్రేమ రాహిత్యమేనా?'

ఆమె నుండి దూరంగా, దూరదూరంగా జరిగిపోయాడు.

అటో ఇటో ఎటో ఒకవైపుకు నడవడం ప్రారంభించేడు ఇకారస్.

భూమి కింద ఆ వీధిలో అందరూ ఆమెలాంటి స్త్రీలే. సాదరంగా నవ్వుతున్నారు. హాయ్ అంటూ ఉత్సాహంగా పలకరిస్తున్నారు. అవే గోధుమరంగు చీరలు. ఎవరూ జాకెట్లు వేసుకోలేదు.

భూమి కింద లోకమది!

ఇళ్ళన్నీ చెట్ల కొమ్మలతో ఆకులతో పచ్చగా వున్నాయి వరసగా.

వడ్రంగి దుకాణం, రొట్టెలు తయారుచేసే దుకాణం, వనమూలికలమ్మే దుకాణం. కేరట్లు అమ్మే దుకాణం... ఇలా అన్నీ వరసగా వున్నాయి. అన్నింటి మీద 'వేకన్సీ' 'వేకన్సీ' అన్న బోర్డు వేలాడుతోంది.

'ఇక్కడ మీ యిష్టమైన పనిలో మీరు చేరొచ్చు' అన్నట్టుగా వుంది అక్కడ వాతావరణం. ఇకారస్ అలా వెళ్తూ వెళ్తూ ఒక పెయింటింగ్ దుకాణంలో కుదిరాడు. అక్కడే వుండడమూ అక్కడే పని. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఖాళీ సమయాల్లో మైదానం ముందు నిల్చుని ఒంటరిగా గడిపేవాడు. పచ్చటి మైదానం కనుచూపుమేరా ఆ లోగిళ్ళకి ఆనుకునే వుంటుంది. ఆ ప్రదేశమంతా చాలా ఎత్తులో వున్నట్టుంది. అక్కడ్నుంచి దిగువకి ఒకటే రోడ్డు వుంది.

"బావున్నావురా ? ఎన్ని సంవత్సరాలైందిరా నిన్ను చూసి" సమీపంలోంచి ఆర్ద్రంగా ఓ స్త్రీ గొంతు !

ఉన్నట్టుండి రెప్పలో కన్నీళ్ళు జలజల మెరుస్తూ నిండాయి.

"నా కాళ్ళు నేనే నరుక్కున్నాను" అనుకున్నాడు ఇకారస్.

"అమ్మ నీ కోసం ఏడుస్తోందిరా. ఒకసారి చూసిరా అమ్మ మళ్ళీ నీకు దొరకదు" మళ్ళీ ఆమే, యింకా సమీపంలోంచి.

"ఇప్పుడు మీరెక్కడుంటున్నారు ?" ఇకారస్ ప్రశ్నించాడు.

మైదానంలోకి వెళ్తోన్న రోడ్డు వంక చూపించింది.

'లోయకవతల'.

ఆ మర్నాడు ఇకారస్ పెయింటింగ్ లోగిలిలో ఓ ముసలామె ముందు నిల్చున్నాడు. ఆ లోగిలికి ఆమె పెద్ద. శిరోజాలన్నీ తెల్లబడ్డాయి. ముఖంమాత్రం జీవంతో తొణికిసలాడుతోంది.

"రేపట్నుంచీ నేను పెయింటింగ్స్ వేస్తాను"

ఇకారస్ అభ్యర్థనగా దృఢనిశ్చయంతో అడిగాడు.

"మోడలుందా ?" ఆమె నవ్వుతూ అంది.

ఇకారస్ బదులు చెప్పలేదు.

"మీ ఇష్టమైనవాళ్ళని అడగండి. అడిగితే కాదనరు"

"తెలుసు... ఇవాళ సాయంత్రమే వెళతాను" ఇకారస్.

"ఆమె దూరమైతే ఆ స్కేట్స్ వేస్కుని వెళ్ళండి. ఇక్కడ సైకిల్లుగానీ ఏమీ వుండవు. దూరం వెళ్ళాలంటే స్కేట్స్ మీదే వెళ్ళాలి."

అంటూ ఆ ముసలామే స్కేట్స్ వున్న లోగిలి వైపు చూపించింది.

పక్షి రెక్కలూపుతున్నట్టుగా చేతులూపుతూ స్కేట్స్ మీద నునుపైన రోడ్డు మీద జారుతూ చాలా దూరం వెళ్ళిపోయాడు.

29

టెర్రాస్ మీద టెలిస్కోపుని పట్టుకుని ఎదురుచూస్తోన్న ఎడ్వర్డ్‌కి సరిగ్గా నిన్నటి ఆ సమయానికి గుంపులు గుంపులుగా అరుపులు వినిపించాయి.

ఆ అరుపుల్లోంచి ఏవేవో శబ్దాలు ప్రత్యేకంగా వినబడుతున్నాయి.

ఎడ్లబండి గతుకుల రోడ్డు మీద వెళ్తున్నట్టుగా -

సుత్తితో దేన్నో మోదుతున్నట్టుగా -

యంత్రాల చప్పుళ్ళు!

పెళ్ళి క్లారినెట్ల, సింబల్స్ శబ్దాలు వినబడుతున్నాయి.

స్పష్టంగా వినబడుతున్నాయి. రాత్రి ఆకాశం వైపు చెవులు రిక్కించి విస్తు బోతున్నాడు ఎడ్వర్డ్. పై నుండి కిందికి వస్తోన్న ఊయల కదలికలాగా ఒకసారి మంద్రంగా మరోసారి బిగ్గరగా వస్తున్నాయి.

ఎడ్వర్డ్‌కి గుండెల్లో సన్నగా భయం మొదలయ్యింది.

'అవి నా కోసం రావట్లేదు కదా ?' మనసులో అనుకున్నాడు.

టెలిస్కోపుని సరిగ్గా అరుపులు వినవస్తోన్న వైపే లెన్స్‌ని క్లియర్ చేసి జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు.

ఒక అడుగంత సైజులో మానవదేహాలు దొర్లుతూ విసురుగా పోతూండడం గుర్తు పట్టాడు.

అవి మానవ దేహాలని తొలుత అనుకోలేదు.

మామూలు కంటికైతే అవి కనిపించవు. టెలిస్కోపులో మాత్రమే గుర్తించే వీలుంటుంది.

అవి పెనుగులాడుతున్నట్టుగా కదలడాన్ని బట్టి దేహాలన్నీ బతికే వున్నట్టు తెలుస్తోంది.

"ఎప్పట్నుంచి జరుగుతుందో ఇది ?" టెలీస్కోపు దగ్గర్నుంచి లేస్తూ అనుకున్నాడు ఎడ్వర్డ్. ఊపిరి బిగపట్టాడు.

"మెడ విరిగిపోతోంది ... చావు తప్పదా ? నిజమేనా నా చావు ?'

తన్లో తాను అనుకుంటున్నాడో లేదో, దేన్నో సమీపంలోనే ఉన్న ఫళాన తాకుతున్నట్టుగా సముద్రపు ఘోష ఒక్కసారి విన్పించి నిశ్శబ్దమై పోయింది.

"ఇక్కడ సముద్రమా ?"

భయంతో తెల్లబడింది మనస్సు. సముద్రపు పొంగులా.

"సముద్రం దగ్గరికి వస్తున్నట్లుంది. ఈతరాదు దొరికిపోతాను"

టెర్రాస్ అంచు దగ్గరకెళ్ళి కిందికి చూసాడు.

కింద రోడ్డు మీద దారుశిల్పాల ముందు కుర్చీల్ని పేర్చుతున్నాడు స్ట్రోకర్.

తుఫాను రాకడ తెల్సిన పక్షుల్లాగా, జంతువుల్లాగా తయారైపోయాడు స్ట్రోకర్. నిలకడ లేదు. చేయాల్సినవేవో చెయ్యాలన్న తపన.

"ఆ తపనలో ఏం చేస్తున్నాడో తనకే తెలీటం లేదు. పాపం".

టెలీస్కోపు భవనం మెట్లు దిగి స్ట్రోకర్ దగ్గరకెళ్ళాడు ఎడ్వర్డ్. "విన్నావా ?'

"విన్నాను. సముద్రం. ఈ మాయానగరాన్ని ఢీ కొట్టినట్టుంది" స్ట్రోకర్ జవాబిచ్చేడు కుర్చీల్ని వేసుకుంటూ.

స్ట్రోకరేదో వెర్రిపని చేస్తున్నాడని ఎడ్వర్డ్‌కి అర్థమైపోయింది.

ఒకవైపు పది కుర్చీలు మరోవైపు పది కుర్చీలు ఎడం ఎడంగా వేసాడు.

దారుశిల్పాలు చూట్టూ వేసిన నోట్లకట్టలే స్టేజీ. ఆ స్టేజీ మీద సినిమా తెరని పరిచాడు. మొన్న రాత్రి బాగా తాగిన తర్వాత సినిమా థియేటర్‌లోకి దూరి బర బరా చింపి ఈడ్చుకొచ్చాడు దాన్ని. పనికిరాని ఆవేశాలు. అలాంటి ఆవేశపు పనేదో చేస్తాడిప్పుడు.

ఎడ్వర్డ్‌కి ఓపిక నశించింది. ఇకారస్‌ని వెదుకుతూ మధ్యాహ్నం వరకూ ఎండలో తిరగడం వలన బాగా అలసిపోయాడు. చావు భయం, సముద్రమూ ఈ ఆలోచన్లతో నీరసించి కాళ్ళు సాపుకుని రోడ్డు మీద కూర్చున్నాడు, స్ట్రోకర్‌ని చూస్తో.

కుర్చీల్ని పేర్చడం అయిపోయిన తర్వాత స్టేజీ మీద ఎర్రని ఇనుప స్టూలు వేసి దాని మీద నిల్చుని మైక్‌లో మాట్లాడడం ప్రారంభించాడు. ఖాళీ కుర్చీలతో.

"డెడ్ ఫెలోస్!! క్షమించండి. నేను మాట్లాడాల్సింది ఇలా కాదు" అని కాసేపు ఆగాడు.

ఆ ఖాళీ వెన్నెల నగరంలో మొట్టమొదటిసారిగా మైక్ గొంతు ప్రతిధ్వనించింది. మాటలు నగరతలం మీదకి పాకాయి.

ఎడ్వర్డ్ స్ట్రోకర్‌ని చూస్తూ కూర్చున్నాడు.

"రకరకాల మనుషులున్నారిక్కడ. భిక్షగాళ్ళూ, రోడ్లను వూడ్చే వాళ్ళూ, పాయఖానాల్నీ, ఉచ్చలదొడ్లనీ కడిగేవాళ్ళు, భవనాల్ని నిర్మించేవాళ్ళు, ఫ్యాక్టరీల్లో ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నవాళ్ళు, హోటల్ పనివాళ్ళు, వేశ్యలు, పూలమ్ముకునే వాళ్ళు, ఆఫీసు బాయ్‌లు, సెక్యూరిటీగార్డులు, భయస్థులు మానసిక రోగులు, ఆత్మహత్యలకు విఫలయత్నాలు చేసిన వాళ్ళు, పారిపోయినవాళ్ళు, కాలాన్ని వ్యర్థం చేసినవాళ్ళు, పెళ్ళి కాని వాళ్ళు, భవిష్యత్ చీకటి నోరు ముందున్న వాళ్ళు, ఎటుపోవాలో దిక్కు తెలియనివాళ్ళు, జీవితాన్నీ రాత్రుల్ని ఎవరెవరి సుఖాలకో అర్పించినవాళ్ళు, తాగుబోతులు, యంత్రాల మధ్య పడిపోయి యంత్రభాగాలైపోయిన వాళ్ళు, కలల రాకుమారులూ ఎందరో వున్నారు. హంతకులున్నారు."

"మీలో గొప్పవాళ్ళున్నారు, దైవ సమానులు, క్రమశిక్షణ, నియమ నిబంధనలు గలవాళ్లు, ఆదర్శులు, తెలివైనవాళ్ళు ధనికులున్నారు."

స్ట్రోకర్ ఎడ్వర్డ్ వైపు చూసి కనుగీటాడు.

"సరదా, టైం పాస్"

ఎడ్వర్డ్ కూడా నవ్వేడు. చిన్నగా.

స్ట్రోకర్ టై సవరిస్తున్నట్టుగా యాక్షన్ చేసి, గొంతు సవరించుకున్నాడు. "ఒకప్పుడు మీరందరూ శాశ్వతం, ఒక కార్మికుడు చనిపోతే ఆ స్థానంలో మరొక కార్మికుడు. ఒక భిక్షగాడు చనిపోతే ఆ స్థానంలో యింకొక భిక్షగాడు. ఒకడు ఆత్మహత్య చేసుకుంటే అక్కడ మరొకడు. ఇదిలా జరుగుతూనే వుంటుంది. వస్తూనే వుంటారు. పోతూనే వుంటారు. పిశాచి నగరమిది. రాళ్ళ ప్రేగులు దీనివి. ఇనుపకోరలు దీనివి. ఎవరి ఆనందం కోసం వచ్చారిక్కడికి" అంటూ ఖాళీ కుర్చీని ఒక్క తాపుతన్నాడు.

ఉన్నట్లుండి స్ట్రోకర్ డీజిల్ డబ్బా చేతుల్లోకి తీసుకుని కుర్చీల మీద జల్లి నిప్పంటించాడు.

'పిచ్చ నా కొడుకు. వాడ్ని ఎవడూ ఏం చెయ్యలేదు' స్ట్రోకర్‌ని తిట్టుకుంటున్నాడు లోపల ఎడ్వర్డ్.

ఎడ్వర్డ్ దగ్గరకొచ్చి 'ఏదో టైం పాస్' అన్నాడు స్ట్రోకర్.

ఆ ప్రదేశమంతా ప్లాస్టిక్ పొగా, ప్లాస్టిక్ కాలుతున్న వాసనా కమ్ముకుంది. నల్లటి పొగలు.

30

టీ హోటల్‌లో సిగరెట్ త్రాగుతూ మాట్లాడుకుంటోన్న ఎడ్వర్డ్, స్ట్రోకర్ ముఖాలకి అకస్మాత్తుగా చల్లగాలీ, వర్షపు వాసనా తగిలాయి. హోటల్ నుంచి బయటకొచ్చి నిల్చున్నారు.

అలాంటి మేఘాన్ని ఎప్పుడూ చూడలేదు వాళ్ళు.

కడు భయంకరంగా నీళ్ళు నిండిన నల్లటి బూరల్లాగా బరువుతో వేలాడుతున్నట్టు వుంది. భవనాల పైన సమీపంలోనే దిగినట్టుగా కనిపిస్తోంది.

నగరతలమంతా ఒకే మేఘం. నల్లని సముద్రంలా.

కారు నల్లని రాళ్ళలా బీటు వారి ఉబ్బిన మబ్బులు.

మార్బుల్ తలంలా నునుపుగా మెరుస్తోన్న మబ్బులు. పెనుభీతి అలుముకుంది.

చెట్ల ఆకులు తళతళా కదిలాయి గాలికి సంజ్ఞలా.

వున్నట్టుండి ఆకాశం ఎక్కడో ఓ మూల విరిగిపడినట్టుగా పెద్ద శబ్దం.

ఎడ్వర్డ్, స్ట్రోకర్‌లు పరుగుతీసారు భయంతో దారుశిల్పం దగ్గరికి చేరుకున్నారు.

తాడు నిచ్చెనని తీసి పైకెక్కడం ప్రారంభించేడు ఎడ్వర్డ్.

ఎడ్వర్డ్ పైకి ఎక్కేవరకూ కిందనుంచున్నాడు స్ట్రోకర్.

దారుశిల్పపు నునుపైన దేహం మెరుస్తోంది.

ఇళ్ళల్లోని, ఇళ్ళ సందుల్లోని చెత్తా చెదారమూ చిన్నపిల్లల బట్టలూ ప్లాస్టిక్ సంచులూ టవల్లూ గాలికి లేచి రోడ్డు మీదికి కొట్టుకొస్తున్నాయ్.

కార్లూ వాహనాలూ దెయ్యాల్లాగా నిలబడి వున్నాయి ఎక్కడివక్కడే.

అంతెత్తు వున్న హోర్డింగ్ దబదబమని చప్పుడు చేసింది.

స్ట్రోకర్ నోట్ల ప్లాట్‌ఫాం మీద నిల్చుని వీధిలోకి చూస్తున్నాడు.

ఉన్నట్టుండి బ్యాంక్ భవనం కుప్పకూలిపోయింది. వెనకనుంచి ఎవరో తోసినట్టుగా కుప్పపడింది రోడ్డుమీదికి.

సంకేతమనుకున్నాడు స్ట్రోకర్ మనస్సులో.

జీవితానికిదే ఆఖరు. భయం పెచ్చరిల్లింది ప్రేగుల్లో.

ఆకాశం గడ్డకట్టి సముద్రంలా మీద పడబోతుందీవాళ' అనుకున్నాడు.

స్ట్రోకర్ అనుకున్నట్టే జరిగింది.

స్ట్రోకర్ దారుశిల్పంలోకి అడుగుపెట్టిన కొద్దిక్షణాల్లోనే పెద్ద పెద్ద శబ్దాలు మొదలయ్యాయి. ప్రాణభీతిలో చప్పుడు చెయ్యకుండా నిల్చున్నారు లోపల.

శబ్దాల మోత ఎక్కువయ్యింది.

పిరమిడ్ల నిర్మాణానికి వుపయోగించే రాళ్ళ బ్లాకులంత సైజులో పెద్ద పెద్ద వడగండ్లు దభాల్ దభాల్‌మని ఆ మూలొకటి ఈ మూలొకటి, దారుశిల్పాల పక్కవీధిలో నగరం మొత్తం వరుసగా పడ్తున్నాయి.

అంతటా పెనుఘోష.

భవనాల మీద పడ్డ రాళ్ళు భవనాల్ని పూర్తిగా నేలమట్టం చేస్తున్నాయి. రోడ్డు మీదపడి అడుగుల గోతులు పడుతున్నాయి.

దేన్నీ వదలకుండా అన్నింటి మీదా వెళ్ళి విసురుగా పడ్తున్నాయి.

అనేక ప్రాంతాల్లో మంటలు లేచాయి.

చుట్టూరా ఎక్కడ చూసినా పొగలు.

వడగండ్ల తాకిడికి నిప్పు అంటుకుని పెట్రోలు బంకులు పేలిపోతున్నాయి.

విమానాశ్రయాల మీదా, జైళ్లమీదా అన్నింటి మీదా అన్నింట్నీ ధ్వంసం చేస్తూ పడ్తున్నాయి.

"లోకం అంటుకున్నాది"

భయంతో గొంతుక్కూచున్న స్ట్రోకర్ పెదాలు కదిపాడు.

వాళ్ళిద్దరూ రొమ్ము భాగంలోకి వెళ్ళి కూర్చున్నారు.

ఒక కిటికీ తెరిచే వుంది.

ఇద్దరూ తడిసిన షర్టుల్ని పిండి ఆరేసారు హేంగర్లలో.

నెమ్మదిగా గాలికి కదులుతూ గుండ్రంగా తిరుగుతున్నాయి టీ షర్టులు.

"ఆఫ్రికన్ సఫారి 35" దాని పక్కనే స్ట్రోకర్ టీ షర్టు. గ్రీన్ లేదు.

సాలోచనగా బెంగగా టీషర్టుల వైపు చూస్తోన్న ఎడ్వర్డ్‌కి ఇకారస్ గుర్తుకొచ్చాడు.

"ఏమైపోయాడో" బయటకే అన్నాడు స్ట్రోకర్ని వుద్దేశించి.

'పది రోజుల్నించీ లేడు పాపం"

"చనిపోయుంటాడు" ఎడ్వర్డ్.

"యింకా బతుకుతాడా ?"

"కనీసం చెప్పకుండా వెళ్ళిపోయాడు. ఏదైనా అయితే ఎవరు బాధ్యులు ? ఎవరి నెత్తి మీదకొస్తుంది?" స్ట్రోకర్.

ఎడ్వర్డ్ ఏమీ మాట్లాడలేదు స్ట్రోకర్ కోపాన్ని అంగీకరిస్తున్నట్టుగా మౌనం వహించేడు. అతని మనసులో ఇకారస్ మెదుల్తున్నాడు.

స్ట్రోకరే మళ్ళీ మాట్లాడాడు. చిరాగ్గా, నిస్సహాయంగా ఎడ్వర్డ్ కళ్ళలోకి చూస్తూ. "ఎన్ని చెప్పినా విన్లేదు. వాస్తవాలు వేరని చెప్పాను. అహం ! మొద్దుబారినతనం! తన చావేదో తను చావనీ! వేరేవాడి బాధ్యతలెవరూ భుజాన వేసుకోరు!".

తగ్గు ముఖం పట్టిందనుకున్నా మళ్ళీ ఉధృతమైంది.

ఎడ్వర్డ్ సూర్యకాంతం పువ్వుల పరుపు కిందనున్న కాటన్ బండిల్ని చించి కొంత కాటన్ని స్ట్రోకర్‌కిచ్చాడు.

ఇద్దరూ కాటన్ని చెవుల్లో కుక్కుకుని గట్టిగా చెవులు మూసుకున్నారు.

రొమ్ము భాగంలో వున్న కిటికీకి ఎదురుగా వీపులు ఆన్చి కూర్చుని చూస్తున్నారు.

పెద్ద పెద్ద బండల్లా పడుతోన్న వడగళ్ళనీ, భళ్ళున బ్రద్దలై నేలకూలుతున్న నిర్మాణాల్ని చూస్తున్నారు.

ఒక్కోసారి కిటికీని మూసేటంత పెద్ద వడగళ్ళు పడుతున్నాయి.

"దీంట్లోంచి వెళ్ళిపోవాలి మనం. దీని మీద పడవని గ్యారంటీ లేదు"

సుమారు మూడు గంటల పాటు కుండపోతగా పడ్డాయి వడగళ్ళు.

దారుశిల్పాలకి అనుకునే పెద్ద గొయ్యిపడింది.

కొద్దిగా తెరపి ఇవ్వడంతో దారుశిల్పంలోంచి ఇద్దరూ దిగారు కిందకి.

ఎడ్వర్డ్ రోడ్డుమీద కొచ్చి నేలమట్టమైపోయిన భవనాల్ని చూస్తున్నాడు.

అక్కడొక్కటీ యిక్కడొకటీ బాంబుల్లా పడ్తూనే వున్నాయి వడగళ్ళు

యింకా గొయ్యిలోనే వున్న స్ట్రోకర్ తన చుట్టూరా నీడ అంచు కదులుతుండటం గమనించాడు.

అర్థమయ్యింది!

దారుశిల్పం వంగుతోంది.

"స్ట్రోకర్ వచ్చేసేయ్ పైకి" భయంతో అరుస్తున్నాడు ఎడ్వర్డ్ గొయ్యి బయట నుండి.

పెద్ద దారుశిల్పం క్రమక్రమంగా వంగుతోంది.

కూలుతోన్న దారుశిల్పం నీడలోంచి బయటపడ్డానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాడు స్ట్రోకర్.

ఎడ్వర్డ్ నీడ దగ్గరకెళ్ళాడు.

నీడలోకి చెయ్యిచాచి స్ట్రోకర్‌ని అందుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

కానీ లాభం లేకపోయింది.

ఉన్నట్టుండి పెద్ద శబ్దంతో దారుశిల్పం గొయ్యి మీద పడిపోయింది.

ఐస్‌బర్గ్‌లాగా ముక్కలైపోయింది.

స్ట్రోకర్ సమూలంగా చిదిగిపోయుంటాడు.

ఎడ్వర్డ్‌కి చెయ్యి, కాళ్ళూ విరిగిపోయాయి.

ఎడ్వర్డ్ కాళ్ళీడ్చుకుంటూ ఎక్కడ దాక్కున్నాడో తెలీదు.

మళ్ళీ వడగళ్ళ వాన మొదలైంది.

31

ఇకారస్‌కి ఇవేమీ తెలీదు.

భూమి కిందిలోకంలో కొండల మెట్లెక్కి తను వేసిన పెయింటింగ్స్ ఈడ్చుకుంటూ గొయ్యిలోంచి బయటకొచ్చాడు.

గొయ్యంతా చల్లగా బురదగా వుంది. వడగళ్ళు కలిసి నీళ్ళు గొయ్యిలోకి దిగుతున్నాయి.

ఉదయం ఎనిమిది గంటలు కావొస్తోంది.

చుట్టుపక్కల శిథిలాల్ని చూస్తో నిల్చున్నాడు ఇకారస్.

శిథిలాల గుట్ట; మహా మైదానం మీద సూర్యకాంతి కొత్తగా, స్వచ్ఛంగా పడుతోంది.

ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలు.

తాము ఇంతకు ముందున్న చౌరస్తాను ఎలాగోలా చేరుకున్నాడు ఇకారస్.

దారుశిల్పాలు ముక్కలు ముక్కలైపోయాయి.

కూలిన గోడల కిందా, మట్టి కిందా కూరుకుపోయాయి.

ఎడ్వర్డ్ ఎక్కువగా యిష్టపడే sick people అట్ట కనిపించింది.

దాని మీంచి మంచు నీళ్ళు పారుతున్నాయి. అంతటా చలి.

అటూ ఇటూ పరిగెత్తి

"ఎడ్వర్డ్ ! స్ట్రోకర్ !"

"స్ట్రోకర్ ! ఎడ్వర్డ్" అరిచాడు.

ఎక్కడ్నుంచీ శబ్దం లేదు. అరుపు లేదు. మూలుగు లేదు.

"చనిపోయుంటారు"

దారుశిల్పాలు వున్న ఎర్రని యిసుక మేట మీద ఇకారస్ తను వేసిన పెయింటింగ్స్‌ని మట్టిలో నిలబెట్టాడు.

వరసగా ఐదో ఆరో తనకి నచ్చినవి అమర్చాడు.

దూరంగా గోడ శిథిలం మీద నిల్చుని వాటికేసి చూస్తున్నాడు.

ఈ పెయింటింగ్స్ అన్నింటికీ 'ది డార్క్ వరండాస్' అని పేరుపెట్టాడు. మొదటి పెయింటింగ్ తనకి బాగా నచ్చింది.

మోచేతి వరకూ ఒక చెయ్యి కత్తిరించి పడి వుంటుందా కాన్వాస్ మీద. దాన్ని చూస్తే నిజమైన మాంసఖండమే అని భ్రమిస్తారు ఎవరైనా. కత్తిరించిన భాగంలోంచి అంటే మోచేతిలోంచి ఎడారి యిసుకా. ఆ ఇసుకతో పాటూ కొన్ని గోళీకాయలు బయటపడ్డట్టుగా చిత్రించాడు. యాదృచ్ఛికంగా మిగతా పెయింటింగ్‌లలో కూడా గోళీకాయలే కనిపిస్తాయి. ఉదాహరణకు దాని పక్కనే వున్న పెయింటింగ్‌లో తిరగేసిన స్వర్ణపు వక్షోజం నిండా గోళీకాయలు. దాన్ని చూస్తే నిండా ధాన్యం వున్న సోల గుర్తుకొస్తుంది. మరో కాన్వాసులో నగ్నస్తనాల నిండా గోళీకాయలు నిండి వేలాడుతుంటాయి. చర్మం లేదు. నిండా గోళీకాయలు మాత్రమే కనిపిస్తాయి. దాని పక్కనే మరొక పెయింటింగ్.

ఆ పెయింటింగ్స్ అక్కడ అలాగే వదిలేసి శిథిలాల మధ్యగా నడవడం ప్రారంభించేడు. నీళ్ళలో నాని తన గ్రీస్ టీ షర్ట్ కనిపించింది దాన్ని పిండి భుజాన వేసుకున్నాడు.

దూరంగా సముద్రపు ఘోష.

మెట్లు తప్ప మిగతాదంతా కూలిపోయిన బ్యాంకు శిథిలాల దగ్గరకి వెళ్ళి మెట్లెక్కి చూసాడు.

అప్పుడు కనిపించింది. అల్లకల్లోలంగా వున్న సముద్రం.

సముద్రమంతా తిరుగుతోంది లోలోపల.

మెట్లు దిగి అటువైపు పరిగెత్తాడు ఇకారస్.

32

సముద్రపు ఒడ్డులో అన్నింటి కన్నా ఎత్తున వున్న బండ మీద నిల్చున్నాడు ఇకారస్.

సముద్రం భయంకరంగా ఘోషిస్తోంది. జంతువులా.

సముద్ర జలాల నిండా దేహాలు. మనుషులవీ, జంతువులవీ, సమస్త జీవులవీ.

సముద్రపు ఒడ్డున యింకా అక్కడక్కడా మనుషులు.

పెనుగులాడుతున్నారు. ఒడ్డుని కరుచుకుని.

చేతులతో ఒడ్డుని పట్టుకునేందుకు విఫలయత్నం చేస్తున్నారు.

పెనుగాలి నాల్కలతో సముద్రం వాళ్ళని లాక్కుంటోంది లోపలికి.

కొన్ని దేహాలు ఎక్కడ్నుంచో విసురుగా వచ్చి పడ్తున్నాయి సముద్రంలో.

కొన్ని సముద్రంలో ఎత్తుగా వున్న రాళ్ళకి కొట్టుకుని చిదిగిపోతున్నాయి.

ఎందుకో ఏడుస్తున్నాడు ఇకారస్.

దుఃఖానికి అంతం లేదు.

దూరంగా మధ్య సముద్రంలో అదృశ్యపు మహా చేతులు.

సముద్రంలోంచి మానవదేహాల్ని దోసిళ్ళలో పైకి తీసుకుంటూ కొన్ని మళ్ళీ పడి పోతున్నాయి సముద్రంలో. అంతెత్తులోంచీ.

సముద్రం వేనవేల గాలినాల్కలతో భయంకరమైన ఆకలితో సమస్తాన్ని తనలోకి లాక్కుంటుంది.

ఇటు శిథిలాలు కూడా కదలడం మొదలయ్యాయి.

ఇకారస్ బండ దిగి రైల్వేస్టేషన్ వైపు గబగబా నడవడం ప్రారంభించేడు.

స్టేషన్ మొత్తం శిథిలమైపోయింది.

ఒక రైలింజన్ తప్ప.

రైల్వేస్టేషన్‌కు చేరుకోగానే స్టేషనుముందు ఎడ్లబండీ, లాంతరు కనిపించింది. ఇకారస్ ఆశ్చర్యపోయాడు.

బండిగూడు లోంచి అమ్మాయెవరో సంతోషంగా తల బయటపెట్టి నవ్వింది.

ఇకారస్ పరుగు పరుగున వెళ్ళబోయాడు.

బండి మొత్తం ఏటి ఇసుకలోకి మారిపోయి కూలిపోయింది.

విసురుగా అసహనంతో రైలింజన్‌లోకి వెళ్ళి ఇంజన్ స్టార్ట్ చేశాడు.

"చలో" అన్నాడు ఇకారస్ కోపంతో.

పెద్దగా కూతవేసుకుంటూ స్టేషన్ నుండి బయలుదేరింది రైలింజన్.
కిటికీకి తల ఆన్చి మగతగా నిద్రపోయాడు ఇకారస్.

* * *

అయితే ఎడ్వంచర్ ఇప్పుడే మొదలయ్యింది.
ఇకారస్ ఆ రైలింజన్‌తో ముప్పయ్ వింత పట్టణాలు తిరుగుతాడు.
మరో ముప్పయ్ ఐదేళ్ళు బతుకుతాడు.

* * *

నిశ్శబ్ద రహస్య స్నేహితుడు

ప్రభు

'ఫ్యూనరల్ ప్రీస్ట్' ఇది గంగాధర్ నాకు పెట్టిన పేరు. కాకినాడ మెయిన్ రోడ్‌లో ఎస్.ఆర్.ఎమ్.టి. పక్కన చిన్న సందు మొదట్లో బాషా అనే ఒకాయన టీబండి దగ్గర సాయంత్రాలు కలిసేవాళ్ళం సాహితీ మిత్రులం. ఎప్పుడూ గంగాధర్, నేనూ, కాకినాడ సిద్ధార్థ, వసంత్ లాంటి వాళ్ళం ఉండేవాళ్ళం. తరచుగా టి.ఎస్.ఎన్.రాజు, జగదీష్, చెక్కపల్లి శ్రీను, రామచంద్రారెడ్డి, ఎం.ఎస్.నాయుడు, ఎం.ఎస్. సూర్యనారాయణ, ఇబ్రహీం, అమీనుద్దీన్, ఎప్పుడైనా అమరనాథ్, చిరంజీవివర్మ, సన్ని విజయకృష్ణ లాంటి వాళ్ళు కలిసేవాళ్ళు. ఒక కవిత పైన గంటలకొద్దీ చర్చ నడిచేది. ఎవరు వచ్చినా రాకపోయినా సాయంత్రమయ్యేసరికి అక్కడ ముందుగా చేరేది నేనే కాబట్టేమో పైగా చర్చ నడిపించే వాణ్ణి కాబట్టీ ఫ్యూనరల్ ప్రీస్ట్ అనేవాడు.

యవ్వనానికీ కవిత్వానికీ ఉద్వేగ సంబంధం ఉంటుందనుకుంట. ప్రతిరోజూ నాలుగైదు కవితలు పైగా రాసి చర్చించేయడం అప్పుడే ఉంటుంది. కవిత్వం ఉంటుంది. మనం ఉంటాం. అంతే. ఇంకేదీ ఉండదు. చిన్న కదలిక... చిన్న అక్షరం... చిన్న వాక్యం... ఏదైనా ఒక ఉత్సవ సంరంభం. ఒక జాతర. తరువాత కూడా రాస్తాం. తరువాత కూడా చదువుతాం. కానీ ఈ ప్రవాహం పాపి కొండల దగ్గర గోదావరిలా నెమ్మదైనది.

యవ్వన సీనియరున్నైన నాకు తొలియవ్వనుడైన గంగాధర్ చెలికాడు. 1993-94ల కాలంలో ఉద్యమ జీవితాన్ని వదిలి వచ్చినపుడు పరిచయమైనవాడు గంగాధర్. తరచుగా రాసేవాడు. అరుదుగా మాట్లాడే వాడు.మనిషిగా ముడుచుకుని కవిత్వంగా వికసించేవాడు. చోడవరంలో 1996లో జరిగిన ఒక కవితా వీక్షణం అనే కార్యక్రమంలో తన రెండు కవితా తునకలు(ఫ్రాగ్మెంట్స్) ఇచ్చాడు. కానీ చదవ లేదు. బయటకి వచ్చేసాడు. "బాదుడు కార్యక్రమం ఎట్లా వుంటదో తెలియదు గానీ, నేను మైకు ముందుకు వెళ్ళి వివరించగలనో లేదో కానీ అ లైన్లు ఇచ్చిన పొద్దున్నించే గుండె దడగా వుంది. సమయం దగ్గరైనప్పుడు అది మరింత హెచ్చయింది. డిప్రెషన్ సర్కిల్స్‌లోకి పోయి ముడుచుకుపోయింది. ఇదీ నా దౌర్భాగ్యపు పరిస్థితి." అని రాసాడు.

యేట్స్‌ని కోట్ చేస్తూ "ఇతరులతో దెబ్బలాటకు దిగితే వాక్చాతుర్యం వస్తుంది. అదే తనతో తాను దెబ్బలాటకు దిగితే కవిత్వం వస్తుంది." తనకు ఏ దెబ్బలాటా రాదని రాసుకున్నాడు.

బొడ్డపాడు నడి గడ్డలో పుట్టి పెరిగిన గంగాధర్ బొడ్డు సింహాచలం, పాపమ్మల నాలుగో సంతానం. తూర్పుకనుమల్లోని చిత్రకొండ ప్రాంతంలో సీలేరు దగ్గర కొంత కాలం ఉన్నాడు. కవితాత్మకంగా చెప్పాలంటే ఆ లోతైన పచ్చదనం ఎత్తైన గాంభీర్యం ఆకట్టుకుని ఉంటాయి. లౌకికంగా చెపితే ఏ చొరవా లేని వాడు. పది మాటలకి ఒక మాటా మాటాడ్డు.

వాళ్ళ నాన్నగారు కరెంటు ఆఫీసులో పని. ఆయనకు తోడుగా ఉండేవాడు. అలా కాకినాడ వచ్చాడు. కాకినాడ, ప్రత్తిపాడు, ఏలేశ్వరం లాంటి చోట్ల అప్పటి ఎం.ఎల్ పార్టీల వాళ్ళతో,ముఖ్యం అప్పటి ఐపిఎఫ్‌తో, దళిత ఉద్యమకారులతో విద్యార్థులతో రచయితలతో తిరిగాడు. ఏమీ మాట్లాడని వాడిగా ఎక్కువగా చదివేవాడిగా అతడు గుర్తు. 'కాకినాడలో ఉన్నప్పుడే అతను సోవియట్ సాహిత్యాన్ని ఎక్కువగా చదువుతుండేవాడు. ఖగోళ విషయాలపై ఆసక్తి ఎక్కువ. ఇల్లు వుంది. ఆస్తి ఉంది. కానీ అది ఆకర్షించలేదు ఆయనను. తన భావాలు పంచుకునే కవుల అన్వేషణలో ఉండేవాడు. అట్టడుగు కార్మికులతో గడపడానికి ఇష్టపడేవాడు అంటూ గుర్తు చేసుకున్నారు ఆనాటి ఐపీఎఫ్ నాయకుడు మూర్తి.

అతడు నిశ్శబంగా చేతిలో చేయివేసి నడిచే స్నేహితుడు.

కానీ కొంత నిగూఢంగా ఉండేవాడేమో! చాలా పరిచయం, స్నేహం తరువాత కూడా వాళ్ళయింటికి వెళ్దామనే వాడు కాదు. ఒకసారి ఎవరో వ్యక్తి ద్వారా తనకి ఆరోగ్యం బాగాలేదని కబురు పెట్టాడు. ఆ చిన్న యింటికి వెళ్ళాం. దాదాపుగా అపస్మారకంగా ఉన్నాడు. ఒక్కడే ఉన్నాడు. వాళ్ళ నాన్న గారు ఊరు వెళ్ళారట. మేం అతన్ని ఆసుపత్రికి తీసుకు వెళ్ళాకా డాక్టరు ఎసిడిటీ వల్ల అన్నారు. ఇంతకీ ఈ ఎసిడిటీకి కారణం అప్పటికి మూడురోజులుగా ఏమీ తినడం లేదు. నీరసంతో కడుపులో ఆమ్లంతో సొమ్మసిల్లినట్టయి ఉన్నాడు. మేం బాధపడీ, తిట్టాకా అతనన్న మాట 'ఈవేళ మీరు లేకపోతే నేను అయిపోదును'

ఎందుకిలా ఉంటాడా అనుకునేవాళ్ళం. అడిగితే 'అబ్బే అలగేం లేదు' అనేవాడు.

ఈవేళ అతను రాసిన ఉత్తరాలన్నీ చదువుతుంటే కవిత్వం కాక అతను రాసిందేం లేదు అని తెలుస్తోంది. అవును ఇదే జ్వరంతో ఆనాడు నేనూ ఉన్నాను కాబట్టి అప్పుడు అనిపించ లేదు గానీ ఇప్పుడు బాగా తెలుస్తోంది.

జీవితాన్ని అతను అర్థం చేసుకున్న తీరు ఏమిటీ అని నాకెప్పుడూ ఆలోచన వస్తుంది. ఎప్పుడూ తాపీ పని, ఎలక్ట్రికల్ పనీ, కూలి పని లాంటివి ఎంచుకుని మరీ చేసేవాడు.

'ఎంత అస్పష్టంగా ఎంత అసమానత్వంగా ఉందీ లోకం! మెర్సిడెస్ వెహికిల్‌కీ, హెడ్ ఏక్ హిట్టెడ్ వర్కర్స్ వెర్ట్‌బ్రె కి ఎంత అసమానత్వము ఉందీ అనేది రకరకాల విషయాలపై వాదులాడుకునే అకడమీషియన్స్‌కి ఒళ్ళు చెమటలు పట్టేలా చెప్పాల్సినవసరం ఉంది. తాగుబోతు భర్తకీ భార్యకీ మధ్యన ఉండే జీవితపు సుఖం, దిగులూ రంపం పళ్ళలాగా చేరిపోయి విడిపోయి ఉంది. నగరంలో వుండే లిక్కర్ కాంపౌండ్స్‌కీ ఈవెనింగ్ పార్క్‌లు, హోటళ్లకి మధ్యన ఎంత తేడా ఉంది. కొత్తగా తెలుసుకోవల్సిన విషయం కాదు. కానీ స్టిల్ ఆ పరిస్థితి అస్తిత్వాన్ని మెజారిటీ ఆఫ్ బీయింగ్స్‌ని కడగండ్లకూ విశ్రాంతి లేని జీవితానికీ బలిచేస్తోంది. ఇవన్నీ ఊకదంపుడు విషయాలెట్లా అయిపోయాయి?'

హైదరాబాద్‌లో ఉన్న కాలంలో గంగాధర్ నిశ్శబ్దంగా చాలా మంది హృదయాలలోకి చొరబడ్డాడు. ప్రత్యేకంగా ఉండే అతని కవిత్వ సృజన మనల్ని మరో లోకంలోకి తీసుకుపోతుంది. దేశ దిమ్మరులు, తాగుబోతులు, ఇల్లూవాకిలీ లేని జంగములు, అమ్మదేవతల్లాంటి పల్లె స్త్రీమూర్తులు, అతి తక్కువ కూలికి గొడ్డు చాకిరీ చేసే మనుషులు అతని కవిత్వంలో కనిపిస్తారు. కానీ వాళ్ళంతా గొప్ప చిత్రకారుడు చిత్రించిన కళాఖండాల్లా కనిపిస్తారు. బాధనీ జీవితంలోని సంబరాన్నీ ఉట్టిపుణ్యానికే ఆనందపడే మనుషుల్నీ తన కవిత్వంలో చిత్రించుకున్నాడు.

హైదరాబాద్ జీవితాన్ని అతడు ప్రేమతోనూ ద్వేషంతోనూ గడిపినట్టున్నాడు. 'హైదరాబాద్ ఎన్ని గాయాలు నా కోసం ఉంచితేనేం? గాయాలంటే సరదా పడే వయసులో వున్నాను.' అని రాసాడు. అంతే కాదు 'పదిమందీ పరస్పరం మోసం చేస్తూ పోయే గుంపులో మోసం చెల్లుతుంది. కానీ పది మందీ దు:ఖంతోనూ, దిగులుతోనూ బతికే గుంపులో ఇవన్నీ ఎలా సాధ్యం మిత్రుడా?...ఈ మనుషుల్నందర్నీ

శిక్షించడానికి ఒక మహా బాక్సింగ్ పిడికిలి అవసరం.' అని కూడా రాసాడు.

రాస్కల్నికోవ్ లాగా ఏమి ఆలోచించాడో ఊహించలేం కానీ తనది కాని నగరంలో ఒక అగంతుకుడిలాగా తిరిగాడు. 'ఒకణ్ని హత్య చేయాలనుకున్నాను. వాడి ముందే కవిత రాశాను. అతడు అందరితోనూ చిరునవ్వుతో చక్కగా మాట్లాడుతున్నాడు. నేనీ లోకంలో బతకాలంటే నేనూ ఆ మార్గాన్నే అనుసరించాలా.. లేదా వాణ్ని శిక్షించాలా...' అని ప్రశ్నించుకున్నాడు.

ఆత్మహత్య చాలా చిత్రమైంది. దానిలో దు:ఖంతో పాటు నిస్సహాయత ఉంటుంది. లేదా వ్యక్తిగత దౌర్బల్యంతో పాటు సామాజిక వైఫల్యం ఉంటుంది. ఏ దు:ఖం ఏ నిస్సహాయత, ఏ వ్యక్తిగత దౌర్బల్యం, ఏ సామాజిక వైఫల్యం గంగాధర్‌ని చెరువులో ముంచాయో తెలియదు.

'తను ప్రేమించిన మనిషి తన కళ్ళ ముందే ప్రమాదంలో చనిపోవడం కళ్ళారా చూసి షాక్‌కి గురై మానసికంగా కుంగిపోయాడు. మరణం కూడా మర్మం గానే ముగిసింది. "బొడ్డపాడులో జన్మించడం అదృష్టంగా భావిస్తున్నాను. గర్వ పడుతున్నాను. నా మరణానికి నేనే బాధ్యుడను' అని చీటి రాసి చెప్పుల కింద పెట్టి వుంది. ఆయన శరీరం చెరువులో తేలి ఉండగా ప్రజలు గుర్తించారు.'

"సింధూలోయ నల్లని మట్టి దిబ్బల వాలుల్లో
కాళ్ళీడ్చుకుంటూ నే నడుస్తున్నప్పుడు
యేరుకొచ్చిన మట్టి పిడత నిండా కన్నీళ్ళు నింపి బిరడా బిగియించి ఉంచేను"
అవే మిగిలాయి మనకి.

5 మే, 2020

MRUTANAGARAMLO

By Chitrakonda Gangadhar

"రకరకాల మనుషులున్నారిక్కడ. భిక్షగాళ్ళూ, రోడ్లను వూడ్చే వాళ్ళూ, పాయిఖానాల్నీ, ఉచ్చలదొడ్లనీ కడిగేవాళ్ళు, భవనాల్ని నిర్మించేవాళ్ళు, ఫ్యాక్టరీల్లో ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నవాళ్ళు, హోటల్ పనివాళ్ళు, వేశ్యలు, పూలమ్ముకునే వాళ్ళు, ఆఫీసు బాయ్‌లు, సెక్యూరిటీగార్డులు, భయస్థులు మానసిక రోగులు, ఆత్మహత్యలకు విఫలయత్నాలు చేసిన వాళ్ళు, పారిపోయినవాళ్ళు, కాలాన్ని వ్యర్థం చేసినవాళ్ళు, పెళ్ళి కాని వాళ్ళు, భవిష్యత్ చీకటి నోరు ముందున్న వాళ్ళు, ఎటుపోవాలో దిక్కు తెలియనవాళ్ళు, జీవితాన్నీ రాత్రుల్ని ఎవరెవరి సుఖాలకో అర్పించినవాళ్ళు, తాగుబోతులు, యంత్రాలు మధ్య పడిపోయి కాటన్‌లైన వాళ్ళు, కలల రాకుమారులు ఎందరో వున్నారు. హంతకులున్నారు."

"మీలో గొప్పవాళ్ళున్నారు, దైవసమానులు, క్రమశిక్షణ నియమ నిబంధనలు గలవాళ్లు, ఆదర్శులు, తెలివైన వాళ్ళు, ధనికులున్నారు."

పల్లవి

పల్లవి పబ్లికేషన్స్

59-1-23/2, అశోక్ నగర్

విజయవాడ - 520 010